www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 3-5-2026 | పేజీలు: 18 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 24 సంచిక (Issue) : 56 | శ్రీ పరాభవ నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: విదియ తె.3:02 తదుపరి తదియ, నక్షత్రం: విశాఖ ఉ.7:10 తదుపరి అనూరాధ, వర్జ్యం: ఉ.11:38-1:25, దుర్ముహూర్తం: సా.4:51-5:41, అమృతఘడియలు: రా.10:21-12:08, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 5:51, సూర్యాస్తమయం: 6:32, | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 3-5-2026
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
గుంటూరు సిటీ



ఇక మా 39 ఏళ్ల ఘన చరిత్ర చూపితే...
ఈ పేజీలే పట్టవు.. ఈ నేలపై పోటీనే మిగలదు!
అత్యధిక డాక్టర్ సీట్లు శ్రీచైతన్య విజయవాడ విద్యార్థులవే

Sri Chaitanya's NEET 2025 TOP RANKS IN ALL INDIA OPEN CATEGORY

RANK	Name	Appl. No.
108	R BRAHMANI	Appl. No.250410053079
116	KANDREGULA NITHI	Appl. No.250411110941
129	B V ABHINAY CHOWDARY	Appl. No.250410061099
132	UTKARSH JHA	Appl. No.250410441511*
133	S K MAHAMMAD SOHAEL	Appl. No.250410233201
158	DIVYA	Appl. No.250410401431
170	TANMAY TEJUS	Appl. No.250411343969*
192	NAGA MANASVINI SIVA	Appl. No.250410556842
206	PRATEEK SINGH	Appl. No.250410166703*
208	A MATAM ANAGHA	Appl. No.250410017501
222	PONTHALA TRIVIKRAM	Appl. No.250410169349
225	PANSHUL SINGH	Appl. No.250410078657*
228	CHADA AKSHITH	Appl. No.250410097993
233	NIVEDITA GUPTA	Appl. No.250410106793*
238	TATINENI SREENIDHI	Appl. No.250411598023
249	VADAPALLI VALLI DEVASENA	Appl. No.250410014655
258	R JAGANNIVASAM	Appl. No.250410083597*
265	SABBANI LALITH VARENYA	Appl. No.250410057971
286	HEM HASITH NATTAVA	Appl. No.250410009889
294	NITESH R DIPALI	Appl. No.250410268406
298	SAUMYE GOYAL	Appl. No.250410002220*
308	SHRUTI BOYANI	Appl. No.250410269921
311	YASHITA	Appl. No.250410303113*
336	P RACHALA SHAINAND	Appl. No.250410061602
341	MOHAMMED YUSUF	Appl. No.250410017595*
345	M VAISHNAVI	Appl. No.250411403613
358	DASARI JAHNAVI	Appl. No.250410750810
363	ANUJ GUPTA	Appl. No.250410719335*
388	LALIT SAI KOSARAJU	Appl. No.250410041557
401	ANAS MUZAFFAR	Appl. No.250410040852
403	ASHUTOSH VERMA	Appl. No.250411080554*
430	OM ANAND	Appl. No.250410002649*
432	AYAN AADEEP	Appl. No.250410016650*
433	PAGADPWAR HARSHIT	Appl. No.250410177804
443	RUCHI GOYAL	Appl. No. 250410071325
444	KRUTHIKA J	Appl. No.250411497663
464	UNNATI GARG	Appl. No.250410024445*
469	KOLAN AKHIRANAND REDDY	Appl. No.250410050112
473	JASWATH C S	Appl. No.250410134137
510	PRATYUSH PANDEY	Appl. No.250410702013*
516	OBULAM AARUSH LAKSHMAN	Appl. No.250410097734
519	SURYANSH SINGH PATEL	Appl. No.250410056570*
551	M CHANDAN ABHINAV SAI	Appl. No.250410600042
553	SIDDHARTH SASIKUMAR	Appl. No.250410002036
565	GURU SAI L V	Appl. No.250410428332
583	AGARWAL ANANYA	Appl. No.250410044730*
601	NAVEEN JAYAVEL V	Appl. No.250410202861
609	DAVAN BABU	Appl. No.250410128098
612	HEMILA PATEL	Appl. No.250410052230*
617	PRITHVI S	Appl. No.250410169533
629	SARTHAK S VALEKAR	Appl. No.250410228418
643	AVANTHIKA SUBASH	Appl. No.250410442476
654	SHAIK NIHAL PARVEZ	Appl. No.250411053696
660	HARISH GOUTHAM	Appl. No.250410235806
672	MARRAPU JAYADEEP	Appl. No.250410050652
681	SYEDA FARIYA ADEEN	Appl. No.250410017889
682	HARDIK KAPOOR	Appl. No.250410007041
706	NALLAM VAMSI KRISHNA	Appl. No.250410077741
710	KOSURI EEKSHITH VARMA	Appl. No.250410620416
714	CHENNAMARAJU PRAKHYA	Appl. No.250410051947
718	BEHARA SAI SAATVIKA	Appl. No.250410081021
723	MADHUMITA JOSHI	Appl. No.250410112258
738	TIRUMANI DEZINY	Appl. No.250410243206
764	NIDHEESH VINAY RAO	Appl. No.250410058172
765	ASHUTHOSH M	Appl. No.250410079723
767	BANDLAMUDI CHANAKYA	Appl. No.250410579953
803	NIHAL SAGAR VISHNU	Appl. No.250410180924
817	ZAHEDA AREEBA	Appl. No.250410026151
830	P RUDRA SRI GANESH	Appl. No.250410282124
840	M AKUL YADAV	Appl. No.250410530843
857	VEDANT PATIL	Appl. No.250410014255*
861	KORADALA PRAGNA	Appl. No.250410383865
871	A TANUSHREE	Appl. No.250410191374
875	GIRADA LAKSHMI CHARAN	Appl. No.250410455787
879	CHETAN SAI V	Appl. No.250410094970
903	ATHARVA	Appl. No.250410588881*
933	ADVIKA MULLAPUDI	Appl. No.250410652496
935	JAVVAJI RUPESH	Appl. No.250410422563
939	ARNAV JAIN	Appl. No.250410082504
1032	S KIRAN REDDY ADDULA	Appl. No.250410145361
1047	JOSHI JIGISHA	Appl. No.250411665876*
1054	MUMMANEEDI THARUN TEJA	Appl. No.250410411090
1058	S PRATEEK REDDY MAALLEM	Appl. No.250410173978
1073	NOOTI KALYAN	Appl. No.250410034313
1079	PALURI SAI PRANAY	Appl. No.250410373053
1093	V C PRAKHYATH REDDY	Appl. No.250410239711
1125	YADAV DESH GAURAV	Appl. No.250410266896*
1158	RATHI SNEHA	Appl. No.250410118678*
1169	G SAI KOUSHIK REDDY	Appl. No.250410548233
1178	BANOTHU DHEERAJ KUMAR	Appl. No.250410546302
1182	KOPPU JAGADEESH	Appl. No.250410519552
1187	HEMANTH RATNAKAR	Appl. No.250410118784
1198	VENNAMPALLY SPOORTHY	Appl. No.250410395165
1258	MAHIMA P	Appl. No.250410007357
1260	MEDA SAI MEDHA	Appl. No.250410128422
1325	N GALAPPA YADAWAD	Appl. No.250410253540
1335	G KUNDANESWARI	Appl. No.250410036194
1355	YARAMALA MANISH	Appl. No.250410099219
1360	K KHUSHEENDRA VARMA	Appl. No.250410516136
1362	KONDA AISHWARYA	Appl. No.250410172914
1368	PAAVAS GARG	Appl. No.250410106743
1400	GUDUGUNTLA GAYATHRI	Appl. No.250410056502
1441	VIJAYA VIKRANTH VED	Appl. No.250410564251
1457	MUSKAN GARG	Appl. No.250411311109*
1487	SARVESH R	Appl. No.250410405966
1496	MADDURU SREE KEERTANA	Appl. No.250410041027
1507	AGNIKA SUNIL	Appl. No.250410046631
1545	NARAYANI C M	Appl. No.250410820061
1549	V RAMANAGOUDAR	Appl. No.250410071525
1580	KSHITIJ GUDLA	Appl. No.250410038981
1583	B PRAKASH REDDY SADHU	Appl. No.250410064604
1605	URVISH GHYAR	Appl. No.250410083561*
1615	B CHETHAN REDDY	Appl. No.250410030736
1624	VORAGANTI ABHIGNA	Appl. No.250410056321
1646	B SAI ANUGHNA	Appl. No.250410583799
1655	B VENKAT DHEERAJ REDDY	Appl. No.250410111326
1680	DARAM ACHYUTH	Appl. No.250410357821
1688	PANDALA SRI AKSHITH	Appl. No.250410085787
1690	SYEDA ZUNAIRA KIRMANI	Appl. No.250410015550
1722	SREERAM NATTI	Appl. No.250410100485
1746	ANUMALA AASHRITHA	Appl. No.250410017966
1749	G YUGA VIPLOVE REDDY	Appl. No.250410766295
1769	P S S S RAMA KISHORE	Appl. No.250410520707
1791	PALLI TARACHANDRA	Appl. No.250410044272
1806	MAMILLAPALLY SIDHARDH	Appl. No.250410137149
1849	RAHNATH UNNISA	Appl. No.250410090011
1852	K JWALITHA	Appl. No.250410020023
1872	DEEPITHA H M	Appl. No.250410386447
1875	N KOUSIK ARAVETI	Appl. No.250410112862
1884	SAKARAY AISHWARYA	Appl. No.250410058174
1885	G PRATHMESH SHANKAR	Appl. No.250410345898
1891	K PALASH ANJAN	Appl. No.250410076773
1895	YADA NEEHARIKA SRI	Appl. No.250410078595
1910	D A VINAY MALLESH KUMAR	Appl. No.250410031985
1920	SAI SAMARTH BHASHYAM	Appl. No.250410116039
1946	S KAMAL KRISHNA YADAV	Appl. No.250410212600
1957	SIRI REDDY JAMBULA	Appl. No.250410606341
1960	JYOSTNA MACHERLA	Appl. No.250410124714
1978	BACCHEWAL SHRESTA	Appl. No.250410064823
1982	NINAAD V ABBUR	Appl. No.250410063015
1989	R HARI RAAM	Appl. No.250410271249

ఆలిండియా ఓపెన్ కేటగిరి 100లోపు ర్యాంకులు **16**

ఆలిండియా ఓపెన్ కేటగిరి 500లోపు ర్యాంకులు **55**

ఆలిండియా ఓపెన్ కేటగిరి 1000లోపు ర్యాంకులు **95**

ఆలిండియా ఆల్ కేటగిరి 100లోపు ర్యాంకులు **49**

ఆలిండియా ఆల్ కేటగిరి 500లోపు ర్యాంకులు **172**

ఆలిండియా ఆల్ కేటగిరి 1000లోపు ర్యాంకులు **294**

NEET 2025 లో శ్రీచైతన్య ర్యాంకులు **22,320+**

Sri Chaitanya VAIDYAH
NEET LONGTERM PROGRAM
ADMISSIONS OPEN

Sri Chaitanya's revolutionary **VAIDYAH Program** for NEET Long-Term aspirants has delivered unmatched success in NEET . With a focused curriculum, expert mentorship and rigorous training, 2 out of every 3 students have achieved their dream of entering top government medical colleges!

- Personalized guidance by senior faculty
- Daily practice & intensive revision
- Stress-free, student-friendly learning environment
- Proven track record of top ranks and high selection ratio

Scan QR Code for NEET Long-term

VIJAYAWADA: GIRLS RESI: SRI VYBHAVI-8008232244, 9515914411 | BOYS RESI: SRIPRADHA BHAVAN-9177954222, 8977288668, 9100085360 | DAYS: INDRA TOWERS - 9676398777, 8142566888, 9849488444 |VISAKHAPATNAM: BOYS RESI: SRI PADHA BHAVAN, DWARAKANAGAR-9177524187, 8106034888| GIRLS RESI: SRI VAIBHAVI CAMPUS, WALTAIR UPLANDS-8790563336, 7396555694 | SRI PADHA BHAVAN, BOYAPALEM 9494012024, 7989126399, 9177201369 | DAYS: SRI PADHA BHAVAN, DWARAKANAGAR 9177524187, 8106034888 | SOUDHAMINI SOUDHA CAMPUS, GAJUWAKA 9177643514, 9908953988 | RAMAN BHAVAN, KURMANNAPALEM-8985645131,9848375896 | TIRUPATHI: DAYS & RESI BOYS:MAIN CAMPUS: 0877-2284474, 0877-2252535, 9966445018, 9912340877 | VEDA VYAS BHAVAN-3-8978333491 | DAYS & RESI GIRLS: VEDA VYAS BHAVAN-1- 9100091734, 9398279448 | NELLORE-9701977666 | KURNOOL: DAYS: PADMAVATHI BHAVAN-9494668663, 9515982277 | ANANTHAPUR-9100026952, 9704511666 | KAKINADA: DAYS & RESI: KAKINADA CAMPUS - 9494666361, 9493788099 | RAJAHMUNDARY: 9652990151, 9177665465 | GUNTUR: DAYS & RESI: NEET LONG TERM CAMPUS- 9704288444, 9502875525, 9177503618, 9100918604 | TIRUPATHI: VEDAVYAS-1: 9100091734, 9398279448 | VEDAVYAS-3: 8978333491 | MAIN CAMPUS: 0877-2284474, 0877-2252535, 9966445018, 9912340877

శ్రీచైతన్య విద్యాసంస్థలు

www.srichaitanya.net | Ph: 040 66 06 06 06

T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice. | Note: The information is as per students feedback | *DLP

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 3-5-2026 | Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

లోకేశ్ చేతలే జవాబు



..ఒక ప్రాంతీయ పార్టీ మూడు తరాల నాయకత్వంలో సజీవంగా, పరిపుష్ఠంగా ఉండటం ఆషామాషీ కాదు.

..ద్రవిడ పార్టీల తర్వాత అంత సుదీర్ఘ చరిత్ర ఉన్న ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం నిలబడింది. రాష్ట్రం విడిపోయినా, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితమైనా తెలుగుదేశం పార్టీ తన ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తోంది. తెలంగాణలో పార్టీ పటిష్ఠంగా లేకపోయినా ఓటర్లు మాత్రం ఉన్నారు.

..పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడైన లోకేశ్ చేతికి భవిష్యత్తులో పార్టీ పగ్గాలు అందుతాయి. ఎన్టీఆర్ హయాంతో పోల్చితే ఇప్పుడు రాజకీయాలకు నిర్వచనమే మారిపోయింది. పెద్ద మనిషి తరహా రాజకీయాలకు కాలం చెల్లింది. జగన్మోహన్ రెడ్డి వంటి వారి ప్రవేశంతో రాజకీయాల స్వరూపమే మారిపోయింది.

..చంద్రబాబు ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం ఈ తరం తెలుగుదేశం పార్టీ శ్రేణులకు రుచించడం లేదు. నాయకుడి నిర్ణయాలు, చర్యలు వేగంగా ఉండాలని వారు కోరుకుంటున్నారు. రాజకీయాల్లో ఓర్పు అవసరం అని మరచిపోతున్నారు. కంటికి కన్ను, పంటికి పన్ను సిద్ధాంతాన్ని అమలు చేయాలని వారు ఆశిస్తున్నారు.

..ఎన్టీఆర్ తర్వాత పార్టీ భవిష్యత్తు ఏమిటి? అన్న సందేహాలను చంద్రబాబు పటాపంచలు చేశారు. ఇప్పుడు చంద్రబాబు తర్వాత? అని ఎదురయ్యే ఈ తరహా సందేహాలకు చంద్రబాబు క్రియాశీలకంగా ఉన్నప్పుడే లోకేశ్ తన చేతల ద్వారా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి తనలో పరిణతి వచ్చిందని నమ్మకం కలిగించడంలో మాత్రం లోకేశ్ సక్సెస్ అయ్యారు. పాత తరాన్ని, నవ తరాన్ని కలుపుకొని పోవాల్సిన బాధ్యత లోకేశ్‌పై ఉంది.

..తెలుగునాట వారసులుగా రంగ ప్రవేశం చేసి రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న వారిలో లోకేశ్ మూడవ వ్యక్తి. అధినాయకుల వారసులైనప్పటికీ కార్యకర్తలు, ప్రజలతో మమేకం అయ్యే వారికే ఆదరణ ఉంటుంది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

సమూల ప్రక్షాళన!



టీటీడీ పాలనను పునర్వ్యవస్థీకరించాలి

బోర్డుల లాభాపేక్షతోనే సమస్యలన్నీ

- భక్తిభావం లేని స్వార్థపరులతోనే తలనొప్పులు
- డబ్బుపై ఆశలేని స్వామి భక్తులకే చోటుండాలి
- పూర్తికాలం రాజకీయ నేతలతోనే అసలు సమస్య
- కీలక విభాగాలకు నిపుణులే అధికారులుగా ఉండాలి
- కొనుగోలు, నియంత్రణ, పర్యవేక్షణపై పూర్తి నిఘా
- బలమైన ఫిర్యాదులు, పరిష్కార వ్యవస్థ ఏర్పాటు
- ఆర్థిక సలహాదారు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్లను బయట నుంచి పంపించాలి 11
- సర్కారుకు కమిటీల సిఫారసుల సారమిదే..

అఖిలాండకోటి నాయకుడు తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలేమిటో తెలిసిపోయింది. భక్తిభావం ఉండాల్సినచోట... స్వలాభం, స్వార్థం, ఆశ్రిత పక్షపాతం తాండవిస్తూ ఆలయ ఆచారాలను మంటగలుపుతున్నాయని నిర్ధారణ అయింది. తిరుమలేశుడి పాదపద్మాల చెంత భక్తిభావంతో పనిచేస్తూ, ధర్మకర్తలుగా నిస్వార్థంగా మెలగాల్సిన వారు, ఫక్తు స్వార్థపరులుగా వ్యవహరిస్తున్నారని వెలుగులోకి వచ్చింది. ఎవరెన్ని తప్పులుచేసినా, వాటిని కనిపెడుతూ, ధర్మం దారిలోనే నడవాల్సిన అధికార వ్యవస్థ సైతం సర్వభ్రష్టత్వం చెందిందని విచారణ నివేదికలు ఘోషిస్తున్నాయి. అంటే, తిరుమల తిరుపతి దేవస్థాన వ్యవహారాలను తక్షణమే ప్రక్షాళన చేయాల్సిన అవసరం వచ్చిందని ఈ పరిణామాలు విస్పష్టమైన సంకేతాలు ఇస్తున్నాయి. దేవదేవుడి చెంత ధర్మం దారి తప్పకుండా, భక్తిభావం ముసుగులో అరాచకాలు రాజ్యమేలకుండా, బోర్డు, అధికారవ్యవస్థ దారి తప్పకుండా సమూల మార్పులు తీసుకు రావాల్సిన సమయం ఇంతకుమించి మరొకటి లేదని నిన్నటి సీబీఐ సిట్ రిపోర్టు, తాజాగా రిటైర్డు సీఎస్ దినేశ్‌కుమార్ ఏకసభ్య కమిషన్ నివేదిక స్పష్టం చేస్తున్నాయి.


డిప్యూటీ సీఎం పవన్‌ను పరామర్శిస్తున్న సీఎం చంద్రబాబు

డిప్యూటీ సీఎం నివాసానికి ముఖ్యమంత్రి

- శస్త్ర చికిత్స అనంతరం పవన్‌కు బాబు పరామర్శ
- ఆయన ఆరోగ్య పరిస్థితిని వివరించిన వైద్యులు
- తగిన విశ్రాంతి తీసుకొని పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం 11

మళ్లీ యుద్ధం వైపు?

- అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు
- పిచ్చోళ్ల వద్ద అణ్వాయుధాలు ఉండొద్దు
- ఇరాన్ ప్రతిపాదనలు నాకు నచ్చలేదు
- లక్ష్యాలు పూర్తిగాకుండా యుద్ధం ముగిసిపోకూడదు: ట్రంప్
- దౌత్య పరిష్కారంపై అమెరికాకు చిత్తశుద్ధి లేదు: ఇరాన్

బువ్వకు కొట్లాట

- హోర్ముజ్ దిగ్బంధనంతో ఎరువుల కొరత తీవ్రం
- తగ్గుతున్న పంటల దిగుబడి
- వారానికి వెయ్యి కోట్ల భోజనాలు తగ్గే ప్రమాదం
- తిండి కోసం బిడ్డింగ్‌వార్ ముప్పు
- యారా ఇంటర్నేషనల్ సీఈవో స్వీన్ తోర్ ఆందోళన

ఎయిరిండియా అంతర్జాతీయ సర్వీసుల కుదింపు

- పెరిగిన చమురు ధరలు, గగనతలాలపై ఆంక్షలతో నిర్ణయం 14

మట్టిలో మాణిక్యాలు!

- స్టేట్ టాపర్లుగా రైతులు, కూలీల బిడ్డలు
- పదో తరగతి 'ప్రభుత్వ' టాపర్లలో సగం మంది నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారే
- కార్పొరేట్‌కు దీటైన మార్కులు సాధించి శభాష్ అనిపించుకుంటున్న విద్యార్థులు 3
- సర్కార్ బడిని సగర్వంగా నిలబెట్టిన చిన్నారులు

'పది'లో మంత్రులు, ఎమ్మెల్యేల సత్తా!

- గత నవంబరులో జరిగిన 'మాక్ అసెంబ్లీ'లో పాల్గొన్న విద్యార్థులకు అత్యుత్తమ మార్కులు
- 594 మార్కులతో 'అసెంబ్లీ స్పీకర్' స్వాతి టాప్
- 'డిప్యూటీ సీఎం' వీర ఉదయశ్రీ 592 మార్కులు
- 571 మార్కులతో 'ప్రతిపక్ష నేత' సౌమ్య
- 580పైగా మార్కులు సాధించిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల పాత్రధారులు 3

పబ్లిక్ స్థలాల్లో నమాజ్ హక్కేమీ కాదు

- ప్రజా భద్రత దృష్ట్యా ప్రభుత్వం నియంత్రించవచ్చు
- ప్రైవేటు స్థలాల్లో చేసినా పరిమితులు ఉంటాయి 14
- అలహాబాద్ హైకోర్టు తీర్పు

పోలీసింగ్ మూడో నేత్రంగా ఆర్టీజీఎస్!

- అదృశ్య కేసుల్లో ఫొటోల ఆధారంగా గుర్తింపు
- నేరాల కట్టడికీ తోడ్పాటు
- పోలీసుల పనిని సులభతరం చేస్తున్న సేవలు 12

వారు రేషన్ డీలర్‌గా కొనసాగరాదు

- ప్రజాప్రతినిధులు, లాభదాయక పదవుల్లో ఉన్నవారికి వర్తింపు
- ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే ఓ పదవికి రాజీనామా చేయాలి: హైకోర్టు 9

మోదీపై పాఠం!

- గుజరాత్‌లోని ఓ వర్సిటీ నిర్ణయం 14

Sri Gosalites

4th Anniversary

NEET-2026 రాస్తున్న శ్రీ గోసలైట్స్ విద్యార్థులకు మరియు తెలుగు రాష్ట్రాల విద్యార్థులందరికీ

All the best

WILL REPEAT AND DEFEAT HISTORY IN NEET-2026

నీట్-2025లో, తెలుగు రాష్ట్రాల్లో వేరెవ్వరికీ సాధ్యపడని విధంగా, ఒక్క విజయవాడ బ్రాంచ్ నుండి మాత్రమే, అందరి కంటే అత్యధికంగా **1,413** మెడికల్ సీట్లు సాధించాము, ఇది చరిత్ర. **ఈ చరిత్రను రిపీట్ అండ్ డిఫీట్ చేయడానికి శ్రీ గోసలైట్స్ టీమ్ సిద్ధంగా ఉంది.** **నీట్-2026లో 2,000** మెడికల్ సీట్లు సాధించే లక్ష్యంతో ముందుకు వెళుతున్న శ్రీ గోసలైట్స్.

అమ్మలాంటి ప్రేమ.. నాన్నలాంటి బాధ్యత...

శ్రీ గోసలైట్స్ పట్ల అచంచల విశ్వాసంతో, ఎంతో నమ్మకంతో మా సంస్థలో తమ పిల్లలను NEET-2026 కొరకు జాయిన్ చేసిన తల్లిదండ్రులు అందరికీ మా కృతజ్ఞతాభివందనాలు. అలాగే, ఈ రోజు NEET పరీక్ష రాస్తున్న 2024-26 ఇంటర్మీడియట్ మరియు 2025-26 లాంగ్ టర్మ్ విద్యార్థులు అందరికీ మా శుభాశీస్సులు.

రెండు సంవత్సరాలుగా (2024-26) లేదా ఒక ఏడాదిగా (2025-26) అపారమైన పట్టుదలతో, క్రమశిక్షణతో మిమ్మల్ని అందరినీ NEET-2026 పరీక్షకు సన్నద్ధం చేసాము. మా మార్గదర్శకత్వాన్ని నమ్మండి. మీపై మీకున్న విశ్వాసాన్ని మరింత బలపరచుకోండి. పగలూ రాత్రీ మీరు పడిన కష్టాన్ని గుర్తుచుకోండి. ప్రశాంతంగా స్థిరంగా ఉండండి. మీరు అందరూ NEET-2026 పరీక్షను ఈ రోజు అద్భుతంగా రాయబోతున్నారు. మీపై మేము గానీ, మీ తల్లిదండ్రులు గానీ పూర్తి నమ్మకంతో ఉన్నాము. మీరు కూడా మీపై పూర్తి నమ్మకాన్ని ఉంచండి. ఈ ఏడాది మెడికల్ అడ్మిషన్స్‌లో మీరు ఖచ్చితంగా డాక్టర్ సీటును సాధిస్తారు. **All the Best... Let's Rock & Achieve the Dream.**

Waiting for all of you as medicos at reunion in February 2027

మీ నరేంద్ర బాబు, చైర్మన్ - ఉష, డైరెక్టర్

మా వెన్నుతట్టి, అడుగడుగునా మమ్మల్ని ప్రోత్సహించి, మా విజయాలకు మూలస్తంభాల్లా నిలబడిన మా శ్రేయోభిలాషులకు, ముఖ్యంగా విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు కృతజ్ఞతాభివందనాలు.

మీరే మా నమ్మకం, మీరే మా బలం, ముమ్మాటికీ ఇది మీ సంస్థ.



విజయవాడలో కేవలం ఒకే ఒక్క బ్రాంచ్‌తో, 5 సంవత్సరాలలో 5,779 మెడికల్ సీట్లు సాధించిన శ్రీ గోసలైట్స్

NEET-2021	NEET-2022	NEET-2023	NEET-2024	NEET-2025
724	1013	1237	1392	1413

NEET-2025 | Direct Inter | S PRAGNESHWAR RAO | H.No:1201101144 | Joined College JIPMER, Puducherry | 638 Marks

Direct Inter | G SATISH CHANDRA ROYAL | H.No:1205204473 | Joined College JIPMER, Puducherry | 634 Marks

1 RANK | తెలుగు రాష్ట్రాల్లో లాంగ్‌టర్మ్ కోచింగ్ నుండి ఫస్ట్ ర్యాంక్ | Long Term | YUVARAJ DJG | H.No:-1205104139 | Joined College AIIMS, New Delhi. | 632 Marks

NEET-2025లో దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించిన శ్రీ గోసలైట్స్ విద్యార్థులు.

AIIMS

- AIIMS, BHUBANESWAR: R M SAI VARDHAN H.No:1205111248; N S M GNANA CHAND H.No:1205208137
- AIIMS, MANGALAGIRI: G VAISHNAVI H.No:1205211001; C S KUMAR REDDY H.No:1205104372; M SAHITHI NAVYA H.No:1205210077; VARADA HAINDAVI H.No:1205105129; M S BALA VASRAM NAIK H.No:1205109420
- AIIMS, BIBI NAGAR: K BHAVISHYA REDDY H.No:1205210147
- AIIMS, RAIPUR: M G SUDHEER KUMAR H.No:1205105177
- AIIMS, DEOGARH: MADDINA RISHI TEJ H.No:1205102416

JIPMER

- JIPMER, PUDUCHERRY: M KARTHIK H.No:1205112186; T MEGHANA H.No:1205115388; T HARSHITH H.No:1205209391
- JIPMER, KARAIKAL: B MEGHANA KIRANMAI H.No:1205101143; K SAI PRANAVI H.No:1205210398; B JAYAADITHYA H.No:1205113451; D YASHANTH KUMAR H.No:1205203389; P T B MANI SHANKAR H.No:1205102331; K AARON JONATHAN H.No:1205105093

OTHER STATE BEST COLLEGES

- LADY HARDINGE New Delhi: MOKANA ROSHINI H.No:1205110020
- CMC, Vellore: RAJALA YADEEDYA H.No:1220102264; PERATHOTI RACHEL H.No:1205212272
- BMC Banglore: B V N JAHNAVI YADAV H.No:1205106617
- MMC Chennai: I HARI CHANDANA H.No:1205209058
- STANLEY Chennai: KILARI ROSHAN H.No:1205104019
- MYSORE MC, KARNATAKA: PRAGUN SIMHA H.No:1205108260
- MADHURAI MC, TAMILNADU: G RAKSHITHA H.No:4122109473
- NALANDA MC, BIHAR: ANSHIKA SAH H.No:1205110472

NEET-2025లో అత్యుత్తమ ర్యాంకులతో, దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించిన శ్రీ గోసలైట్స్ విద్యార్థులు.

NATIONAL MEDICAL COLLEGES

S.No.	NAME OF THE MEDICAL COLLEGE	TOTAL
1	AIIMS, New Delhi	1
2	AIIMS, Bhubaneswar	2
3	AIIMS, MANGALAGIRI	5
4	AIIMS, Bibi Nagar	1
5	AIIMS, Raipur	1
6	AIIMS, Deogarh	1
7	JIPMER, PUDUCHERRY	5
8	JIPMER, KARAIKAL	6
9	BMC, BANGLORE	1
10	CMC, VELLORE	2
11	Lady Hardinge, New Delhi	1
12	MMC, CHENNAI	1
13	STANLEY MC, CHENNAI	1
	TOTAL	28

ANDHRA PRADESH MEDICAL COLLEGES

S.No.	NAME OF THE MEDICAL COLLEGE	TOTAL
1	AMCV - Andhra MC, Vizag	45
2	GMCG - GMC, Guntur	42
3	KMCK - Kurnool MC, Kurnool	65
4	RMCK - Rangaraya, Kakinada	43
5	SVMC - Sri Venkateswara, Tirupati	60
6	SMCV - Siddhartha, Vijayawada	37
7	ACSR - ACSR, Nellore	33
8	GMCK - GMC, Kadapa	43
9	GMCA - GMC, Anantapur	45
10	GMCO - GMC, Ongole	25
11	GMCS - GMC, Srikakulam	22
12	PADT - Padmavathi, Tirupati	24
13	GMCR - GMC, Rajahmundry	18
14	GMCM - GMC, Machilipatnam	30
15	GMCE - GMC, Eluru	28
16	GMCV - GMC, Vijayanagaram	15
17	GMCN - GMC, Nandyal	35
18	GMCP - GMC, Paderu	6
19	NRIM - NRI, Mangalagiri	26
20	ASRA - Ahsram, Eluru	43
21	NARN - Narayana, Nellore	42
22	GSLR - GSL, Rajahmundry	34
23	PSIM - Pinnamaneni, Gannavaram	22
24	KATR - Katuri, Chilakaluripeta	26
25	APLC - Apollo, Chittoor	32
26	KONA - Konaseema, Amalapuram	40
27	PESK - PES, Kuppam	27
28	MAHA - Maharajahs, Vijayanagaram	35
29	GEMS - GEMS, Srikakulam	26
30	NRVP - NRI, Vizag	40
31	SRMC - Santharam, Nandyal	61
32	VMCK - Viswabharathi, Kurnool	55
33	BMCT - Balaji, Tirupati	30
34	NIMR - Nimra, Ibrahimpatnam	18
35	FIMS - Fathima, Kadapa	15
36	AGMP - Anna Gowri, Puttur	44
37	GVPT - Gayatri, Visakhapatnam	25
	TOTAL	1257

TELANGANA MEDICAL COLLEGES

S.No.	NAME OF THE MEDICAL COLLEGE	TOTAL
1	GAND - Gandhi, Secunderabad	3
2	OMCH - Osmania, Hyderabad	6
3	ESIM - ESI, Hyderabad	7
4	KKTI - Kakatiya, Warangal	2
5	GVNZ - GMC, Nizamabad	2
6	RADL - RIIMS, Adilabad	1
7	GMCM - GMC, Mahabubnagar	1
8	SGMC - GMC, Siddipet	5
9	GSGR - GMC, Sangareddy	1
10	GMSR - GMC, Suryapet	1
11	GMNL - GMC, Nalgonda	1
12	GNGK - GMC, Nagarkurnool	1
13	GKRM - GMC, Karimnagar	1
14	GKMR - GMC, Kamareddy	1
15	GMHB - GMC, Mahabubabad	2
16	GVKB - GMC, Vikarabad	1
17	GSRC - GMC, Rajanna Sircilla	1
18	GJGN - GMC, Jangaon	1
19	GJTL - GMC, Jagityal	2
20	GNRM - GMC, Nirmal	1
21	GNRN - GMC, Narayanpet	1
22	GGWL - GMC, GADWAL	1
23	SIMS - Singareni, Ramagundam	2
24	GJBP - GMC, Jayashankar Bhupalpally	1
25	APLO - Apollo, Hyderabad	2
26	MAMS - Mamata, Bachupally	3
27	SVSM - S.V.S. MC, Mahabubnagar	2
28	KMNI - Kamineni, Narketpally	5
29	CARK - C Ananda Rao, Karimnagar	3
30	PRTM - Prathima, Karimnagar	3
31	BASK - Bhaskar, Moinabad	2
32	MMTA - Mamata, Khammam	8
33	CMRM - CMR, Medchal	2
34	DPMR - Dr Patnam, Chevella	2
35	MNRS - MNR MC, Sangareddy	2
36	AIMD - Arundathi, Dundigal	2
37	MAHE - Maheshwara, Patancheru	3
38	MHVR - Mahavir, Vikarabad	2
39	SURB - Surabhi, Siddipet	2
40	NOVA - Nova, Hayathnagar	3
41	FCIM - Father Colombo, Warangal	2
42	PRIW - Pratima, Warangal	3
43	TRRM - TRR, Patancheru	3
44	SHDN - SHADAN, Hyderabad	2
46	NIMG, GHATKESAR	3
47	Malla Reddy Women, Hyderabad	3
48	Malla Reddy, Hyderabad	2
	TOTAL	110

KARNATAKA MEDICAL COLLEGES

S.No.	NAME OF THE MEDICAL COLLEGE	TOTAL
1	Mysore MC, Karnataka	1
2	ESIC MC, Gulbarga, Karnataka	3
3	RIIMS, Bellari (GOVT.), Karnataka	1
4	AJIMS Mangalore, Karnataka	1
5	Adichunchanagiri IOMC, Karnataka	1
6	Vydehi IOMS, Banglore, Karnataka	1
7	SABVMCRI, Bengaluru, Karnataka	1
	TOTAL	9

TAMILNADU MEDICAL COLLEGES

S.No.	NAME OF THE MEDICAL COLLEGE	TOTAL
1	ESIM,CHENNAI	1
2	GMC, Nagapatnam, Tamilnadu	1
3	Madhurai MC, Tamilnadu	1
4	THIRUVALLUR MC, TAMILNADU	1
	TOTAL	4

OTHER STATES - MAIN COLLEGES

S.No.	NAME OF THE MEDICAL COLLEGE	TOTAL
1	ESIC, Kolkata	2
2	HITECH MCH, BHUBANESWAR	1
3	Nalanda MC, Bihar	1
4	AGARTALA GMC, TRIPURA	1
	TOTAL	5

సాధారణ విద్యార్థులను సైతం డాక్టర్స్‌గా తీర్చిదిద్దడానికి, మొట్టమొదటి సారిగా శ్రీ గోసలైట్స్ వినూత్నంగా రూపొందించిన

సరికొత్త సంచలన ప్రోగ్రాం

LT-GEAR UP

Long Term Gosalites Early Adaptation & Regulated Upgradation Program

బ్యాచ్ ప్రారంభం:	బ్యాచ్ ముగింపు:	ప్రోగ్రాం వ్యవధి:
15 మే 2026	మే 2027, మొదటి ఆదివారం	12 నెలలు

Program Structure

- **Gear 1** (మే 2026 - జూన్ 2026) ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ మరియు NEETకు అవసరమైన మాథమెటిక్స్ ఫండమెంటల్స్ బలోపేతం చేయడం
- **Gear 2** లాంగ్ టర్మ్ మైక్రో లెవెల్ 2027 కోచింగ్ (బయాలజీ లో 300 మార్కులు పైగా సాధించే విధంగా ప్రత్యేక దృష్టి పెడుతూ ఫిజిక్స్ కెమిస్ట్రీ లో మైక్రో లెవెల్లో 200 మార్కులు పైగా వచ్చే విధంగా ప్రోగ్రామ్స్ రూపొందించి కనీసం ఫ్రీ మెడికల్ సీటు సాధించడమే ధ్యేయం.)
- **Gear 3** (ఫిబ్రవరి 2027 - మార్చి 2027) ప్రతి వారం 3 పరీక్షలతో మొదటి రివిజన్ ప్రోగ్రాం
- **Gear 4** (ఏప్రిల్ 2027) సబ్జెక్ట్ వారీగా (ఒక్కొక్క సబ్జెక్ట్ కు 3 రోజులు) మారథాన్ క్లాస్ రివిజన్. (12 రోజులు)
- **Gear 5** (ఏప్రిల్ 2027 - మే 2027) పేపర్ డిస్కషన్‌తో 15 గ్రాండ్ టెస్ట్స్

బ్యాచ్ సైజ్ & క్యాంపస్ గర్ల్స్ - 300 మందికి మాత్రమే (పోరంకి క్యాంపస్) బాయ్స్ - 150 మందికి మాత్రమే (పెనమలూరు-1 క్యాంపస్)

ఫీజు వివరాలు జాయిన్ అయ్యే టైములో 2/3 వంతు ఫీజు చెల్లించాలి మెడికల్ సీటు సాధించిన తరువాతే 1/3 వంతు చెల్లించాలి

MBBS ఫ్రీ సీటు సాధించకపోతే, 1/3 ఫీజు చెల్లించకుండ రాయితీ ఇవ్వబడును

ఈ బ్యాచ్ పట్ల మీలో నమ్మకం, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ఈ ఫీజు స్ట్రక్చర్ రూపొందించబడింది

Scan to Register OR Message 'Hi' on Whatsapp 81878 71116

దేశంలోని అత్యుత్తమ మెడికల్ కాలేజీల్లో మరియు రాష్ట్రంలోని బెస్ట్ గవర్నమెంట్ కాలేజీల్లో సీట్లు సాధించడానికి సరికొత్తగా రూపొందించిన వినూత్న ప్రోగ్రాం.

Sri Gosalites LT-GOAL Batch

Long Term Gosalites ALpha Batch

బ్యాచ్ ప్రారంభం:	బ్యాచ్ ముగింపు:	ప్రోగ్రాం వ్యవధి:
జూన్ 2026, మొదటి వారం	మే 2027, మొదటి ఆదివారం	11 నెలలు

Program Structure

- **Phase 1** (జూన్ 2026 - జనవరి 2027) ప్రతిరోజూ ఉ. 7 నుంచి మ. 1 గంట వరకు బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులను కాన్సెప్ట్‌తో పాటు అప్లికేషన్ స్థాయిలో లోతుగా బోధిస్తూ, మ. 2:30 నుంచి రాత్రి 10:30 వరకు అకాడమిక్ డైరెక్టర్స్ మరియు సీనియర్ లెక్చరర్ల పర్యవేక్షణలో కౌన్సిలింగ్ అందించబడుతుంది.
- **Phase 2** (ఫిబ్రవరి 2027 - మార్చి 2027) ప్రతి వారం 3 పరీక్షలతో మొదటి రివిజన్ ప్రోగ్రాం (GRIP- Gosalites Revision Intensive Program)
- **Phase 3** (ఏప్రిల్ 2027) సబ్జెక్ట్ వారీగా (ఒక్కొక్క సబ్జెక్ట్ కు 3 రోజులు) మారథాన్ క్లాస్ రివిజన్. (12 రోజులు)
- **Phase 4** (ఏప్రిల్ 2027 - మే 2027) పేపర్ డిస్కషన్‌తో 15 గ్రాండ్ టెస్ట్స్

క్యాంపస్ గర్ల్స్ - గంగూర్ క్యాంపస్, బాయ్స్ - పెనమలూరు-1 క్యాంపస్

ఫీజు వివరాలు NEET 2026లో మీరు సాధించిన మార్కులకు అనుగుణంగా 90% వరకు ప్రత్యేక రాయితీలు కల్పించబడును. మీ NEET 2026 ఎగ్జామ్ పూర్తి అయిన రెండు మూడు రోజులలో వివరాలు తెలపగలము.

Scan to Register OR Message 'Hi' on Whatsapp 81878 71116

10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల కోసం, జీరో బేసిక్స్ నుంచి ప్రారంభించి, NCERT పరంగా NEET-2028 పరీక్షకు అవసరమైన కాన్సెప్ట్ లెర్నింగ్‌తో పాటు అప్లికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసే సమగ్ర మైక్రో-లెవెల్ ప్రోగ్రామ్ రూపొందించి, రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ తోనే డైరెక్ట్ గా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక మెడికల్ కాలేజీల్లో ఫ్రీ సీట్లు సాధించడమే ఈ ప్రోగ్రామ్ ప్రధాన లక్ష్యం.

Jr. Inter Elite Batch

బ్యాచ్ ప్రారంభం:	బ్యాచ్ ముగింపు:	ప్రోగ్రాం వ్యవధి:
మే 2026, చివరి వారం	మే 2028, మొదటి ఆదివారం	24 నెలలు

క్యాంపస్ గర్ల్స్ - శివ భవన్ | బాయ్స్ - పెనమలూరు-2 క్యాంపస్

పరిమిత అడ్మిషన్స్ మాత్రమే కలవు

ఫోన్స్: 98 582 18888, 98 583 18888, 98 584 18888

మీ డాక్టర్ లక్ష్యాన్ని సాధించేందుకు అహర్నిశలు కృషి చేస్తూ, ప్రేమతో తమ సేవలను అత్యుత్తమంగా అందించిన అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది అందరికీ శ్రీ గోసలైట్స్ సంస్థ తరపున హృదయ పూర్వక కృతజ్ఞతలు.

Sri Gosalites Medical Academy ...brand of future medicos

Sri Gosalites, Vijayawada

Garuda Castle, Salipeta Road, Poranki (V), Penamaluru (M), Vijayawada, AP.

VIJAYAWADA: 98 582 18888, 98 583 18888, 98 584 18888 | E: official@gosalites.com, gosalitesvja@gmail.com

www.gosalites.com /gosalites

Scan & Visit our Website

GreenFMC

మట్టిలో మాణిక్యాలు..

C/o కామన్ మెన్

స్టేట్ టాపర్లుగా రైతులు, కూలీల బిడ్డలు

» పదో తరగతి 'ప్రభుత్వ' టాపర్లలో సగం మంది నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మట్టిలో మాణిక్యాలు.. అనే దానికి సరైన అర్థం ఆ విద్యార్థులు! నిరుపేద కుటుంబాల్లో పుట్టిన వారంతా.. తమ తల్లిదండ్రులు ఏళ్లుగా పడుతున్న కష్టానికి తగిన ఫలితం అందించి, వారికి మర్చిపోలేని సంతోషాన్నిచ్చారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో పలువురు రైతులు, కూలీల బిడ్డలు, చిరుద్యోగుల పిల్లలు 'రాష్ట్రస్థాయి టాపర్లు'గా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వీరంతా.. కార్పొరేట్ స్కూళ్లతో సమానంగా అత్యుత్తమ మార్కులు సాధించి అందరి చేతా 'శభాష్' అనిపించుకుంటున్నారు! ప్రభుత్వ బడుల్లో చదివి.. స్టేట్ టాపర్లుగా నిలిచిన విద్యార్థుల్లో సగం మంది నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారున్నారు. పేదరికం అడ్డుగా ఉన్నప్పటికీ.. ఉపాధ్యాయుల శిక్షణలో కష్టపడి చదివి అత్యుత్తమ మార్కులు సాధించారు. నిరుపేద, చిన్నా చితకా ఉద్యోగాలు చేసుకొనే వారి కుటుంబాలకు చెందిన 13 మంది విద్యార్థులు 600 మార్కులకు గానూ 596, 595 మార్కులు సాధించారు. లక్షలకు లక్షలు ఫీజులు కట్టి చదివించే స్తోమత లేని కుటుంబాల్లో పుట్టిన వారంతా.. ఎలాగైనా సాధించాలనే పట్టుదలతో కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకు దీటుగా మార్కులు సాధించారు.

టాపర్లుగా నిలిచిన పేద విద్యార్థులు వీరే...

- దుల్ల చిన్నారి: కాకినాడ జిల్లాలోని సంపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 596 మార్కులు సాధించించి టాపర్‌గా నిలిచింది. ఆమె తండ్రి శ్రీనివాస్ దినసరి కూలీగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.
- సిరిగినీడి రిషిత లక్ష్మీ నిహారిక: అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని సమంతకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 596 మార్కులు సాధించింది. విద్యార్థిని తండ్రి వెంకట దుర్గారావు పెయింటర్‌గా పనిచేస్తున్నారు.
- బవిరెడ్డి దివ్య తేజశ్రీ: బాపట్ల జిల్లాలోని కొల్లూరు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 596 మార్కులు సాధించింది. ఈ బాలిక తండ్రి వరప్రసాద్ వ్యవసాయం చేసుకొనే ఓ రైతు.
- తనకంటి సాయిశ్రీ: నంద్యాల జిల్లాలోని నెరవాడ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివి 596 మార్కులు సాధించింది. సాయిశ్రీ తండ్రి చక్రపాణి ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు.
- ఎస్.దిషిత సాయి: తిరుపతి జిల్లాలోని వరదయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు తెచ్చుకుంది. దిషిత తండ్రి జగన్నాథం సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నారు.
- నంద్యాల కార్తీక: అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పి.లక్ష్మీవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించింది. ఆమె తండ్రి బ్రహ్మానందం జనరల్ స్టోర్‌ను నడుపుతుంటారు.
- పత్తి హర్షిణి: కాకినాడ జిల్లాలోని తుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు తెచ్చుకుంది. ఆమె తండ్రి రవి కిషోర్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.
- ఆర్.డి.వైష్ణవి: అన్నమయ్య జిల్లాలోని హెచ్.ఎస్.కోటపల్లి బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించింది. వైష్ణవి తండ్రి మునిరాజా ఇండియన్ గ్యాస్ కంపెనీలో పనిచేస్తున్నారు.
- కోల లక్ష్మీ వెంకటేశ్వర్: కడప జిల్లాలోని నాగులగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థి తండ్రి కులశేఖర్ దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.
- గాలిదేవర హర్షిణి సత్యదుర్గ: బీఆర్ అంబేద్కర్ కోనసీమలోని పి.లక్ష్మీవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించింది. సత్యదుర్గ తండ్రి శ్రీనివాసు హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో డెలివరీ వర్కర్‌గా పనిచేస్తున్నారు.
- కొర్రకూటి యశ్విత: నెల్లూరు జిల్లాలోని నాగుల వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించింది. యశ్విత తండ్రి వెంకటేశ్వర్లు ఓ రైతు.
- వేగిరాజు కావ్య హాసిని: కాకినాడలోని శ్రీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించింది. ఆమె తండ్రి రామలింగరాజు ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు.
- మహమ్మద్ ఏ ఫర్హీన్: విజయవాడలోని ఎస్‌టీబీ ఉన్నత పాఠశాలలో చదివి 595 మార్కులు సాధించింది. ఈ విద్యార్థిని తండ్రి ఫరూక్ అలీ ఓ షాపింగ్ మాల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు.

'పది'లో మంత్రులు, ఎమ్మెల్యేల సత్తా!

గత నవంబరులో జరిగిన 'మాక్ అసెంబ్లీ'లో పాల్గొన్న విద్యార్థులకు అత్యుత్తమ మార్కులు

» 594 మార్కులతో 'అసెంబ్లీ స్పీకర్' స్వాతి టాప్

» 'డిప్యూటీ సీఎం' వీర ఉదయశ్రీ 592 మార్కులు

» 571 మార్కులతో 'ప్రతిపక్ష నేత' సౌమ్య

» 580పైగా మార్కులు సాధించిన పలువురు ప్రజాప్రతినిధుల పాత్రధారులు



ఎస్.స్వాతి (స్పీకర్ పాత్రధారి)



పసల వీర ఉదయశ్రీ (డిప్యూటీ సీఎం పాత్రదారి)



సాయి సౌమ్య (ప్రతిపక్ష నేత పాత్రధారి)

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో స్పీకర్, డిప్యూటీ సీఎం, ప్రతిపక్ష నేత, మంత్రులు, ఎమ్మెల్యేలు అదరకొట్టారు! రాష్ట్రస్థాయిలో టాప్ మార్కులతో విజృంభించారు!! ఏంటి ఇదంతా? వారంతా పరీక్షలు రాయడం ఏంటి? టాప్ మార్కులు సాధించడం ఏంటి? అని అనుకుంటున్నారా..! రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గతేడాది నవంబరు 26న రాజధాని అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో విద్యార్థులతో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించిన విషయం గుర్తుంది కదా! ఆ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన విద్యార్థులు సీఎం, ప్రతిపక్ష నేత, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేల పాత్రలు పోషించారు. అసెంబ్లీ కార్యకలాపాలు సాగినట్టే.. ఆ రోజున మాక్ అసెంబ్లీ కూడా ఆసక్తికరంగా సాగింది. అధికార, విపక్ష సభ్యుల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో దద్దరిల్లింది. ప్రజా సమస్యలను ఎమ్మెల్యేల స్థానంలో విద్యార్థులు ఎత్తిచూపడం ఆకట్టుకుంది. నాడు మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థుల్లో చాలామంది ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటారు. కొంతమంది రాష్ట్ర స్థాయిలో టాపర్లుగా నిలిచారు. స్పీకర్ స్థానంలో సభా వ్యవహారాలు నడిపిన కాకినాడ జిల్లా శంఖవరం మండలం ఏపీ మోడల్ హైస్కూల్‌కు చెందిన సైపిరెడ్డి స్వాతి 594 మార్కులతో టాపర్‌గా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మోడల్ పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించింది. డిప్యూటీ సీఎం పాత్ర పోషించిన కడప జిల్లా శెట్టివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పసల వీర ఉదయశ్రీ 592 మార్కులతో అదరగొట్టింది. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఉదయశ్రీ.. ప్రభుత్వ పాఠశాలల వారీగా జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సాయి సౌమ్య ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఆమెకు 571 మార్కులు వచ్చాయి. రవాణాశాఖ మంత్రిగా వ్యవహరించిన చిత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.ప్రియదర్శిని 572 మార్కులు సాధించి స్కూల్ ఫస్టుగా నిలిచింది. అనంతపురం ఎమ్మెల్యేగా చేసిన విద్యార్థిని సదాఫ్ నాజ్ 588 మార్కులతో సత్తాచాటింది. తాడిపత్రి ఎమ్మెల్యే పాత్ర పోషించిన యాడికికి చెందిన విద్యార్థి అనిల్ కుమార్ 584 మార్కులతో అదరకొట్టాడు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా చేసిన తలారి అబిజ్ఞ 583 మార్కులు సాధించారు. ఇంకా మాక్ అసెంబ్లీలో పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్‌కు చెందిన రెడ్డి చంద్ర లాస్యకు 586, తమ్మినాన నవ్యశ్రీకి 587 మార్కులు వచ్చాయి. టెక్కలి జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన ఆర్.రష్మిక సంతోషి 585 మార్కులు సాధించింది. నరసన్నపేట మండలం కంబకాయిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వైశ్యరాజు భరత్ సాయి 583 మార్కులు సాధించాడు. ఎమ్మెల్యేగా వ్యవహరించిన పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం ఎం.సింగుపురం జడ్పీ హైస్కూలు విద్యార్థిని గంధారపు నిహారికకు 586 మార్కులు వచ్చాయి.

25 మంది టాపర్లకు విహారయాత్ర ఆఫర్

» ఎమ్మెల్యే మాధవి ప్రకటన

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 25 మంది విద్యార్థులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే గళ్లా మాధవి కీలక ప్రకటన చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు టాపర్ విద్యార్థులను త్వరలో విహారయాత్రకు తీసుకెళ్లనున్నట్లు శనివారం ఆమె తన కార్యాలయంలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కృషి, పట్టుదలతో గొప్ప విజయాలు సాధించగలరని నిరూపించారని అభినందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు, మరింత ఉత్సాహాన్ని కలిగించేందుకు విహారయాత్రను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఎస్సీలు మతం మారితే హోదా పోదు

» అగ్రవర్ణానికో న్యాయం.. మాకో న్యాయమా?

» చంద్రబాబు దృష్టికి రఘురామ వ్యవహారం: మందకృష్ణ మాదిగ



భీమవరం టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలకు చెందినవారు మతం మారినంత మాత్రాన వారి సామాజిక పరిస్థితులు, హోదా ఎక్కడా మారదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 'రాజ్యాంగం ఎస్సీలకు కల్పించిన సామాజిక స్థితిపై జరిగిన అవగాహన సదస్సులో శనివారం ఆయన మాట్లాడారు. "షెడ్యూల్ కులాల వారు క్రైస్తవమో మరొక మతమో తీసుకున్నంత మాత్రాన వారి సామాజిక హోదా, గౌరవం ఎక్కడా పెరగదు. ఎస్సీలు మతం మారితే రిజర్వేషన్లు పొందలేరని, ఎస్సీ హోదా ఉండదని సుప్రీం కోర్టు చెప్పడం రాజ్యాంగ విరుద్ధం. కులం, కుల వివక్ష ఉన్నంత కాలం ఎస్సీ, ఎస్టీ, ఇతరులకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే. ఆర్టికల్ 25.. ఏదైనా మతాన్ని, దైవాన్ని పూజించుకునే హక్కు, ప్రచారం చేసుకునే హక్కు కల్పించింది. కులవ్యవస్థ ఉన్నంతకాలం సామాజిక గుర్తింపులో అంతరాలు, ఆర్థిక అసమానతలు కొనసాగుతూనే ఉంటాయి. దళితులకు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగడానికి, కల్పించడానికి జాతీయస్థాయిలో ఉద్యమాన్ని ప్రారంభించాం. దీనికి చెందిన వారందరినీ ఒకే వేదిక మీదకు తీసుకువస్తున్నాం. అగ్రవర్ణాల వారు తమ మత ప్రచారం చేసుకుంటారు. వారికి ఎక్కడా అభ్యంతరాలు లేవని, హక్కుగా చెప్పుకొంటున్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న ఎస్సీలను ఈనాటికీ వివక్షతోనే చూస్తున్నారు. అగ్రవర్ణాలకు ఈబీసీ కోటా కింద రిజర్వేషన్లు వస్తూ ఉంటే ఎస్సీలను ఎస్సీ హోదా లేకుండా ఉండాలని కోరడం దారుణం" అని ఆయన పేర్కొన్నారు.

"డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు వ్యాఖ్యలు దళితులు, దళిత క్రైస్తవులు, క్రైస్తవులను అవమానించే విధంగా ఉన్నాయి. అవహేళన చేసే విధంగా ఉన్నాయి. ఆయన చేష్టలు, మాటలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. ఆయన వ్యవహార శైలి, ఇక్కడ జరుగుతున్న ఘటనలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళతాం. ఆయన చేస్తున్న పనులు టీడీపీకి, చంద్రబాబుకు దళిత సమాజాన్ని దూరం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వానికి నష్టం కలిగిస్తాయి. ఆయనపై చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి." అని మంద కృష్ణమాదిగ అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించండి

» ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయండి

» మంత్రి లోకేశ్ పనితీరు భేష్: వెంకయ్య



వెంకటాచలం, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, వాటిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో వెంకయ్యస్వామి జీవిత చరిత్ర ఆధారంగా రచించిన విశ్వంభరుడు పుస్తకాన్ని వెంకయ్య నాయుడు శనివారం ఆవిష్కరించి, ప్రసంగించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరు చాలా బాగుందని ప్రశంసించారు. రాష్ట్రంలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ఫలితాలు సాధించడంలో కష్టపడి పని చేసిన ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కూడా చాలావరకు మెరుగుపడ్డాయని, పాఠశాలల అభివృద్ధికి చాలా కృషి చేస్తున్నారన్నారు. విద్యాశాఖపై మంత్రి లోకేశ్ మరింత దృష్టి పెట్టి, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఆధునిక సౌకర్యాలు, వసతులు, సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యా శాఖలో ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయాలని, అవసరమైన చోట హాస్టళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని కోరారు. మంచి చేసేవారిని ప్రోత్సహించడం మన కార్తవ్యమన్నారు. వారసత్వ రాజకీయాలకు తాను వ్యతిరేకమని చెప్పారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యపరంగా వెంకయ్యస్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేశ్‌రెడ్డి, ఆశ్రమ ఈఓ బాలసుబ్రహ్మణ్యం, ఆశ్రమ కమిటీ సభ్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

'మనమిత్ర'లో రీవెరిఫికేషన్ జవాబుపత్రాలు

» డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు

అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి రీవెరిఫికేషన్ జవాబుపత్రాలను ఇక నుంచి మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్)లోనూ అందుబాటులో ఉంచనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మనమిత్ర ద్వారా స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అలాగే ఎప్పటిలాగే స్కూల్ లాగిన్లలోనూ అందుబాటులో ఉంటాయన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈ నెల 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక సబ్జెక్టుకు రీకౌంటింగ్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

లోకేశ్ చేతలే జవాబు!



తెలుగుదేశం పార్టీ నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు మూడో తరం సిద్ధమవుతోంది. ఒక ప్రాంతీయ పార్టీ మూడు తరాల నాయకత్వంలో సజీవంగా, పరిపుష్టంగా ఉండటం ఆషామాషీ కాదు. 'నాతో మొదలైన పార్టీ నాతోనే పోతుంది' అని పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు నిర్వేదంలో ఉన్నప్పుడు అన్నప్పటికీ నాలుగు దశాబ్దాలుగా పార్టీ సగర్వంగా నిలబడింది. మన దేశంలో తమిళనాడులో మాత్రమే ప్రాంతీయ పార్టీల సంస్కృతి ఉండేది. పెరియార్ రామస్వామి నాయకత్వంలో ప్రారంభమైన ద్రవిడ ఉద్యమం నుంచి అన్నాదురై అధ్యక్షతన డీఎంకే పార్టీ ఆవిర్భవించింది. ఆ తర్వాత డీఎంకే నాయకులైన కరుణానిధి, ఎంజీఆర్ మధ్య విభేదాలు వచ్చి అన్నాడీఎంకే ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఈ రెండు పార్టీలూ తమిళనాడును ఏలుతూనే ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలలో డీఎంకే, అన్నాడీఎంకేకు ఉన్న చరిత్ర మరే ఇతర ప్రాంతీయ పార్టీకీ లేదు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు, మధ్యలో వచ్చి పోయిన జనతా పార్టీ తమిళనాడులోని ఆ రెండు పార్టీలనూ ఏ మాత్రం కదిలించలేకపోయాయి. సినీ నటుడిగా మద్రాసులో ఉంటూ తమిళనాడు రాజకీయాలను దగ్గర నుంచి గమనించిన ఎన్టీఆర్, 1982లో తెలుగునాట తెలుగుదేశం పార్టీకి పురుడు పోశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొంది. జయాపజయాలను చవిచూసింది. 1984లో, 1995లో పార్టీలో సంక్షోభాలు తలెత్తాయి. ఎన్టీఆర్ జీవితంలోకి ఒక వ్యక్తి ప్రవేశించడంతో 1995లో పార్టీ నాయకత్వ మార్పిడి అనివార్యమైంది. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయుడి చేతికి పార్టీ పగ్గాలు వచ్చాయి. చంద్రబాబు నాయకత్వంలోకి వచ్చిన తర్వాత కూడా తెలుగుదేశం పార్టీ అనేక ఒడుదుడుకులు ఎదుర్కొంది. ద్రవిడ పార్టీల తర్వాత అంత సుదీర్ఘ చరిత్ర ఉన్న ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం నిలబడింది. రాష్ట్రం విడిపోయినా, విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితమైనా తెలుగుదేశం పార్టీ తన ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తోంది. తెలంగాణలో పార్టీ పటిష్ఠంగా లేకపోయినా ఓటర్లు మాత్రం ఉన్నారు. దేశంలో మరే ఇతర ప్రాంతీయ పార్టీకీ లేని ప్రత్యేకతలు తెలుగుదేశం పార్టీ సొంతం. ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తర్వాత అత్యధిక స్థానాలు గెలుచుకున్న తెలుగుదేశం పార్టీ... లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించింది. అప్పుడు భారతీయ జనతా పార్టీకి లోక్‌సభలో రెండే స్థానాలు ఉండగా, తెలుగుదేశం పార్టీకి 30 స్థానాలు ఉండేవి. ఇలాంటి సంచలనాలు ఎన్నో తెలుగుదేశం పార్టీ ఖాతాలో ఉన్నాయి. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ పదమూడు సంవత్సరాలే ఉండగా, 1995 నుంచి నేటి వరకు చంద్రబాబు నాయకత్వంలో ఆ పార్టీ అప్రతిహతంగా కొనసాగుతోంది.

> **లోకేశ్ ఈ మధ్య పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో వ్యక్తిగత అనుబంధాన్ని పెంచుకోవడం కోసం విందు సమావేశాలు నిర్వహించడం కచ్చితంగా అభినందనీయం. అంతకు ముందు పార్టీకి చెందిన తొలి తరం కార్యకర్తలను కూడా ప్రత్యేకంగా ఎంపిక చేసి విందుకు ఆహ్వానించారు. అసలైన కార్యకర్తలు కోరుకునేది ఇలాంటి ఆత్మీయ అనుబంధాలే. సమర్థుడైన నాయకుడిగా ఎదగడం మాత్రమే కాదు– ఒక మంచి వ్యక్తిగా ఆవిష్కృతమవడం కూడా ముఖ్యమే. తాను స్వయంగా చెప్పుకొంటున్నట్టుగా తాను ఎవరి నుంచి వారసత్వం పొందుతున్నారో వారికి అగౌరవం తీసుకురాకుండా మంచి నాయకుడిగా, మంచి మనిషిగా లోకేశ్ ఎదగాలని ఆశిద్దాం.**

కొత్త తరం.. కొత్త పథం!

తెలుగునాట సరికొత్త రాజకీయాలకు ఒరవడి సృష్టించిన ఘనత తెలుగుదేశం పార్టీది. 1982లో పార్టీ ఏర్పాటును ప్రకటించిన ఎన్టీఆర్ 1983 ఎన్నికల్లో దాదాపు 90 శాతం సీట్లను యువతకు, రాజకీయ నేపథ్యం లేని వారికి కేటాయించారు. ఆ విధంగా రాజకీయాల్లోకి కొత్త తరం వచ్చింది. యనమల రామకృష్ణుడు, అశోక గజపతిరాజు, ప్రతిభా భారతి, తెలంగాణలో ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన జీవన్ రెడ్డి వంటి వారు ఆ తరానికి చెందినవారే. చనిపోయిన వారు, రాజకీయాల నుంచి నిష్క్రమించిన వారు పోగా తొలి తరానికి చెందిన తెలుగుదేశం నాయకులు ఇప్పుడు ఆ పార్టీలో అరుదుగా కనిపిస్తారు. తెలుగుదేశం పార్టీతో ఆ తరానికి ఎన్నో భావోద్వేగాలు ఉండేవి. పార్టీ మహానాడులను పండుగలా జరుపుకొనే వారు. రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ ఒక విశ్వవిద్యాలయం వంటిది. ఆ పార్టీ బీట్ చూసిన నా వంటి జర్నలిస్టులు కూడా నాటి రాజకీయాలను దగ్గర నుంచి గమనిస్తూ ఎంతో నేర్చుకున్నాం. ఇందిరాగాంధీ హత్యానంతరం 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికలను కవర్ చేయడానికి 'ఔట్‌లుక్' మ్యాగజైన్ ప్రతినిధి ఢిల్లీ నుంచి వచ్చారు. అప్పటికి కొద్ది నెలల ముందే నేను 'ఆంధ్రజ్యోతి' పత్రికలో విలేఖరిగా చేరాను. అప్పుడు బ్యూరో చీఫ్‌గా ఉన్న ఐ.వెంకట్రావ్ ఔట్‌లుక్ ప్రతినిధితో పాటు నన్ను కూడా వెళ్లి ఎన్నికల కవరేజీ చేయవలసిందిగా కోరారు. అలా ఎన్నికలను ప్రత్యక్షంగా చూసే అవకాశం నాకు లభించింది. మేం తిరిగి వచ్చిన తర్వాత 'పరిస్థితి ఏమిటి?' అని వెంకట్రావ్ ప్రశ్నించగా, కర్నూలులో కోట్ల విజయభాస్కర రెడ్డి, నంద్యాలలో పెండేకంటి వెంకట సుబ్బయ్య ఒంగోలులో పులి వెంకట రెడ్డి, నరసరావుపేటలో కాసు బ్రహ్మానందరెడ్డి ఓడిపోతున్నారని చెప్పాను. ఇది ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే, ఆ స్థాయి నాయకులను సంచలనాత్మక రీతిలో ఓడించిన చరిత్ర తెలుగుదేశం పార్టీది. ఇలాంటి సంచలనాలకు చిరునామాగా ఉండిన తెలుగుదేశం పార్టీకి నాయకత్వం వహించడానికి మూడవ తరానికి చెందిన నారా లోకేశ్ ఇప్పుడు సిద్ధమవుతున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడైన లోకేశ్ మూడు రోజుల క్రితమే నూతన కమిటీతో పాటు బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబుకు నాయకత్వ మార్పిడి ఇలా సాఫీగా జరగలేదు. పార్టీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు ఆయనకు కుడి భుజంగా వ్యవహరించారు. ఎన్టీఆర్ పెద్దల్లుడు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు కూడా పార్టీలోనే ఉన్నప్పటికీ చంద్రబాబు నెంబర్ టూగా చలామణి అయ్యారు. ఎన్టీఆర్‌ను కలుసుకోలేకపోయిన నాయకులు, కార్యకర్తలను, స్థానికంగా, పార్టీపరంగా సమస్యలు ఎదుర్కొంటున్న వారందరినీ అర్ధ రాత్రి, అపరాత్రి అని చూడకుండా చంద్రబాబు కలుసుకొనే వారు. వారికి సాంత్వన కలిగించేవారు. అదే సమయంలో పార్టీలో నెంబర్ టూగా ఉన్న ఆయనను అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ టార్గెట్ చేసేది. దీంతో ఆయన అత్యంత జాగ్రత్తగా వ్యవహరించేవారు. ఈ కారణంగానే చంద్రబాబు ఇప్పటికీ ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. లోకేశ్ వలె చంద్రబాబుకు రాజకీయ కుటుంబ నేపథ్యం లేదు. కష్టాన్ని మాత్రమే నమ్ముకొని చంద్రబాబు రాజకీయాల్లో ఎదిగారు. భూదేవికి ఉన్నంత ఓర్పును సొంతం చేసుకున్నారు. ఫలితంగానే ఎన్టీఆర్ జీవితంలోకి ప్రవేశించిన వ్యక్తి కారణంగా 1995లో తిరుగుబాటు చోటుచేసుకున్నప్పుడు మెజారిటీ ఎమ్మెల్యేలు, నాయకులు చంద్రబాబు నాయకత్వాన్ని బలపరిచారు. ఆ వ్యక్తి ఎన్టీఆర్ జీవితంలోకి ప్రవేశించి అరాచకంగా వ్యవహరించి ఉండకపోతే చంద్రబాబు పరిస్థితి ఏమిటో తెలియదు.

సీన్ కట్ చేస్తే..

మొత్తంమీద మూడు దశాబ్దాలుగా చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ సురక్షితంగా ఉంది. ఇప్పుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడైన లోకేశ్ చేతికి భవిష్యత్తులో పార్టీ పగ్గాలు అందుతాయి. ఎన్టీఆర్ హయాంతో పోల్చితే ఇప్పుడు రాజకీయాలకు నిర్వచనమే మారిపోయింది. ఆ నాటి రాజకీయాలు వేరు– ఈనాటి రాజకీయాలు వేరు. పెద్ద మనిషి తరహా రాజకీయాలకు కాలం చెల్లింది. జగన్మోహన్ రెడ్డి వంటి వారి ప్రవేశంతో రాజకీయాల స్వరూపమే మారిపోయింది. కార్యకర్తల్లోనే కాదు, ప్రజల ఆలోచనా విధానం, ఆకాంక్షల్లో కూడా మార్పు వచ్చింది. ఈ కారణంగానే చంద్రబాబు ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం ఈ తరం తెలుగుదేశం పార్టీ శ్రేణులకు రుచించడం లేదు. నాయకుడి నిర్ణయాలు, చర్యలు వేగంగా ఉండాలని వారు కోరుకుంటున్నారు. రాజకీయాల్లో ఓర్పు అవసరం అని మరచిపోతున్నారు. కంటికి కన్ను పంటికి పన్ను సిద్ధాంతాన్ని అమలు చేయాలని వారు ఆశిస్తున్నారు. జగన్ రెడ్డి పాలనలో కష్టనష్టాలను చవిచూసిన వారు ప్రతీకారాన్ని కోరుకుంటున్నారు. ఎన్టీఆర్ ఆకస్మిక, అనూహ్య నిర్ణయాలకు చిరునామా కాగా, చంద్రబాబు సంగతి తెలిసిందే. మూడో తరానికి చెందిన లోకేశ్ తాత ఎన్టీఆర్ లక్షణాలు పుణికి పుచ్చుకున్నాడని చెబుతారు. నిర్ణయాలు తీసుకోవడంలో అతను వేగం ప్రదర్శిస్తున్నాడు. ఎన్టీఆర్ తర్వాత పార్టీ భవిష్యత్తు ఏమిటి? అన్న సందేహాలను చంద్రబాబు పటాపంచలు చేశారు. ఇప్పుడు చంద్రబాబు తర్వాత? అని ఎదురయ్యే ఈ తరహా సందేహాలకు చంద్రబాబు క్రియాశీలకంగా ఉన్నప్పుడే లోకేశ్ తన చేతల ద్వారా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. 2014 తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన లోకేశ్‌లో కొంత అపరిపక్వత కనిపించింది. దానికితోడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చినప్పుడు జగన్ రెడ్డి అండ్ కో లోకేశ్‌ను టార్గెట్ చేసుకున్నారు. అతడిని 'పప్పు' అని పిలుస్తూ హేళన చేశారు. తద్వారా తాను పప్పు కాదు నిప్పు అని నిరూపించుకొనే పరిస్థితి కల్పించారు. 2019 వరకు మంత్రిగా పనిచేసిన లోకేశ్‌కు పెద్దగా ఎదురు దెబ్బలు తగల్లేదు. అధికారం అండగా ఉన్నందున సాఫీగా సాగిపోయింది. రాజకీయాల్లో రాటుదేలడానికి అవకాశం లభించలేదు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అప్పటి వరకు లోకేశ్ చుట్టూ ఉన్న అనేక మంది ఆయనను వదిలేశారు. పార్టీ కార్యకర్తలు మాత్రమే అండగా నిలిచారు. మరోవైపు అధికారంలో ఉన్న జగన్ అండ్ కో నుంచి దాడి ఉధృతమైంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కూడా ఆ పరిస్థితిని అధిగమించడానికి ఇబ్బందిపడ్డారు. అయితే లోకేశ్ పెద్దగా హడా విడి ప్రదర్శించకుండా పరిస్థితులను ఆకళింపు చేసుకొనే ప్రయత్నం చేశారు. ప్రజలు, కార్యకర్తలతో మమేకం అవడానికి యువగళం పేరిట పాదయాత్ర చేపట్టారు. సీన్ కట్ చేస్తే ఇప్పుడు ఆయన మారిన మనిషి అని, ఆయనలో సమర్థత ఉందన్న అభిప్రాయం ఏర్పడింది. గతంలో లోకేశ్ నాయకత్వం పట్ల పెదవి విరిచిన వారు కూడా ఇప్పుడిప్పుడే ఆయన నాయకత్వాన్ని అంగీకరించే స్థితికి వచ్చారు. ఇప్పుడు అధికారం ఉంది కనుక ఇంద్రుడు, చంద్రుడు అని పొగడటం సహజం. అయితే తెలుగుదేశం పార్టీ శ్రేణులు విభిన్నంగా స్పందిస్తారు. నాయకత్వ నిర్ణయాలు అపసవ్యంగా ఉన్నప్పుడు తప్పు అని చెప్పడానికి వారు వెనుకాడరు. ఎన్టీఆర్ హయాం నుంచీ ఇలాగే స్పందిస్తున్నారు. ఇది సోషల్ మీడియా యుగం కనుక మరింత వేగంగా స్పందిస్తున్నారు. చంద్రబాబు లేదా లోకేశ్ నిర్ణయాలు నచ్చకపోతే వెంటనే తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా వెలిబుచ్చుతున్నారు. ఈ పరిస్థితి తెలుగుదేశం పార్టీలో మాత్రమే కనిపిస్తోంది. జగన్ రెడ్డి నందిని చూపించి పంది అని చెప్పమంటే తలూపడానికి వైసీపీ శ్రేణుల వలె తెలుగుదేశం కార్యకర్తలు అంగీకరించరు. మావిగన్ వంటి ప్రతిపాదన చంద్రబాబు లేదా లోకేశ్ నోటి వెంట వెలువడి ఉంటే తెలుగుదేశం శ్రేణులే ఎగతాళి చేసి ఉండేవి. ఒక రకంగా తెలుగుదేశం నాయకత్వానికి ఆ పార్టీ శ్రేణులే తొలి ప్రతిపక్షం.

> **2014 తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన లోకేశ్‌లో కొంత అపరిపక్వత కనిపించింది. దానికితోడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చినప్పుడు జగన్ రెడ్డి అండ్ కో లోకేశ్‌ను టార్గెట్ చేసుకున్నారు. అతడిని 'పప్పు' అని పిలుస్తూ హేళన చేశారు. తద్వారా తాను పప్పు కాదు నిప్పు అని నిరూపించుకొనే పరిస్థితి కల్పించారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అధికారంలో ఉన్న జగన్ అండ్ కో నుంచి దాడి ఉధృతమైంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కూడా ఆ పరిస్థితిని అధిగమించడానికి ఇబ్బందిపడ్డారు. అయితే లోకేశ్ పెద్దగా హడావిడి ప్రదర్శించకుండా పరిస్థితులను ఆకళింపు చేసుకొనే ప్రయత్నం చేశారు. ప్రజలు, కార్యకర్తలతో మమేకం అవడానికి యువగళం పేరిట పాదయాత్ర చేపట్టారు. ఇప్పుడు ఆయన మారిన మనిషి అని, ఆయనలో సమర్థత ఉందన్న అభిప్రాయం ఏర్పడింది.**

వారసుల్లో ఎవరెలా?

రాజకీయాల్లో వారసుల సంస్కృతి కొత్త కాదు. తెలుగునాట వారసులుగా రంగ ప్రవేశం చేసి రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న వారిలో లోకేశ్ మూడవ వ్యక్తి. తెలంగాణలో కేసీఆర్ వారసుడిగా కేటీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ వారసుడిగా జగన్మోహన్ రెడ్డి కొనసాగుతున్నారు. కేవలం వారసులుగా మాత్రమే రాజకీయాలలో రాణించలేరు. అలాగని కృత్రిమంగా ప్రచారం పొందినా అది కొంత మేరకే ఉపయోగపడుతుంది. స్టెరాయిడ్స్ ఎంతో కాలం పనిచేయవు కదా! దీర్ఘ కాలంలో ప్రతికూల ఫలితాలను ఇస్తాయి. అధినాయకుల వారసులైనప్పటికీ కార్యకర్తలు, ప్రజలతో మమేకం అయ్యే వారికే ఆదరణ ఉంటుంది. రాజకీయ భవిష్యత్తు ఉంటుంది. అధికారంలో ఉన్నప్పుడు భజన చేసే వారి మాయలో పడి కార్యకర్తలు, ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకోకుంటే ఆ తర్వాత ఇబ్బంది పడతారు. తెలంగాణలో కేటీఆర్ ఇందుకు ఉదాహరణ. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే కేటీఆర్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. అప్పట్లో కేటీఆర్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటిస్తారన్న ప్రచారం కూడా జోరుగా జరిగింది. అయితే చుట్టూ ఉన్నవాళ్లు తన నాయకత్వ లక్షణాలను అదే పనిగా పొగుడుతూ ఉండటంతో ఆ మోజులో పడిన కేటీఆర్ పార్టీ కార్యకర్తలను, ప్రజలను పట్టించుకోలేదు. ఈ కారణంగానే వారితో మమేకం కాలేకపోయారు. ఈలోపు పార్టీ అధికారం కోల్పోయింది. ఫలితమే కేటీఆర్ నాయకత్వానికి సవాళ్లు ఎదురవుతున్నాయి. అధికారం ఉన్నా లేకపోయినా పార్టీ కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్న వారే నాయకులుగా నిలదొక్కుకోగలరు. అదే సమయంలో వారి నాయకత్వం పట్ల ప్రజల్లో కూడా నమ్మకం ఏర్పడాలి. పొగడ్తలకు మాత్రమే అలవాటు పడిన కేటీఆర్ ఈ కోణం విస్మరించి తప్పు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పొగడ్తలు స్టెరాయిడ్స్ వలె పనిచేస్తాయి. అధికారం కోల్పోయాక తత్వం బోధపడుతుంది. మూడవ తరం ప్రతినిధిగా తెలుగుదేశం పార్టీ నాయకత్వ పగ్గాలు చేపట్టడానికి లోకేశ్ సిద్ధపడుతున్నారు. నువ్వు ఎలాంటి వాడివో నీ చుట్టూ ఉండే సన్నిహితులను బట్టి చెప్పవచ్చు అంటారు. నాయకుడికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. 1995లో ఎన్టీఆర్‌ను ఎదిరించి అధికార పగ్గాలతో పాటు పార్టీ నాయకత్వాన్ని చేపట్టిన చంద్రబాబు చుట్టూ హేమాహేమీలైన నాయకులు తోడుగా ఉండేవారు. పూసపాటి అశోక గజపతి రాజు, కింజరాపు ఎర్రన్నాయుడు, జీఎంసీ బాలయోగి, యనమల రామకృష్ణుడు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఎలిమినేటి మాధవరెడ్డి, నాగం జనార్దనరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటి వారెందరో చంద్రబాబు చుట్టూ కనిపించేవారు. ఈ కారణంగానే ఎన్టీఆర్‌ను ధిక్కరించి కూడా చంద్రబాబు నిలదొక్కుకోగలిగారు. ప్రజల నమ్మకం చూరగొన్నారు. ఇప్పుడు లోకేశ్ చుట్టూ అలాంటి పటిష్ఠమైన, అంతటి విశ్వసనీయత కలిగిన ఎకో సిస్టమ్ ఉందో లేదో తెలియదు. ప్రస్తుతానికి తనలో పరిణతి వచ్చిందని నమ్మకం కలిగించడంలో మాత్రం లోకేశ్ సక్సెస్ అయ్యారు. అయితే ఆయన చుట్టూ ఉన్న వారి విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పాత తరాన్ని, నవ తరాన్ని కలుపుకొని పోవాల్సిన బాధ్యత లోకేశ్‌పై ఉంది. అనుభవం ఉన్న వారి సలహాలు, సూచనలు అతనికి అవసరం. వినదగు నెవ్వరు చెప్పిన.. అన్నట్టుగా పది మంది అభిప్రాయాలు తెలుసుకొని సొంతంగా ఆలోచించి తుది నిర్ణయం తీసుకోవడాన్ని అలవర్చుకోవాలి. బాధ్యతల స్వీకరణ సందర్భంగా లోకేశ్ చెప్పిన ఒక మాట ఎవరికైనా నచ్చుతుంది. 'కుటుంబంలోనైనా, పార్టీలోనైనా భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. అయితే నేనైనా మీకు నచ్చజెప్పాలి లేదా మీరైనా నాకు నచ్చజెప్పాలి' అని లోకేశ్ అన్నారు. ఇది సరైన దృక్పథం. విభేదించడానికి కూడా ఏకీభవించాలి అంటారు. 1995–99 మధ్య చంద్రబాబు తనకు నమ్మకమైన, వివిధ రంగాలకు చెందిన ముఖ్యుల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకొనేవారు. అందరి అభిప్రాయాలూ తెలుసుకొని నీ మనసుకు నచ్చిన నిర్ణయం తీసుకో అని అంటారు. వారసత్వం వల్ల లాభంతో పాటు నష్టం కూడా ఉంటుంది. వారసులుగా తెర మీదకు వచ్చిన వారు తాము ఎవరి నుంచి వారసత్వం పొందారో వాళ్ల కంటే గొప్పవారని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. తండ్రిని మించిన తనయుడు అని అనిపించుకోవాల్సి ఉంటుంది. రాజశేఖర రెడ్డితో పోల్చుకోవడం వల్లనే జగన్ రెడ్డి ప్రజల్లో వ్యతిరేకతను చవిచూశారు. కేటీఆర్ కూడా తండ్రిని మించిన తనయుడు అని నిరూపించుకోలేక తంటాలు పడుతున్నారు. అధినాయకులు అందనంత ఎత్తుకు ఎదిగినప్పుడు వారసులకు ఈ కష్టాలు తప్పవు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి ఉండి అభివృద్ధికి చిరునామాగా ప్రజల్లో గుర్తింపు పొందిన చంద్రబాబును మించిన తనయుడు అనిపించుకోవడం లోకేశ్‌కు కూడా అంత సులువేమీ కాదు. అంతే కాదు, ఎన్టీఆర్ మనవడిగా, చంద్రబాబు కుమారుడిగా లోకేశ్‌ను ప్రజలు నిశితంగా గమనిస్తూ ఉంటారు. అదే సమయంలో వారసుడిగా తెర మీదకు వచ్చిన లోకేశ్‌కు డ్యామేజ్ చేయడానికి రాజకీయ ప్రత్యర్థులు కాచుకొని ఉంటారు. దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటారని పేరొందిన లోకేశ్ ఈ దాడులను ఎదుర్కోవడంలో తండ్రి నుంచి మెళకువలు, జాగ్రత్తలను కచ్చితంగా నేర్చుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలే కాదు సమాజం కూడా సంక్లిష్టమైనది కనుక అతను ఆచితూచి వ్యవహరించాల్సిందే. లోకేశ్ ఈ మధ్య పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో వ్యక్తిగత అనుబంధాన్ని పెంచుకోవడం కోసం విందు సమావేశాలు నిర్వహించడం కచ్చితంగా అభినందనీయం. అంతకు ముందు పార్టీకి చెందిన తొలి తరం కార్యకర్తలను కూడా ప్రత్యేకంగా ఎంపిక చేసి విందుకు ఆహ్వానించారు. అసలైన కార్యకర్తలు కోరుకునేది ఇలాంటి ఆత్మీయ అనుబంధాలే. ఎన్టీఆర్, చంద్రబాబు వారసుడిగా భవిష్యత్తులో పార్టీ పగ్గాలు చేపట్టనున్న లోకేశ్ తనపై ఉన్న గురుతర బాధ్యతను గుర్తించినట్టుగా ఆయన మాటలను బట్టి అర్థం చేసుకోవచ్చు. 'తండ్రిని మించిన తనయుడు, తాతను మించిన మనవడు అని అనిపించుకుంటానో లేదో తెలియదు గానీ ఆ ఇరువురికీ తలవంపులు మాత్రం తీసుకురాను' అని లోకేశ్ తరచుగా చెబుతుంటారు. విలువలు పతనమవుతున్న నేటి రాజకీయాలలో ఇది ఆహ్వానించదగిన వాగ్దానం. సమర్థుడైన నాయకుడిగా ఎదగడం మాత్రమే కాదు– ఒక మంచి వ్యక్తిగా ఆవిష్కృతమవడం కూడా ముఖ్యమే. తాను స్వయంగా చెప్పుకొంటున్నట్టుగా తాను ఎవరి నుంచి వారసత్వం పొందుతున్నారో వారికి అగౌరవం తీసుకురాకుండా మంచి నాయకుడిగా, మంచి మనిషిగా లోకేశ్ ఎదగాలని ఆశిద్దాం. మూడవ తరం చేతిలో పార్టీ భవిష్యత్తు ఎలా ఉండబోతుందన్నది కాలమే నిర్ణయిస్తుంది!

> **మూడవ తరం ప్రతినిధిగా తెలుగుదేశం పార్టీ నాయకత్వ పగ్గాలు చేపట్టడానికి లోకేశ్ సిద్ధపడుతున్నారు. నువ్వు ఎలాంటి వాడివో నీ చుట్టూ ఉండే సన్నిహితులను బట్టి చెప్పవచ్చు అంటారు. నాయకుడికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.**

> **పూసపాటి అశోకగజపతి రాజు, కింజరాపు ఎర్రన్నాయుడు, జీఎంసీ బాలయోగి, యనమల రామకృష్ణుడు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఎలిమినేటి మాధవరెడ్డి, నాగం జనార్దనరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటి వారెందరో చంద్రబాబు చుట్టూ కనిపించేవారు. ఈ కారణంగానే ఎన్టీఆర్‌ను ధిక్కరించి కూడా చంద్రబాబు నిలదొక్కుకోగలిగారు.**

> **ప్రధాని ఇందిరాగాంధీ హత్యానంతరం 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తర్వాత అత్యధిక స్థానాలు గెలుచుకున్న తెలుగుదేశం పార్టీ... లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించింది. అప్పుడు భారతీయ జనతా పార్టీకి లోక్‌సభలో రెండే స్థానాలు ఉండగా, తెలుగుదేశం పార్టీకి 30 స్థానాలు ఉండేవి. ఇలాంటి సంచలనాలు ఎన్నో తెలుగుదేశం పార్టీ ఖాతాలో ఉన్నాయి. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ పదమూడు సంవత్సరాలే ఉండగా, 1995 నుంచి నేటి వరకు చంద్రబాబు నాయకత్వంలో ఆ పార్టీ అప్రతిహతంగా కొనసాగుతోంది.**

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

రఘురాయ్ 'భారత దర్శనం'


తన ఎనభై మూడో ఏట, ఏప్రిల్ 26న కాలం చేసిన రఘురాయ్ భారతీయ ఛాయాచిత్రకారుల్లో అగ్రగణ్యులు. అంతర్జాతీయ స్థాయిలోనూ వారు అద్వితీయ కళాకారులు. పత్రికారంగం నుంచి ప్రారంభమైన వారి ప్రస్థానం, స్వతంత్ర ఫొటో జర్నలిస్ట్‌గా ఎదిగిన తీరు, సాగిన క్రమం నిరాటంకం, అపురూపం, అద్భుతం.

ప్రప్రథమంగా ఆరు దశాబ్దాల వారి స్థిమితమైన సుదీర్ఘ ప్రయాణంలో తప్పక చెప్పుకోవలసింది ఆయన దృక్పథం గురించి. దేశీయం అని ఒక్క మాటలో చెప్పడం సరికాదు. మరి, దాన్ని సులభంగా ఎలా చెప్పవచ్చునూ అంటే, వారి ప్రదర్శనలే చూడనక్కరలేదు. అవి కాకుండా ప్రపంచంలో మరే ఫొటోగ్రాఫర్ ప్రచురించనన్ని కాఫీ టేబుల్ బుక్స్ వారే తెచ్చారు. అందుబాటులో ఉన్న అవే సాక్ష్యం. సుమారు యాభై పుస్తకాలుగా తన పనిని చరిత్రలో భాగం చేసి వెళ్ళిన రఘురాయ్‌కి తన పుస్తకాల్లో అమిత ఇష్టమైన గ్రంథం నలుపు తెలుపుల్లో తెచ్చిన 'రఘురాయ్స్ ఇండియా'. ఈ శీర్షికే ఆయన కళా దృక్పథానికి కొలమానం. ఇదే శీర్షికతో వారు రంగుల్లోనూ మరో గ్రంథం తెచ్చారు.

విస్పష్టంగా రఘురాయ్ ఒక్కరే ఈ దేశాన్ని ఆత్మవిశ్వాసంతో పని ఆధారితంగా 'నా దేశం' అన్న ఏకైక ఛాయాచిత్రకారుడు. ఇక్కడి మనిషిని, మానును, ఉత్సవాలను, విషాదాలను, వార్తను, కథనాన్ని, రాజకీయ పరిణామాలను... అవేమైనా సరే, వాటిని దర్శించి ప్రతిదాన్నీ తాను 'భారతం' చేశారు. తనకన్నా ముందు, తన తర్వాతా ఎందరో ఛాయాచిత్రకారులు మన దేశాన్ని చిత్రించినా, ఇంకనూ చిత్రిస్తున్నప్పటికీ, వారెవరికీ లేని దృక్పథం రఘురాయ్ సొంతం. ఆయన 'ఇది నా దేశం' అని సగర్వంగా చిత్ర సహితంగా చాటిన ఏకైక కళాకారుడు. అంతేకాదు, "నా దేశాన్ని మినహా మరే దేశాన్ని చిత్రించను" అని ప్రకటించిన ఏకైక చిత్రకారుడు కూడా ఆయనే. దేశం దాటితే ఆయన కెమెరా మూసి పెడతారు. కళ్ళతోనే చూస్తారు. కెమెరా తెరిస్తే అది తన దేశం, మనిషి, స్థలం, మన మహిమ, అంతే. అదీ ఆయన ఘనత. ఈ దేశంలోని వైవిధ్యాన్ని, బహుళత్వాన్ని ఆయన అర్థం చేసుకుని చిత్రించినంత విశాలంగా మరొకరు చిత్రించలేదు కూడా. ఒక్క మాటలో ఈ దేశ ప్రజానీకపు విభిన్న జీవన సాంస్కృతిక సామరస్య సంపుటి 'రఘురాయ్స్ ఇండియా'.

ఆయన మొదటి చిత్రమే గాడిద. బేబీ డాంకీ. అందరూ అడ్డ గాడిదను చూసే తీరుకు భిన్నంగా ఆయన నిలువు గాడిదను చిత్రించి దాన్ని సమ్మోహనంగా ఒక యోగిలా చూపారు. అదీ మొదలు ఇక ఆయన వెనుదిరిగి చూడలేదు. అనుభవం గడించినకొద్దీ ఆయన 'నిలువు' నుంచి 'అడ్డం' వైపు తిరిగారు. ఇదే ఆయనను మిగతా వారికి భిన్నం చేసింది. ఈ దేశాన్ని చూడాలంటే వర్టికల్‌గా శిఖరాలు కాదు, హారిజాంటల్‌గా మైదానాలు చూడాలి అన్న ధోరణి అవలంబించారు. అందుకే ఆయన మన దేశాన్ని 'హారిజాంటల్ ఇండియా' అని పేర్కొనడమే కాదు, పదే పదే నొక్కి చెప్పారు. "అడ్డంగా తీసే చిత్రంలోనే సామాన్యం నుంచి అసామాన్య విశేషాలనెన్నిటినో దర్శించవచ్చు" అన్నారు. అడ్డదిడ్డంగా పనిచేసిన ప్రభుత్వాలనూ ఆయన ఇదే ధోరణిలో ఎండగట్టారు. విశేషం ఏమిటంటే, ఒక చిత్రం తీస్తున్నప్పుడు ఆయన రెండు మూడు నిమిషాలు సైతం వ్యూ ఫైండర్ నుంచి కన్ను ఆర్పకుండా చూసేవారు. ఒక దృశ్యాన్ని చప్పున చూసి తీసిన వారు కాదు. చూస్తూ చూస్తూ దర్శనం వంటి అనుభవం గ్రాహ్యం అయ్యేదాకా వేచి ఉండి క్లిక్ చేసేవారు. అందుకే ఆయన చిత్రంలో ఏకకాలంలో అనేక కాలాలను చదవవచ్చు.

దీన్ని ఇంకా బాగా అర్థం చేసుకోవాలంటే వారు తరచూ చెప్పే 'సెంచరీస్ లివ్ టుగెదర్' అన్న మాటను, అందులోని భావనను గమనించాలి. "అనేక శతాబ్దాల ఒరవడి వినిపించే నాగరిక దేశం మనది" అన్నారు. "చార్మినార్ వద్దకు వెళ్లి నిలబడు. నీతో పాటు జవసత్వాలతో హుందాగా, సమున్నతంగా పదిహేనో శతాబ్దం కానవస్తుంది" అన్నారు. దానర్థం, ఒక ఫ్రేంలో అనేక ఫ్రేంలు. పొరలు పొరలుగా జీవన శకలాలు. ఒక రకంగా పురాతత్వ సంపదను వెలికి తీసే ఆర్కియాలజిస్ట్‌గా, ఒక చరిత్రకారుడిగా ఆయన మన స్థలకాలాదుల్లో ఉన్న అన్ని విశేషాలనూ విని, ఒక్క చిత్రంలోనే ఆ ధ్వనిని నిక్షిప్తం చేసి, మనకు వినిపించిన అపూర్వ సంగీతజ్ఞుల వంటి ఛాయచిత్రకారులు ఆయన. అందుకే రఘురాయ్ లేరు అన్న బాధ అక్కర లేదు. ఆయన ప్రతి ఫొటో మనకు గతాన్ని వినిపించే వర్తమానం. భవితకు సోపానం.



మరో విశేషం ఏమిటంటే... తాను తీస్తున్నది 'హారిజాంటల్ ఇండియా' అనడమే కాదు, అందులో తాను చిత్రిస్తున్నది మనిషినైనా, సంఘటననైనా లేదా ల్యాండ్‌స్కేప్ అయినా తాను దృష్టిలో పెట్టుకునేవి రెండే అంశాలని చెప్పారు. అవేమిటో కాదు.. "ఎనర్జీ, ఎక్స్‌ప్రెషన్" అని వివరించారు. "ఆరు దశాబ్దాలుగా నేను గమనిస్తూ వచ్చింది ఈ రెండే" అని బోధపరిచారు.


ఈ దేశంలోని శక్తి ఎలా నిబిడీకృతమైందో, అది ఎలా ప్రవహిస్తున్నదో ఆయన దేశమంతా తిరిగి చూశారు, చిత్రించారు, పదిలపరిచారు. మనం చూసే చిత్రం ఇందిరాగాంధీనో, మదర్ థెరిసానో అనిపిస్తుంది లేదా ఆ చిత్రంలో మనం దలైలామాను చూస్తాం. కాదంటే అది కుంభమేళా అనుకుంటాం, లేదా ఏడుపాయల జాతర అని భావిస్తాం. కానీ, వాటిల్లో ఆయన చూస్తున్నది ఈ దేశంలోని ఆత్మ. అది శక్తి. ఆ ఆత్మ ఎలా ప్రతిచోటా ప్రతిదృశ్యంలోనూ ప్రవాహసదృశ్యమైపోతున్నదో అది వ్యక్తీకరణ. దాన్నీ ఆయన చిత్రించారు. అంటే వారు ఈ దేశ ఆత్మను, ఆ ఆత్మ తారాడే రీతిని వ్యక్తపరిచారు. ఈ రెండింటి నిక్షిప్తం కళాకారులు. ఇప్పుడు గమనించండి. శక్తి, దాని వ్యక్తరూపం. అదే భారతం. రఘురాయ్ కూడా.

అందుకే అనడం, రఘురాయ్ సిసలైన ముద్దుబిడ్డ. మన దేశం చరిత్రను దర్శించిన తీరు, పదిలపరిచిన తీరు కేవలం ఒక ఛాయాచిత్రకారుడిగానే కాదు, దేశీయ చిత్రకారుడిగా, మనం ఎన్నడూ మరచిపోలేని కృతికర్తగా, స్మృతికర్తగా భరతమాత సిసలైన ముద్దుబిడ్డగా వారు సదా నిలిచిపోతారు

చివరగా, రఘురాయ్ భారతమే వారిని అంతర్జాతీయం చేసిందనడానికి ఒక ప్రస్తావన. గత ఏడాది మరణించిన సెబాస్టియో సాల్గాడో అన్న ప్రసిద్ధ బ్రెజిలియన్ ఛాయాచిత్రకారుడు ప్రపంచంలోని నూటా ఇరవై దేశాలు తిరిగి ఛాయాచిత్రలేఖనం చేశారు. వారు కరోనా సమయంలో రఘురాయ్‌తో జరిపిన సంభాషణ ఈ దిశలో ఒక గొప్ప మెలకువ. అయన ఒక అద్భుతమైన మాట అన్నారు. "నేను ప్రపంచం మొత్తం తిరిగాను. కానీ, చిత్రంగా రఘురాయ్ ఈ దేశాన్ని విడవలేదు. నిజానికి వారే నాకన్నా గొప్ప" అన్నారు. "ఎందుకూ అంటే నా దేశంలో ఏమీ లేక తిరగవలసి వచ్చింది. రఘురాయ్ అలా కాదు, వారి ఇంగితం అపూర్వం. ఆయనకు తన దేశం ఘనత తెలుసు. అది బహుళం, వైవిధ్యం, విస్తారం అని గ్రహించిన దార్శనికుడు ఆయన. అందుకే దాన్ని విడిచి మరెక్కడికీ వెళ్ళలేదు. వెళ్ళదలచుకోలేదు. నా దేశమే నా ప్రపంచం అని సగర్వంగా చాటి చెప్పారు. నా దృష్టిలో రఘురాయ్ నాకన్నా అంతర్జాతీయం, విశ్వం" అని ఆత్మీయంగా కొనియాడారు. రఘురాయ్ కూడా గౌరవంగా తల వంచి నమస్కరిస్తూ, సెబాస్టియో అభినందనను హుందాగా స్వీకరించారు.

నేడు రఘురాయ్ భౌతికంగా లేరు. కానీ ఈ సూక్ష్మం అర్థం చేసుకోవడమే ఈ దేశవాసులుగా ఆ మహా కళాకారుడికి మనమిచ్చే ఘనమైన నివాళి, కృతజ్ఞతలు.

◆ కందుకూరి రమేశ్‌బాబు
ఫొటోగ్రాఫర్, జర్నలిస్ట్



5


అమరావతి అభివృద్ధికి నిధులు!

- కేబినెట్ ఆమోదం..
- జీవోలు జారీ చేసిన పురపాలక శాఖ
- సెక్రటేరియట్ భవనాలకు రూ.2,540 కోట్లు
- క్యాంటం వ్యాలీ ట్విన్ టవర్లకు రూ.1208.41 కోట్లు

8

అరసం కథలు, కవితలు పోటీల విజేతలు వీరే

ఏడీ ఏమైనా.. ఆయనంతే!



ఆరోపణలపై విచారణకు ఆదేశం

ఏడీపై ఫిర్యాదు నేపథ్యంలో సమగ్ర విచారణ జరపాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఆరోపణలు రుజువైతే చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ ఆరోపణలపై మార్కెటింగ్ ఏడీని వివరణ కోరగా.. గిట్టని వాళ్లు చేసిన తప్పుడు ఫిర్యాదు అంటూ సర్దిచెప్పుకున్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవం లేదని కొట్టి పడేశారు. ఈ రోజుల్లో అలా ప్రవర్తించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

- కొన్ని సామాజిక వర్గాలంటే లెక్కలేదు
- చాంబర్‌కు వెళ్తే.. చెప్పులు బయటే వదలాలి
- ప్రతి నెలా మామూళ్లు ముట్టజెప్పాలి
- ఫిర్యాదుతో మార్కెటింగ్‌శాఖ ఏడీపై విచారణ

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లా మార్కెటింగ్ శాఖలో కలకలం రేగింది. ఎన్నడూ లేని విధంగా జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ బి.సంపత్‌కుమార్ పేరుతో విడుదలైన ఉత్తర్వులు చర్చనీయాంశంగా మారాయి. వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్‌కు కె.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో చర్యలకు ఉపక్రమించారు. మార్కెటింగ్‌శాఖ ఏడీ కొన్ని సామాజిక వర్గాల అధికారులు, ఉద్యోగులను చిన్న చూపు చూస్తున్నారన్న ఫిర్యాదులో పేర్కొన్నారు. సెక్రటరీ స్థాయి అధికారులైనా.. తన చాంబరుకు వచ్చేప్పుడు చెప్పులు బయట వదిలి రావాలని హుకుం జారీ చేసినట్లు తెలిపారు. లోపలికి వెళ్లిన తర్వాత కూడా కనీసం కూర్చోమని అనకుండా గంటల తరబడి (మిగతా 8వ పేజీలో)

అన్నదాతకు యంత్ర సాయం!



- ఎస్ఎంఏఎం కింద రాయితీపై యంత్రాలు
- గత ఆర్థిక సంవత్సరానికి నిధులు మంజూరు
- సోమవారం నుంచి దరఖాస్తులకు అవకాశం
- ప్రస్తుత ఏడాది నిధులపై త్వరలో స్పష్టత

లబ్ధిదారుల ఎంపిక ఇలా

దరఖాస్తుకు 15 రోజుల గడువును వ్యవసాయశాఖ ఇవ్వనుంది. ఇందులో అర్హులను గుర్తించి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సారథ్యంలో తుది జాబితా తయారు చేస్తారు. పోటీ ఎక్కువగా ఉంటే అధికారుల సమక్షంలో లాటరీ తీసి లబ్ధిదారుల పేర్లను ప్రకటిస్తారు. ఇదంతా పూర్తి పారదర్శకంగా జరగడానికి ఆన్‌లైన్ పోర్టల్‌ను వ్యవసాయశాఖ అందుబాటులోకి తీసుకురానుంది. జాబితాలను గ్రామాల వారీగా ఆర్‌ఎస్‌కేల్లో ప్రదర్శించి, అభ్యంతరాలు స్వీకరించి తుది పేర్లు ఖరారు చేస్తారు. రాయితీ పోను మిగిలిన సొమ్ము చెల్లిస్తే రైతు కోరుకున్న పరికరం అందుతుంది.

అన్నదాతలు నెలలుగా ఎదురు చూస్తున్న రాయితీ యంత్రాల పథకం అమలులో కదలిక వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎస్ఎంఏఎం(సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్) పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేసింది. సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసు కోవచ్చని వ్యవసా యశాఖ చెబుతోంది. 2014-19 మధ్య అగ్రికల్చర్ మెకనైజేషన్ స్కీం భారీ ఎత్తున ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమలైంది. అయితే గత ప్రభుత్వం దీనిని పూర్తిగా గాడి తప్పేలా చేసింది. వ్యక్తిగతంగా ఇచ్చే రాయితీ ని గ్రూపులకు వర్తింప జేయడంతో పాటు మొత్తంగా రాజకీయ పైరవీలకు కేంద్రంగా వాటిని మార్చివేసింది. దీంతో అర కొరగా ఇచ్చిన యంత్రాలు కూడా గత ప్రభుత్వంలో అర్హులైన రైతుల కు అందకపోగా.. గ్రామాల్లోని వైసీపీ ద్వితీయశ్రేణి నేతల జేబుల్లోకి సదరు రాయితీ సొమ్ము చేరేలా అప్పటి పాలకులు వ్యవహరించారు.

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఎస్ఎంఏఎం పథకాన్ని తిరిగి గాడిన పెట్టే క్రమంలో కూటమి ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రాయితీపై యంత్ర పరికరా లను అందించింది. గతేడాది డ్రోన్లు కూడా ఇచ్చింది. నిధుల మంజూరుకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడం ఆలస్యం కావడంతో గతేడాది కేటాయింపులను ఇప్పుడు ఖర్చు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ప్రక్రియ అంతా నెలలోపే పూర్తి చేయాలని విస్పష్టమైన ఆదేశాలు జిల్లా వ్యవసాయ శాఖకు ఇటీవల అందాయి.

జిల్లాల వారీగా నిధులు

ఆయా జిల్లాల్లో సాగు విస్తీర్ణం ఆధారంగా రాయితీ యంత్ర పరికరాల కేటాయింపును ప్రభుత్వం చేపట్టింది. బాపట్ల జిల్లాకు రూ.4.05 కోట్లు, గుంటూరు, పల్నాడు జిల్లాలకు రూ.7.50 కోట్ల వరకు కేటాయించినట్లు సమాచారం. మూడు జిల్లాల్లో దాదాపు 7వేల మంది రైతులకు రాయితీ ఫలాలు అందేలా వ్యవసాయశాఖ ప్రణాళికలు రచిస్తోంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిధుల కేటాయింపుపై.. వచ్చే వారంలో (మిగతా 8వ పేజీలో)

చినమల్లయ్యపై వేటు

ఆంధ్రజ్యోతి కథనంపై ఐజీ స్పందన

- సోషల్ మీడియాలో మరో ఆడియో వైరల్
- పరారీలో సీఐ.. రెండు పోలీసు బృందాలు గాలింపు



నరసరావుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): వినుకొండ లో మహిళ అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న సీఐ చిన మల్లయ్యపై అధికారులు ఎట్టకేలకు చర్యలు తీసుకున్నారు. ఆయన్ను సస్పెన్షన్ చేస్తూ గుం టూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం ఉత్త ర్వులు జారీ చేశారు. కాస్త పట్టించుకోండి బాస్.. అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శనివారం వెలువడిన కథనంపై ఐజీ స్పందించి ఆయన్ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశా రు. బ్రాహ్మణ పల్లిలోని ఫాంహౌస్‌ను అడ్డాగా మా ర్చుకుని మహి ళలపై చినమల్లయ్య లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసు శాఖ నిర్ధారించింది. ఈ కేసు నమోదైన తదుపరి ఆయన రాసలీలలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. శుక్రవారం రాసలీలల వీడియో విడుదల కాగా శనివారం చిన మల్లయ్య ఓ మ హిళతో సాగించిన ప్రేమాయణం ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అనేక మంది మహి ళలను బెదిరించి లోబరుచుకున్నట్లు ఆయనపై ఆరో పణలున్నాయి. వీటిపై కూడా పోలీసు శాఖ దృష్టి సారించినట్లు సమాచారం. కేసు నమోదు, వరుసగా ఆయన రాసలీలలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో చినమల్లయ్య పరారీలో ఉన్నాడు. ఆయన్ను అరెస్టు చేసేందుకు మూడు రోజులుగా గాలిస్తున్నారు. ఆయ న కోసం రెండు పోలీసు బృందాలు ఏర్పాటు చేసినా వారికి చిక్కకుండా వారిని ముప్పుతిప్పలు పెడుతు న్నట్లు సమాచారం. అయితే తోటి అధికారి కావడం తో చినమల్లయ్యను అరెస్టు చేయడంలో వారు పెద్దగా దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.

నేడూ.. మంటలే

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మే నెల మొద టి రోజు భానుడు భగభగలాడగా రెండో రోజు శనివారం మరింతగా మంటపుట్టించాడు. మే నెల ప్రారంభంలోనే రోహిణి కార్తె ఎండలను తలదన్నే రీతిలో వాతావరణం సెగలు గక్కుతోన్నది. గత మూడు, నాలుగు రోజుల నుంచి నిత్యం 41 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదౌతోన్న ఉష్ణోగ్రత ఆదివారం మరింత ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. జిల్లాలోని పలు మండలాల్లో 45 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో సెలవుదినం కదా అని సరదా కోసం ఎండలో బయటకు రావొద్దని విజ్ఞప్తి చేసింది. పిల్లలు కూడా ఉదయం 9 గంటల లోపే ఆటలు ముగించుకోవాలని సూచించింది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వస్తే మాత్రం ఎండ నుంచి శరీరాన్ని కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కాగా సోమవారం (మిగతా 8వ పేజీలో)

- 45 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశం
- హెచ్చరించిన ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ
- బయటకు రావొద్దని అధికారుల సూచన



- నిర్మానుష్యంగా రెంటచింతల మెయిన్ రోడ్



3-5-26	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	27
తెనాలి	40	28
నరసరావుపేట	44	30
రెంటచింతల	44	29
బాపట్ల	38	28
చీరాల	38	28

ముగ్గురు పోలీసులపై కొరడా

- ఆరోపణపై విచారణ.. సస్పెండ్ చేసిన ఎస్పీ జిందాల్
- సీఐ చినమల్లయ్య వ్యవహారంతో అప్రమత్తం

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు పోలీస్ సిబ్బందిపై వేటు పడింది. హెడ్‌కానిస్టేబుళ్లు ఏవీ రమణ (తాడే పల్లి), చెంగల రాయుడు(తెనాలి రూరల్), కానిస్టే బుల్ సీహెచ్ రాములు(తాడేపల్లి)ను విధుల నుం చి తొలగిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఆదే శాలు జారీ చేశారు. పల్నాడు జిల్లాలో ఓ మహి ళపై సీఐ చినమల్లయ్య అత్యాచారం చేసినట్లు కేసు నమోదు కావడం, మరో మహిళపై అత్యాచారం చేసినట్లు మరో వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్పీ అప్రమత్తమై గాడి తప్పే సిబ్బందిపై కొరడా ఝుళిపించారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఏవీ రమణ, కానిస్టేబుల్ సీహెచ్ రాములు స్థానిక వైసీపీ నాయకులతో సంబంధాలు కొనసాగిస్తూ రహస్య సమాచారాన్ని లీక్ చేస్తున్న ట్లు ఆరోపణలు ఉన్నాయి. స్టేషన్‌కు వచ్చే వారితో ఇష్టానుసారం ప్రవర్తించడం వంటి ఫిర్యాదులపై సీఐ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎస్పీ చర్యలు తీసుకున్నారు. తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ చెంగల రాయుడు న్యాయం కోసం వచ్చే తనకు తరచూ ఫోన్ చేసి వేధిస్తున్నట్లు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో ఆయన్ను సస్పెన్షన్ చేశారు. తెనాలి త్రీటౌన్ కానిస్టేబుల్ మురళిపై విచారణ జరిపిన అధికారులు అతడికి వ్యభిచార గృహాలతో సంబంధాలు ఉన్నట్లు తేల్చినట్లు సమాచారం. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే మహిళలను ట్రాప్ చేస్తున్నట్లు కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీంతో మురళిపై కూడా వేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

క్రమశిక్షణ, నిజాయితీ అవసరం : ఎస్పీ

క్రమశిక్షణ, నిబద్ధత, నిజయితీగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులు, సిబ్బందికి స్పష్టం చేశారు. శనివారం పోలీస్ సిబ్బందితో సెట్ ద్వారా అత్యవసర సమావేశం నిర్వహించి అవినీతి, అక్రమాలకు పాల్పడే అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. ఈ క్రమంలో అందరికీ హెచ్చరికగా ముగ్గురిని సస్పెండ్ చేశారు. ప్రజల విశ్వాసం నిలుపుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. ఎలాంటి ఆరోపణలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఎవరైనా డబ్బులు తీసుకున్నట్టు లేదా సరైన విధంగా స్పందించనట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డయల్ 112 కాల్స్‌కు అర్బన్ ప్రాంతాల్లో 10 నిమిషాల్లో, రూరల్ ప్రాంతాల్లో 20 నిమిషాల్లో స్పందించాలన్నారు.

నీట్‌కు సిద్ధం

- నేటి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 11 నుంచే కేంద్రాల్లోకి అనుమతి
- జిల్లాలో 24 కేంద్రాలు.. 8417 మంది విద్యార్థులు

గుంటూరు(విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ఆదివారం జరగనున్నది. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలో 24 కేంద్రాలను ఏర్పాటు చేయగా పరీక్షకు 8417 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. బాపట్ల జిల్లాలో చీరాలలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా 558 విద్యార్థులు ధరఖాస్తు చేసుకున్నారు. పల్నాడు జిల్లాలో

నిబంధనలు పాటించాల్సిందే..

నీట్‌కు హాజరయ్యే విద్యార్థులు ఎన్‌టీఏ సూచించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయా కేంద్రాల కోఆర్డినేటర్స్ స్పష్టం చేశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. అయితే విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. మధ్యాహ్నం 1.30 తర్వాత కేంద్రాల గేట్లు మూసివేస్తామని, ఆ తర్వాత అనుమతించేది లేదన్నారు. విద్యార్థులు ఎన్‌టీఏ నిర్దేశించిన డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థులు వాచీలు, ఆభరణాలు, తలకు క్లిప్పులు వంటివి ధరించకూడదన్నారు. పారదర్శకమైన సీసాల్లోనే తాగునీటికి తెచ్చుకోవాలన్నారు. సాధారణ చెప్పులు మాత్రమే ధరించాలని, హైహీల్ చెప్పులతో కేంద్రాల్లో వస్తే అనుమతించేది లేదన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న కలెక్టర్ సాయికాంత్ వర్మ

విద్యార్థుల విజయం స్ఫూర్తిదాయకం

- పది విజేతలను సత్కరించిన కలెక్టర్ సాయికాంత్‌వర్మ

గుంటూరు(విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థుల స్ఫూర్తి ఆదర్శనీయమని కలెక్టర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను శనివారం కలెక్టరేట్‌కు పిలిపించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువులపై సమాజంలో ఉన్న అపోహలు ఈ ఫలితాలు పటాపంచలు చేస్తాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యా యులు, మెరుగైన వసతులు ఉన్నాయని తెలి పారు. కార్పొరేట్ పాఠశాల లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్ని మంత్రి నారా లోకేశ్ తీర్చిదిద్దుతున్నారన్నారు. ఉత్తమ మార్కులు సాధించి మిగి లిన వారిలో స్ఫూర్తిని, ప్రేరణ ను నింపారని విద్యార్థులను ప్రశంసిం చారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యా యులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచారని హర్షం వ్యక్తం చేశారు. జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ షేక్ సలీంబాషా మాట్లాడుతూ జిల్లా నుంచి 27,012 మంది పరీక్షలకు హాజరు కాగా 24,011 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రాష్ట్రంలో 8వ స్థానంలో జిల్లా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నల్లా డ్రెయిన్‌కి మోక్షమెప్పుడు?

- 2024లోనే కేంద్రానికి పెమ్మసాని నివేదన
- 16 నెలల తర్వాత రూ.54.75 కోట్లతో అంచనా
- ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో పరిపాలన అనుమతి

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): వర్షాల సమయంలో మంగళగిరి, పొన్నూరు, తెనాలి నియోజకవర్గాల్లో 50 వేల ఎకరాలను ముంచేస్తోన్న గుంటూరు నల్లా డ్రెయిన్ అభివృద్ధికి ఏళ్లుగా మోక్షం కలగడం లేదు. ఈ డ్రెయిన్‌తో ఏటా రైతులు నష్టపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. 2024లో కురిసిన అకాల వర్షాలకు వేల ఎకరాల వరి పంటను డ్రెయిన్ ముంచేసింది. దీంతో రైతులకు ఆర్థికంగా తీవ్ర నష్టం జరిగింది. ఆ సమయంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర ప్రభుత్వానికి నివేదించి ఒక బృందాన్ని రప్పించి నల్లా డ్రెయిన్ కలిగించిన నష్టాన్ని చూపించారు. అయితే ఇప్పటివరకు కేంద్రం నుంచి చిల్లిగవ్వ విడుదల కాలేదు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిపాలన అనుమతి ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టింది.

వెడల్పునకు 40 ఎకరాలు అవసరం..

తుంగబద్ర డ్రెయిన్ బేసిన్‌లో గుంటూరు నల్లా డ్రెయిన్ ప్రధానమైనది. ఇది చినకాకాని నుంచి ప్రారంభమై సంగం జాగర్లమూడి వద్ద తుంగబద్ర డ్రెయిన్‌లో కలుస్తుంది. డ్రెయిన్ ఇంప్రూవ్‌మెంట్స్‌లో భాగంగా 0 నుంచి 22.475 కిలోమీటర్ల వరకు బెడ్ వెడల్పుని 36 మీటర్ల నుంచి 46.30 మీటర్లకు పెంచాలని ప్రతిపాదించారు. దీని వలన వరద ప్రవాహం 4223 క్యూసెక్కుల నుంచి 5363 క్యూసెక్కులకు డిశ్చార్జ్ పెరుగుతుంది. అలానే గుంటూరు నంబరు.2 మేజర్ డ్రెయిన్, మీడియం డ్రెయిన్‌లోనూ బెడ్ వెడల్పుని ప్రతిపాదించారు. వీటి వలన డిశ్చార్జ్ పెరుగుతుంది. దాంతో డ్రెయిన్ ఉప్పొంగకుండా తుంగబద్ర డ్రెయిన్‌లోకి సులువుగా ప్రవహిస్తుంది. ఇందుకోసం చేబ్రోలు, పెదకాకాని మండలాల్లో దాదాపుగా 40 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. అలానే పీకలవాగు, గుంటూరు నంబరు. 2 డ్రెయిన్‌లో కూడా పనులు చేయాలి. ఈ పనులకు రూ.54.75 కోట్ల అంచనా విలువతో ఎస్టిమేట్లను జలవనరుల శాఖ తయారు చేసింది. ఈ ఏడాది జనవరి 28నే ప్రభుత్వానికి నివేదించింది. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిపాలనపరమైన అనుమతులు మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో రాబోయే వర్షాకాలంలో ఎలాంటి ముంపునకు గుంటూరు నల్లా డ్రెయిన్ గురి చేస్తుందోనని రైతులు మథనపడుతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యేలు, కేంద్ర సహాయ మంత్రి ప్రభుత్వానికి నివేదించి తగిన అనుమతులు తీసుకొచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



క్యాన్సర్ రోగులకు ఆరోగ్య ప్రదాయిని

- 2028కి బసవతారకం ఆస్పత్రి తొలి దశ
- ఫేజ్-1, 2లో వెయ్యి పడకల ఏర్పాటు

8



ఏఐపై అవగాహన పెంచుకోవాలి

● ఏపీ స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు



ప్రసంగిస్తున్న కుటుంబరావు, వేదికపై ఎమ్మెల్యే మాధవి

గుంటూరు(తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు ఏపీ స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ చెరుకూరి కుటుంబరావు సూచించారు. గుంటూరు, కుందుల రోడ్డులో కమ్మ బాలికల వసతి గృహంలో శనివారం ఏపీ స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సులలో శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వసతి గృహంలో ఏఐ కోర్సు ప్రారంభిస్తే తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. మరో అతిథి పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ పీ4 కార్యక్రమాన్ని అందిపుచ్చుకొని, శిక్షణ పొందడం ఒక విధంగా ఉద్యోగం సాధించినట్లేనన్నారు. ఏపి స్వర్ణాంధ్ర పి4 డైరక్టర్ వి.నరసింహరాజు, మార్గదర్శకులు మాదల రత్నగిరి బాబు, చల్లా రాజేంద్రప్రసాదు, రాయపాటి గోపాలకృష్ణను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. కేజేఎస్ఎస్ కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్య చౌదరి అధ్యక్షత వహించారు. కోశాధికారి కావూరి రవిచంద్ర, సంయుక్త కార్యదర్శి ఘంటా పున్నారావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రిప్ పైపులు, మ్యాట్లు దగ్ధం

● రూ.10 లక్షల మేర నష్టం



కాలిపోయిన డ్రిప్ పైపులను చూపిస్తున్న రైతులు

కొల్లిపర, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లభాపురంలో 5 ఎకరాల్లో ఉన్న డ్రిప్ పైపులు, మ్యాట్లు సంబంధిత పరికరాలు దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో రూ 10 లక్షలు నష్టం వాటిల్లింది. వల్లభాపురం గ్రామానికి చెందిన వంగా సాంబిరెడ్డి తన సొంత పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల సాగుతో పాటు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. కూరగాయల సాగుకు 5 ఎకరాల్లో డ్రిప్ పైపులు, మ్యాట్లు ఏర్పాటు చేశారు. చుట్టు ప్రక్కల రైతులు మొక్క-జొన్న కుప్పకు నిప్పు పెట్టడంతో ఈదురు గాలుల కారణంగా నిప్పు రవ్వలు సాంబిరెడ్డి పొలంలోని డ్రిప్ పైపులు, మ్యాట్‌లపై పడి మంటలంటు కొని అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు వంగా సాంబిరెడ్డి తెలియజేశారు.

ఉద్యోగుల హామీలు

తక్షణమే అమలు చేయాలి

● సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు రజాక్



గుంటూరు సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకిచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా వేతన సవరణ కమిషన్ (పీఆర్‌సీ) చైర్మన్‌ను వెంటనే నియమించాలని ఆయన కోరారు. జూలై 2023 నుంచే 12వ వేతన సవరణ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం వచ్చి 22 నెలలైనా చైర్మన్‌ను నియమించకపోవడం శోచనీయమన్నారు. మధ్యంతర భృతి (ఐఆర్)పై ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. కనీసం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులందరికీ సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపజేయాలని, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్రస్థాయి నాటికల పోటీలు ప్రారంభం



కన్నీటికి విలువెంత నాటికలో సన్నివేశం

తెనాలి అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట నాటకకళాలో శనివారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి 12వ ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభమయ్యాయి. కొలకలూరి నాటక పరిషత్, సాయి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల నిర్వహించనున్న ఈ పోటీలకు రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక సమితి సహకారం అందిస్తోంది. ఆర్.వెంకటదుర్గాప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి, పోటీలను ప్రారంభించారు. కాకినాడకు చెందిన జీవీకే క్రియేషన్స్ కళాకారులు కన్నీటికి విలువెంత నాటికను కామేశ్వరి రచనలో విశ్వ దర్శకత్వం వహించి ప్రదర్శించారు. గుంటూరు రమణ కళానిలయం కళాకారులు మాతృదేవో నాటిక ప్రదర్శించారు. సుఖమంచి కోటేశ్వరరావు రచించిన నాటికకు పి.నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు. గోపరాజు బాలత్రిపుర సుందరమ్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటి దాసరి రమాదేవికి ప్రదానం చేశారు. జడ నాగమల్లేశ్వరరావు, జీఎస్ ప్రసాదరెడ్డి, ఈదర పూర్ణచంద్ ప్రారంభ సభలో ప్రసంగించారు.

లేట్ అయినా.. నీట్‌గా కొడుకుతో పరీక్షకు



రాహుల్ కుమార్, రమేష్ కుమార్

రెంటచింతల, మే 2 (ఆంధ్రజ్యోతి): చదువుకు వయస్సు అడ్డు కాదని నిరూపించారు ఈ తండ్రి. నలగార్లపాడుకు చెందిన టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్, కుమారుడు రాహుల్ కుమార్ నీట్‌కు హాజరవుతున్నారు. రమేష్ కుమార్ మధ్యలో చదువు ఆపేసినా.. మళ్లీ పుస్తకం పట్టుకున్నారు. కుమారుడితో కలసి మెడికల్ ఎంట్రెన్స్‌లో సీటు సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. తన కుమారుడికీ ప్రోత్సాహం అందించారు. పరీక్షకు హాజరవుతున్న ఇద్దరికీ బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

మాచర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధలు తాళలేక ఓ కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని జమ్మలమడకలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మలమడకకు చెందిన మక్కెన ప్రసాద్ (33) గ్రామంలో 12 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. దిగుబడి సరిగా లేక సుమారు రూ.25 లక్షల మేర అప్పుల పాలయ్యాడు. భార్యాభర్తల గొడవలు పెరిగాయి. ప్రసాద్ భార్య ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపం చెందిన ప్రసాద్ శుక్రవారం పొలంలో పురుగు మందు తాగాడు. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా సీనియర్ అథ్లెటిక్ జట్టు ఎంపిక

గుంటూరు(తూర్పు), మే 2 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న ఏపీ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొనే గుంటూరు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 4న ధ్రువపత్రాలతో బీఆర్ స్టేడియంలో కోచ్ వెంకటేశ్వరరావును సంప్రదించాలని సూచించారు. **పురుషుల జట్టు:** డి.మణికంఠ, పీవీ భరత్ కుమార్, ఏవీజే కృష్ణమనాయుడు, ఎస్కే హమీద్, ఎస్కే నూర్, అబ్దుల్లా, ప్రసన్నకుమార్, ప్రవీణ్ కుమార్, యశ్వంత్ కుమార్, ఎ.విజయ్, ఎస్ అనిల్‌కుమార్, వి.గోవింద నాయక్, ఎ.ప్రేమ్‌చంద్, డి.ప్రవీణ్ కుమార్, బి.సిద్ధార్థ, వి.అశోక్, ఎం.మదన్‌మోహన్‌రావు, ఎండీ ముజఫర్, వి.శ్రీనివాసరాజు, ఎం.నరేంద్ర, ఎం.రవికిరణ్, పీవీ లక్ష్మణ బాబు. **మహిళల జట్టు:** ఎస్కే షాజహాన్, ఆషా.కె.ఆదిలక్ష్మి, పి.ఇందుమతి, ఎల్‌వీ ధనలక్ష్మి, బి నాగ విహారిక, పి.మౌనిక, వి.మధుబాల, రూపాలిక పాత్ర, టి.అనంతలక్ష్మి, నాగమణి, షేక్ సిమ్రాన్ అస్మిన్.

పది రీకౌంటింగ్‌కు అవకాశం

గుంటూరు(విద్య),మే 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాల రీకౌంటింగ్, రీ-వెరిఫికేషన్ కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 7వ తేదీ దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో డాక్టర్ సలీమ్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పాఠశాలల హెచ్ఎంను సంప్రదించి, సంబంధిత పాఠశాల లాగిన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. రీకౌంటింగ్ పేపర్‌కు రూ.500, రీ-వెరిఫికేషన్ రూ.1000 చెల్లించాలని తెలిపారు. విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారానే రుసుం చెల్లించాలన్నారు. జవాబు పత్రాలను వాట్సప్ మిత్రద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు హెచ్ఎంలను సంప్రదించాలని తెలిపారు.

ఆర్యవైశ్య బాలికలకు నగదు బహుమతులు

సీనియర్ ఇంటర్మీడియట్ పరీక్షలలో 95 శాతం మార్కులు పైగా సాధించిన ఆర్యవైశ్య బాలికలు 50 మందికి ఒక్కొక్కరికి రూ 10,000/- నగదు బహుకరించబడును. అర్హత కల విద్యార్థినీలు తెనాలి బస్ స్టేషన్ సమీపంలో ఉన్న కన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి కార్యాలయంలో ఆధార్, మార్క్స్ లిస్ట్, ఫోటో, రేషన్ కార్డు తో దరఖాస్తు 31.5.2026 లోగా చేసుకోగలరు. వివరాలకు 9440258574 నెంబర్ లో సంప్రదించండి.

పెండేల వెంకట్రావు - కార్యదర్శి.

భారీగా రంగు రాళ్లు స్వాధీనం



పట్టుబడిన క్రిస్టల్ క్వార్జ్ రంగు రాళ్లు

దాచేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ, విజిలెన్స్ అధికారులు దాడులు చేసి దాచేపల్లి పంచాయతీ పరిధిలోని ఓ గదిలో దాచిన క్రిస్టల్ క్వార్జ్ రంగు రాళ్ళను శనివారం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.40 లక్షలకు పైగానే ఉంటుందని ప్రాథమిక సమాచారం. మండలంలోని కొండ ప్రాంతాల నుంచి వీటిని వెలికి తీసినట్టు అధికారులు గుర్తించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు.

కూతురి పెళ్లికి దాచిన నగదు, బంగారం చోరీ..



బీరువా పగల గొట్టి చిందర వందరగా పడి ఉన్న దస్తులు

దాచేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడి ఇంట్లోకి చొరబడి న దొంగలు.. కుమార్తె వివాహానికి దాచిన నగదు, బంగారం, వెండిని దోచుకెళ్లారు. ఈ ఘటన దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మాధవ్‌బొట్ల రాధాకృష్ణమూర్తి నడికూడి రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తూ.. మరో వైపు పౌరోహిత్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తన కుమార్తె వివాహం నిశ్చయం కాగా.. పెళ్లికి పనుల కోసం గత నెల 30న కుటుంబ సభ్యులందరూ హైదరాబాద్‌కు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంట్లోకి చొరబడి పెళ్లికి దాచి ఉంచిన నగదు, బంగారం, వెండిని దోచుకెళ్లారు. ఇంటికొచ్చిన తర్వాత ఇంట్లో బీరువా పగలగొట్టి ఉండటం, నగదు, బంగారం, వెండి మాయమైనట్లు గమనించిన బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. గురజాల డీఎస్పీ మహేశ్వర రావు, సీఐ రాజేష్, ఎస్ఐ పాపారావు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌లు ఆధారాలు సేకరించాయి. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే రైలులో తిరుపతి నుంచి షిర్డికి

11 నుంచి జాల్నా - తిరుచానూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి జాల్నా - తిరుచానూరు - జాల్నా వీక్లీ ఎక్స్‌ప్రెస్ పట్టాలెక్కనుంది. రైల్వే ఆమోదంతో ఇటు తిరుపతి, అటు షిర్డీ రెండు పుణ్య క్షేత్రాలను కలిపే ఈ రైలును జాల్నాలో ప్రారంభించనున్నారు. 17637 జాల్నా-తిరుచానూరు ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు బయలుదేరి రాత్రి 9.10కి చర్లపల్లి, రాత్రి 2.40కి గుంటూరు, 3.43కి తెనాలి, మంగళవారం వేకువ జామున 4.13కి బాపట్ల, 4.28కి చీరాల, మధ్యాహ్నం 12 గంటలకు తిరుచానూరు చేరుకుంటుంది. 17638 తిరుచానూరు - జాల్నా ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.15కి బయలుదేరి రాత్రి 7.33కి చీరాల, 7.58కి బాపట్ల, 9.28కి తెనాలి, 10.15కి గుంటూరు, బుధవారం వేకువజామున 4.15కి చర్లపల్లి, ఉదయం 9 గంటలకు జాల్నా చేరుకొంటుంది.

నాందేడ్-తిరుచానూరు వీక్లీ

తెనాలి మార్గంలో నాందేడ్ - తిరుచానూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9 నుంచి ప్రారంభం కానుంది. రైలు నంబరు 17633 నాందేడ్-తిరుచానూరు ఈ నెల 9 నుంచి ప్రతి శనివారం సాయంత్రం 4.45కి బయలుదేరి ఆదివారం వేకువజామున 4.58కి తెనాలి, 5.33కి బాపట్ల, 5.48కి చీరాల, మధ్యాహ్నం 12.20కి తిరుచానూరు చేరుకొంటుంది. రైలు నంబరు 17634 తిరుచానూరు - నాందేడ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 7.45కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 12.03కి చీరాల, 12.18కి బాపట్ల, 12.58కి తెనాలి, సోమవారం సాయంత్రం 6.20కి నాందేడ్ చేరుకొంటుంది.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు

● 9.50 కేజీలు స్వాధీనం
● వైసీపీ కార్యకర్త కీలకపాత్ర



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేశ్వరరావు, సీఐ వెంకట్రావు

పిడుగురాళ్ళ, మే 2(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని పిడుగురాళ్ల పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మహేశ్వరరావు శనివారం నిందితుల వివరాలు వెల్లడించారు. పిడుగురాళ్ల సమీపంలోని డ్రైవర్స్ కాలనీలోని ముళ్లకంపల వద్ద కొంతమంది గంజాయి కలిగి ఉన్నారనే సమాచారంతో ఎస్ఐ శివనాగరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకొని 9.869 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా సరిహద్దుల్లోని దేశంసీలేరు ప్రాంతంలో పేరు తెలియని వ్యక్తి నుంచి గంజాయిని కేజీ రూ.5 వేలకు కొనుగోలు చేసి, పిడుగురాళ్ల ప్రాంతంలో రూ.10 వేలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారిలో తంగెడ గ్రామానికి చెందిన గుంజి రామాంజనేయులు, దేవళ్ల లక్ష్మీనారాయణ, అమరావతి మండలం అత్తలూరుకు చెందిన బత్తుల హృదయరాజు, పిడుగురాళ్లకు చెందిన బాగం పిచ్చయ్య, వడ్డెర కాలనీకి చెందిన కొమెర శివబాలాజి, బ్రహ్మానందరెడ్డి కాలనీకి చెందిన సన్నాయిల కుమారస్వామి ఉన్నారన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన చెప్పారు. కాగా, ఈ కేసులో పట్టుబడిన ప్రధాన నిందితుడు రామాంజనేయులు తంగెడ గ్రామంలో వైసీపీలో క్రియాశీలకంగా ఉంటూ గత ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌పై బాంబులు వేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు.

దూర విద్య కేంద్రం పరీక్ష ఫలితాలు విడుదల



దూరవిద్య కేంద్ర పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్

ఏఎన్‌యూ, మే 2(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో పలు యూజీ కోర్సుల పరీక్ష ఫలితాలను వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం శనివారం విడుదల చేశారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బీఏ, బీబీఏ, ఐదో సెమిస్టర్, బీకాం జనరల్, కంప్యూటర్ సైన్స్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ నెల 13లోగా రీవాల్యుయేషన్ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. యూజీ పేపర్‌కు రూ.1200 ఫీజు చెల్లించాలన్నారు. ఈ నెల 16లోగా పరీక్షల కో-ఆర్డినేటర్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొంద వచ్చని సూచించారు. ఐసీటీ డైరెక్టర్ ప్రభాకర్, పరీక్షల విభాగ డిప్యూటీ రిజిస్ట్రార్ జైనలుద్దీన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోదండపాణి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఎమ్మెస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ ఇన్ఫో స్టేట్మెంట్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, ఫారెస్ట్రీ, స్టాటిస్టిక్స్, ఒకేషనల్ అగ్రికల్చర్ అండ్ ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. రీ వాల్యుయేషన్ సబ్జెక్ట్ రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్, నకలుకు రూ.2190 ఫీజు చెల్లించాలన్నారు. అలాగే ఎంఏ ఆర్కాలజీ, హిస్టరీ, ట్రావెల్స్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను పీజీ పరీక్షల నిర్వహణ అధికారి శివప్రసాదరావు విడుదల చేశారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	140, 149, 160
చికెన్ విత్ స్కిన్(కిలో)	270.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	280.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


మాట్లాడుతున్న ఏఎన్‌యూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డిపాటి అనిత

సోషల్ మీడియాతో ప్రజాస్వామ్యానికి ముప్పు

● ఏఎన్‌యూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డిపాటి అనిత

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ప్రమేయంతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం తలెత్తుతోందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డిపాటి అనిత అన్నారు. శనివారం స్థానిక గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ సమావేశ మందిరంలో తెలుగు నాడు ఎడిటర్స్ అసోసియేషన్ నిర్వహించిన పత్రికా స్వేచ్ఛ- సవాళ్లు అనే అంశంపై జరిగిన సదస్సుకు అనిత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఒక మంచి ఉద్దేశంతో ఎలాంటి వార్తలను ప్రసారం చేసినా ఇబ్బంది ఉండదని అన్నారు. అయితే నేడు కాలక్షేపానికి, వ్యక్తిగత అజెండాలతో ఇతరులపై దురుద్దేశాలతో వార్తలు తయారు చేస్తున్నారని అన్నారు. అలాంటి వార్తలకు చట్టపరమైన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. గౌరవ అతిథిగా హాజరైన బండ్లమూడి వందనాదేవి మాట్లాడుతూ, జర్నలిస్టుల రక్షణ, సంక్షేమానికి ప్రభుత్వ పక్షాన తాను సహాయపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శాఖమూరు శ్రీనివాస్ ప్రసాద్, యల్లాప్రగడ మల్లికార్జునరావు, బోడేపూడి సుబ్బారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బండ్లమూడి వందనా దేవి, పొత్తూరి శ్రీనివాసరావు, ధర్మపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ మండవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విజయోత్సవ ర్యాలీ

గుంటూరు (విద్య) మే 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బస్సులు, ద్విచక్ర వాహనాలతో నగరంలోని నవభారత్ నగర్ నుంచి రింగ్ రోడ్డు, లక్ష్మీపురం, బృందావన్‌గార్డెన్స్, పట్టాభిపురం, తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య, ప్రిన్సిపాళ్లు, డీన్లు, ఆర్ఐ, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వయం శక్తితో మహిళలు ఎదగాలి

గుంటూరు (తూర్పు), మే 2 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయంశక్తితో ఆర్థిక స్వావలంబన సాధించాలని, అందుకు అవసరమైన వృత్తి విద్యలను నేర్చుకోవాలని లయన్స్ క్లబ్ సభ్యురాలు డాక్టర్ పి.స్వరూపరాణి అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులో శనివారం సమ్మర్ బ్యూటీషియన్ కోర్సు పూర్తిచేసుకున్న యువతకు ఆమె సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడుతూ, స్వయం ఉపాధి సంస్థ, శ్రీ బ్యూటీ పార్లర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరిగిందని తెలిపారు. మారుతున్న కాలంలో బ్యూటీషియన్ కోర్సులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని అన్నారు. పేద, మధ్యతరగతి మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఇలాంటి కోర్సులు ఎంపిక చేసుకోవచ్చని సూచించారు. సంస్థ నిర్వాహకులు ఉప్పులూరి దేవి మాట్లాడుతూ, నైపుణ్యం ఉన్న వారికి దేశ, విదేశాల్లో అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.


సర్టిఫికెట్లు పొందిన యువతతో డాక్టర్ పి.స్వరూపరాణి, సంస్థ సభ్యులు

జిల్లాలో 1,280 చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్

● హామీ నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1,280 చేనేత కార్మిక కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయడం జరుగుతుందని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు సీహెచ్ సాయిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చేనేత కళాకారుల కుటుంబాలకు, పవర్ లూమ్ యూనిట్లకు ఉచిత విద్యుత్ హామీ నెరవేర్చుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. హామీ ఇచ్చిన మేరకు 2026 ఏప్రిల్ 1 నుంచి అర్హులైన చేనేత కళాకారుల కుటుంబాలకు 200 యూనిట్ల మేర, పవర్- లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఇది వరకే ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ, ఎనర్జీ డిపార్ట్మెంట్ సమన్వయంతో అమలు చేస్తుందని చెప్పారు. జిల్లాలో చేనేత కార్మికులు ఉచిత విద్యుత్ కు 1,358 అప్లికేషన్స్ సమర్పించగా వాటిలో 1,280 మంది చేనేత కార్మికులు అర్హత సాధించారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ పథకం అమలుకు నోచుకోవడంతో చేనేత కళాకారులు, పవర్ లూమ్ యూనిట్ల యాజమాన్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

చలివేంద్రం ప్రారంభం

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): వేసవి తాప పరిస్థితులలో ప్రజలకు తాగునీరు అందించి, ఉపశమనం కలిగించేందుకు కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీబీఓఏ) అమరావతి రీజియన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ మంగళగిరి బ్రాంచ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కెనరా బ్యాంక్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ శనివారం దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ తీవ్రమైన వాతావరణ పరిస్థితులలో ప్రజా ప్రయోజనార్థం ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజం పట్ల అధికారులు కనబరిచిన సేవా స్ఫూర్తిని, నిబద్ధతను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమరావతి రీజియన్ ఏజీఎమ్ శ్రీహరిఫణి, అధికారులు, సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ తదితరులు

హిందూ ఫార్మసీ కళాశాలలో నృత్యదినోత్సవాలు

గుంటూరు (విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. వేడుకలను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు ప్రారంభించి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కళారంగాల్లో నైపుణ్యం సాధించాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నాగభూషణం, అధ్యాపకులు డాక్టర్ జి.ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ వి.మౌనిక, తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థినులు

సమన్వయంతో విస్తరణ పనులు పూర్తి చేయాలి

● కమిషనర్ మయూర్ అశోక్


రోడ్డు విస్తరణ పనుల మ్యాపును పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, మే 2 (ఆంధ్రజ్యోతి): బృందావన్ గార్డెన్స్ రోడ్డు విస్తరణ పనులను పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని నగర కమిషనర్ కే.మయూర్ అశోక్ ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో రోడ్డు విస్తరణ పనుల వేగవంతంపై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ..... గుంటూరు నగరంలో బృందావన్ గార్డెన్స్ నుంచి హనుమయ్య కంపెనీ వరకు ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా 60 అడుగుల రోడ్డును 80 అడుగుల రోడ్డుగా విస్తరణ చేస్తున్నందున పనులు జరిగే సమయంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణ చేసే సమయంలో ప్రభావిత భవన యజమానుల నుంచి అంగీకార పత్రాలను తీసుకోవాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహమాన్, ఈఈ (ఇన్‌చార్జి) కళ్యాణరావు, పట్టణ అధికారులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలను నరికి తరలించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులది

నగరంలో కరెంటు తీగలకు అడ్డ వస్తున్న చెట్ల కొమ్మలను నరికిన అనంతరం ఆ కొమ్మలను ప్రత్యేక వాహనం ద్వారా తొలగించాల్సిన బాధ్యత ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు వారిపై ఉందని నగర కమిషనర్ కే.మయూర్ అశోక్ తెలిపారు. కమిషనర్ ఛాంబర్‌లో శనివారం ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలో ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు వారు కరెంటు తీగలకు అడ్డువస్తున్న కొమ్మలను ఇష్టానుసారంగా నరికి అక్కడే వదిలేస్తున్నారని ప్రజలు, అధికారుల వద్ద నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నా యన్నారు. సమావేశంలో ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు ఎస్ఈ సీహెచ్ రమేష్, ఈఈ పఠాన్ హుస్సేన్ ఖాన్, జీఎంసీ సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, ఏడీహెచ్ శాంతి తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న ఆతుకూరి ఆంజనేయులు తదితరులు

ఫ్యాన్సీ మర్చంట్స్ సేవలను విస్తృతం చేయాలి

● చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణ ఫ్యాన్సీ, స్టేషనరీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సేవలను మరింత విస్తృతం చేయాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అన్నారు. గుంట గ్రౌండ్ వద్దనున్న అసోసియేషన్ భవనం ఎదుట మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆతుకూరి శనివారం ప్రారంభించి మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వేసవి తాపంతో పాదచారులకు మజ్జిగ పంపిణీ ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జుజ్జూరు శేషప్రభాకరరావు, రంగా వెంకటరామకృష్ణ, బచ్చు వెంకట సుబ్బయ్య, గెల్లా రమేష్‌కుమార్, ఆతుకూరి నగేష్‌కుమార్ తదితరులున్నారు.

ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో..

ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని గుంటూరు-1 డిపో చార్ట్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను జిల్లా ప్రజారవాణాధికారి డి.సామ్రాజ్యం శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ఉద్యోగులకు, ప్రయాణికులకు తాగునీరు అందించటం స్ఫూర్తిదాయకమని అభినందించారు.

సీఈవోపై చర్యలు తీసుకోవడం హర్షణీయం

● బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ శర్మ


సిరిపురపు శ్రీధర్ శర్మ

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణ సహకార క్రెడిట్ సొసైటీ సీఈవోగా ఉంటూ అక్రమాలకు పాల్పడిన నాగసాయిపై కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ అన్నారు. శనివారం బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఈవో నాగసాయి నియామకం 2017లో జరగ్గా, అప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ రెండు జీతాలు తీసుకుంటూ 9 సంవత్సరాల పాటు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. సీఈవో నాగసాయి బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో చేసిన అవినీతిపై ఐఏఎస్ అధికారితో కమిటీ వేసి ప్రభుత్వ ఆడిట్ జనరల్‌తో విచారణ చేయించాలని కోరారు. ఆయన చేసిన అక్రమాలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని సిరిపురపు శ్రీధర్ కోరారు.

పండరీపురంలో మహిళ అదృశ్యం


వెలగపూడి పద్మ (ఫైల్)

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పండరీపురం ఒకటో లైన్‌కి చెందిన వెలగపూడి పద్మ (58) అనే మహిళ అదృశ్యమైంది. శనివారం సాయంత్రం పద్మ సమీపంలోని టైలర్ షాపునకు వెళ్ళింది. అక్కడ పని ముగించుకుని ఇంటికి బయలుదేరింది. కానీ ఆమె ఇంటికి చేరుకోలేదు. ఆమె ఆచూకీ కోసం భర్త శ్రీనివాసరావు బంధువులు, తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేదు. దీంతో భర్త శ్రీనివాసరావు పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించారు. పద్మ ఆచూకీ తెలిసినవారు 9390252161 లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

పోస్టల్ కాలనీలో యువతి...


ఓరుగంటి గీతిక (ఫైల్)

స్థానిక అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోస్టల్ కాలనీ నాలుగో లైన్ కు చెందిన ఓరుగంటి గీతిక (17) అనే యువతి అదృశ్యమైంది. గత నెల 25న సాయంత్రం ఆమె ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె బ్రాడీపేటలోని ఒక కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. అయితే తాను ప్రేమించిన యువకుడితో వెళ్ళిపోతున్నట్లు ఇంట్లో ఓ నోటు రాసి వెళ్ళింది. కూతురు అదృశ్యంపై తండ్రి సాయిబాబా అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గీతిక ఆచూకీ తెలిసినవారు అరండల్‌పేట పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

గుంటూరు (తూర్పు), మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం శనివారం గుంటూరులో జరిగింది. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు వినుకొండ రాజారావు, సయ్యద్ చాంద్‌బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా రెహమాన్, కార్యదర్శిగా రాఘవరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా రాజు, ఉపాధ్యక్షులుగా మణిశ్రీ, మాధవిలత, రోజా, శ్రీనివాసరావు, కోటయ్య, విజయకుమారి, భాను, రంగా, కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


నూతనంగా ఎన్నికైన సభ్యులతో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

వైభవంగా అన్నమయ్య జయంతి

గుంటూరు(తూర్పు), మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 618వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది కళాకారులతో సప్తగిరీ సంకీర్తనల గోష్టి గానం ప్రేక్షకులను ఆకట్టుకుంది. లలిత సంగీత విశారద వ్యవస్థాపకుడు డాక్టర్ రామాచారి కొమండూరి ముఖ్య అతిథిగా పాల్గొని అన్నమయ్య సంకీర్తనలు ఆలపించి అలరించారు. వీరికి వయోలిన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, సర్వశ్రీ దావులూరి వీరభద్రరావు, మృదంగంపై బి.సురేష్ బాబు, తబలాపై పి.బాలాజీ సహకారం అందించారు. అనంతరం డాక్టర్ రామాచారి కొమండూరిని ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ లలిత, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని సన్మండలి సభ్యులు డాక్టర్ రాజరాజేశ్వరీ, పాటిబండ లలిత, మీనాక్షి తదితరులు పర్యవేక్షించారు.


అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

ప్రగతినగర్ సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ

గుంటూరు (తూర్పు), మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక శుద్దపల్లి డొంక ప్రాంతంలోని ప్రగతి నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా, నగర కార్యదర్శులు కోటా మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్ అన్నారు. మేడే సందర్భంగా శనివారం ప్రగతినగర్‌లో వారు జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. కాలనీలో రోడ్లు, కాలువలు లేక వర్షాకాలంలో నీరు నిలిచిపోతున్నాయని, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి సదుపాయాలు తక్షణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూతలపాటి చిన్న లక్ష్మి, జంగాల చైతన్య పాల్గొన్నారు.

మూడు జిల్లాల ఉద్యోగులకు

16 శాతం ఇంటి అద్దె చెల్లించాలి: బొప్పరాజు

అమరావతి/విజయవాడ (గాంధీనగర్), మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు చెల్లిస్తున్న 16 శాతం ఇంటి అద్దె ఆలవెన్స్‌లను నూతనంగా ఏర్పాటు చేసిన మదనపల్లి, మార్కాపురం, రంపచోడవరం జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులకు కూడా చెల్లించాలని ఏపీ జేఏసీ అమరావతి నేతలు కోరారు. ఈ మేరకు జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల హెల్త్‌కార్డుల్లో ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన అఫిషియల్ కమిటీ సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని కోరారు. తద్వారా ఉద్యోగుల ప్రధాన సమస్యలపై ప్రభుత్వానికి వెంటనే నివేదిక అందజేయాలని సీఎస్‌కు లేఖ ఇచ్చినట్టు తెలిపారు. ఉద్యోగ సంఘాల సమావేశంలో 60 రోజుల్లో నివేదిక ప్రభుత్వానికి ఇవ్వాలని సీఎం ఇచ్చిన గడువు ఫిబ్రవరి 5 నాటికి పూర్తయిందని బొప్పరాజు వెల్లడించారు.

సమగ్ర నీటి యాజమాన్యం కోసం..

రూ.398 కోట్లతో రాజధానిలో కాలువల అభివృద్ధి

రాజధాని అమరావతిలో సమగ్ర నీటి యాజమాన్య విధానం కోసం 6,502 కాలువలను రూ.398 కోట్లతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర జల వనరుల శాఖ పరిపాలనామోదం తెలిపింది. ఈ మేరకు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్న సమయంలో.. భవిష్యత్తు తాగునీటి అవసరాలను తీర్చేందుకు వీలుగా కాలువలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ కార్యాచరణను రూపొందించింది. ఇప్పటికే ఈ పనులకు సంబంధించి వేసిన అంచనాలను, డిజైన్లను సవరించింది. కొత్త డిజైన్లతో కాలువల అభివృద్ధిని చేపట్టాలని నిర్ణయించింది. 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక సవరించిన ఇసుక విధానం మేరకు అంచనాల్లోనూ మార్పులు చేసింది.

ఆయిల్‌పామ్‌కు రికార్డు ధర.. ఏప్రిల్‌లో టన్ను రూ.23,656

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ రైతులకు గత (ఏప్రిల్) నెలలో రికార్డు స్థాయి ధర లభించింది. ఆయిల్‌పామ్ తాజా పండ్ల గెలలకు మెట్రిక్ టన్ను ధర రూ.23,656గా నమోదైంది. ఆయిల్‌పామ్ చరిత్రలోనే ఇది అత్యధిక ధర అని ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నవంబరు నుంచి 2026 అక్టోబరు (ఆయిల్ సంవత్సరం)వరకు చమురు వెలికితీత నిష్పత్తిని 20.01 శాతంగా, గింజలు 10.08 శాతంగా, టన్ను ముడి చమురు సగటు ధర 15.05 శాతంగా నిర్ధారించడం ద్వారా తాజా పండ్ల గెలల నికర ధర పెరిగింది. సాధారణంగా ఎకరం ఆయిల్‌పామ్ తోటలో సగటున 7-8 టన్నుల గెలలు దిగుబడి వస్తుంది. ఈ దిగుబడిని 9-10 టన్నులకు పెంచేందుకు ఉద్యాన శాఖ అధిక దిగుబడిని ఇచ్చే మొక్కలు, మైక్రో ఇరిగేషన్‌తో ఫర్టిగేషన్ పరికరాలను రైతులకు ఇస్తున్నారు. రైతులకు అదనపు ఆదాయం కోసం ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలను ప్రోత్సహిస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓబుల నాయుడు పాలెం అండర్ పాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నేపాక ప్రకాష్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కంకరగుంట గేటు ప్రాంతా నికి చెందిన నేపాక మాధవరావు, రాధా దంపతులు తమకు చోడవ రంలో ఉన్న టిడ్కో ఇంటికి వెళ్లి దుస్తులు తీసుకొని వస్తున్నారు. ద్విచక్ర వాహనంపై తల్లిదండ్రులతో పాటు వారి కుమారుడు ప్రకాష్ కూడా ఉన్నాడు. ఓబులనాయుడుపాలెం అండర్ పాస్ వద్దకు రాగానే సర్వీస్ రోడ్‌లో ఓ కళాశాల బస్సు వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాధవరావు, రాధా దంపతులకు గాయాలు కాగా వారి కుమారుడు ప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ప్రకాష్‌ను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.


విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య

● తూర్పు ఎమ్మెల్యే నసీర్
● ప్రథమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే సత్కారం

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించటం సంతోషంగా ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. అంజుమన్ ఇస్లామియా పాఠశాలలో పది పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించిన సందర్భంగా శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా అంజుమన్ ఇస్లామియా ద్వారా పాఠశాలలో ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. అంజుమన్ పాఠశాలలో 60 మంది పదో తరగతి విద్యార్థులకుగాను 95 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 17 ప్రభుత్వ పాఠశాలల్లో 1,123 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 84 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు 582 మార్కులతో ఇద్దరు, 575 మార్కులతో పది మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని చెప్పారు. వీరితో కలిసి ఎమ్మెల్యే స్వయంగా భోజనం చేసి అభినందించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరించి బహుమతులు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసినట్లు తెలిపారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు స్కూళ్లకు ఏ మాత్రం తీసిపోవని విద్యార్థులు నిరూపించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులతో ఆమె శనివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. గతంలో తాను ప్రకటిం చినట్లుగానే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను త్వరలో విహార యాత్రకు తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు ఇంతటి ప్రతిభ కనబరచడం రాష్ట్ర విద్యా రంగంలో వచ్చిన సానుకూల మార్పునకు నిదర్శనమని, ఈ విజయానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రధాన కారణమని ఎమ్మెల్యే మాధవి అన్నారు.


టాపర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పిడికిటి తిలక్ బాబు తదితరులు

గుంటూరు (విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పోటీ పరీక్షలకు నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని ఎమ్మెల్సీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇంటర్, డిగ్రీ, ఆపై చదువుకున్న నిరుద్యోగ యువత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు ఆన్‌లైన్‌లో నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 7337459888, 9553681118లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, విజయ సాధన కోచింగ్ సెంటర్ అధినేత కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ ప్రోత్సాహంతోనే పదిలో ఉత్తమ ఫలితాలు

● జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డాక్టర్ సురేష్ కుమార్

గుంటూరు సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించడానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహమే కారణమని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, టీడీపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. కత్తెర దంపతులు శనివారం మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇటువంటి అత్యుత్తమ ఫలితాలు సాధించటం ఇదే ప్రథమమని అన్నారు. లోకేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న మార్పులు తీసుకువచ్చారన్నారు. మంత్రి ప్రోత్సాహంతో పాటు పిల్లల పట్టుదల గురువుల అంకితభావం తల్లిదండ్రుల నమ్మకం ఈ విజయానికి కారణమన్నారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా ఫలితాలు రావడం ఆనందంగా ఉందని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫోటోలు పత్రికల్లో ప్రచురించటం హర్షణీయమన్నారు.

తీరంలో సందడి

● సూర్యలంకకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు ● ఎండల తీవ్రతల నేపథ్యంలో భారీగా రాక

బాపట్లరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన సూర్యలంక సముద్రతీరానికి శనివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎండల తీవ్రత పెరగడం, ఉక్కపోత అధికమవడంతో ప్రజలు సూర్యలంక తీరానికి చేరుకొని స్నానాలు చేస్తూ ఒడ్డున సేద తీరుతున్నారు. పర్యాటకులు తీరంలో ఏర్పాటు చేసిన బైక్‌రైడ్స్ చేయడంతో పాటు కేరింతలు కొడుతూ సముద్రస్నానాలు చేశారు. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బల్లలపై పవళించి తీరంలో కమనీయ దృశ్యాలను ఆస్వాదించారు. పలువురు ఆదర్శనగర్ సమీపంలోని జీడితోటల వద్దకు చేరుకొని కుటుంబసభ్యులతో కలిసి భోజనాలు చేశారు. చిన్నారులు ఇసుక తిన్నెల్లో ఆడుకుంటూ సరదాగా గడిపారు. హైదరాబాద్, విజయవాడ తదితర దూర ప్రాంతాలు నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తీరానికి చేరుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముమ్మర గస్తీని నిర్వహించారు.



తీరం ఒడ్డున ఇసుక తిన్నెల్లో ఆడుకుంటున్న చిన్నారులు



సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ఏడి ఏమైనా ఆయనంతే..!

(5వ పేజీ తరువాయి)

నిలబెట్టే మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. తన పరిధిలోని 8 ఏఎంసీల సెక్రటరీల నుంచి ప్రతి నెలా రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వివరించారు. పత్తి కొనుగోలు వ్యవహారంలోనూ కేజీకి రూ.30 వసూలు చేయించినట్లు ఆరోపించారు.

చైర్మన్లతో సంబంధం లేకుండా..

ఏఎంసీ ఛైర్మన్ల ప్రమేయం, వారి నోటీసులో లేకుండా కొంతమంది కార్యదర్శులను తన కార్యాలయానికి ఏడీ పిలిపించినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. కొందరు మహిళా ఉద్యోగులను కూడా కార్యాలయానికి పిలిపించి నగదు వసూలు చేసేలా బెదిరించినట్లు పేర్కొన్నారు.

నేడూ.. మంటలే

(5వ పేజీ తరువాయి)

వాతావరణంలో మార్పు జరిగి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశాలు ఉండవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో మూగ జీవాల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎక్కడికక్కడ ఆయా జీవాలు సమీపంలోని నీటిగుంటల్లో సేదతీరాయి. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు మజ్జిగ, కొబ్బరి బోండాలు, నిమ్మరసం వంటి శీతల పానీయాలను సేవిస్తున్నారు.

నిప్పుల కొలిమిలా రెంటచింతల

రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతకు పేరుగాంచిన పల్నాడు జిల్లా రెంటచింతల మంటచింతలగా మారుతోంది. నిప్పుల కొలిమిలోంచి వేడి గాలులు వస్తున్నాయా అన్నట్లు వాతావరణం మారింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు శనివారం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. శనివారం అత్యధిక పగటి ఉష్ణోగ్రత 45.5 డిగ్రీలుగా నమోదు అయింది. వేడిమికి తోడు వడగాలులు తోడవడంతో వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోయారు. 2002 మే నెలలో రెంటచింతలలో అత్యధిక ఉష్ణోగ్రత 50 డిగ్రీలు నమోదైంది. ఇప్పుడే ఇలా ఉంటే రోహిణి కార్తెలో ఇంకెలా ఉంటుందోనని జనం భయపడుతున్నారు.

అమరావతి అభివృద్ధికి నిధులు!

● కేబినెట్ ఆమోదం.. ● జీవోలు జారీ చేసిన పురపాలక శాఖ ● సెక్రటేరియట్ భవనాలకు రూ.2,540 కోట్లు ● క్యాంటం వ్యాలీ ట్విన్ టవర్లకు రూ.1208.41 కోట్లు ● కృష్ణా రిటైనింగ్ వాల్‌కు రూ.443.26 కోట్లు ● కేబుల్స్ రూటింగుకు రూ.1180.54 కోట్లు

రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గురువారం జరిగిన మంత్రి మండలి సమావేశం ఆమోదం తెలపడంతో రాష్ట్ర పురపాలక శాఖ నిధులు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సహకారంతో ఈ నిధులు మంజూరు చేశారు.



గుంటూరు(రాజధాని), మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవన సముదాయంలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమీకృత సచివాలయం, హెచ్‌ఓడీ కార్యాలయాల(జీఏడీ టవర్, టవర్లు 3, 4, టవర్లు 1, 2)కు గ్లాస్ క్లాడింగ్, క్రౌన్, అట్రియం, కెనోపీ స్కైలైట్, కాలం క్లాడింగ్, సోలార్ ఫొటో ఓల్టాయిక్ ప్యానెల్స్, బీఎంయూ పనుల కోసం రూ.2,540. కోట్లకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ మూడు ప్యాకేజీలకు డిజైన్, బిల్డ్ లప్సం(పర్సంటేజీ టెండర్) కాంట్రాక్టు విధానంలో టెండర్లు పిలవడానికి ఏజీఐసీఎల్‌కు అనుమతి ఇచ్చారు.

జోన్- 11.. లేఅవుట్ల అభివృద్ధికి

అమరావతిలో జోన్- 11 పరిధిలో ఉండ వల్లి గ్రామం లో భూసమీకరణ కింద లేఅవుట్ల రోడ్లు, నీటి కాలు వలు, నీటి సరఫరా, ము రుగు నీటి వ్యవస్థ, పవ ర్, ఐసీటీ యుటిలిటీ డక్ట్ లు, పునర్వినియోగ నీటి పైపులైన్, ఎస్‌టీపీ, అవెన్యూ ప్లాంటేషన్ పనులకు రూ.580 కోట్లు మంజూరు చేశారు. 2 సంవత్సరాల డీఎల్‌పీతో కాంట్రాక్ట్ పద్ధతిలో టెండర్లు పిలవడానికి సీఎండీ ఏడీసీఎల్‌కు అనుమతి ఇచ్చారు. సీఆర్డీఏ సరిహద్దుల లోపల ఎన్10- ఈ 1 జంక్షన్ నుంచి ఎన్ 13- ఈ1 జంక్షన్ వరకు 220 కేవీ ఈహెచ్‌వీ లైన్ల బ్యాలెన్స్ పనులను అండర్ గ్రౌండ్ కేబుల్స్ ద్వారా రీరూటింగ్ చేయడానికి సవరించిన అంచనా రూ.1180.54 కోట్లు మంజూరు చేశారు. అయితే గతంలో పరిపాలన ఆమోదం రూ.1082.44 కోట్లు మంజూరు చేస్తూ కిందటేడాది ఇచ్చిన జీవో నెం. 197కు బదులుగా ఈరోజు జీవో నెం. 508 జారీ చేశారు.

● కృష్ణానది వరద నివారణ కోసం..

అమరావతిలో కృష్ణానది కుడి గట్టు వరద నిరోధక నిర్మాణం, బలోపేతం చేయడానికి సం బంధించి గతంలో ఇచ్చిన మూడు ప్యాకేజీలకు అదనంగా మరో 443.26 కోట్లు అదనంగా కేటాయించారు. ప్యాకేజ్ 2కు రూ.149.82 కోట్లు, ప్యాకేజ్ 3కి రూ.146.47 కోట్లు, ప్యాకేజ్ వన్‌కి రూ.146.97 కోట్లు అదనంగా నిధులు మంజూరు చేశారు. మొత్తంగా పని పరిధి రిటైయినింగ్ వాల్ నుంచి రెండు వైపులా ఎంబ్యాంక్‌మెంట్‌కు మారడం వల్ల గతంలో ఇచ్చిన పరిపాలన ఆమోదం రూ.1,304.89 కోట్లు సవరించారు. కొత్త టెండర్లు పిలవడానికి సీఎండీ, ఏడీసీఎల్‌కు అనుమతి ఇచ్చారు.

● క్యాంటం వ్యాలీ ట్విన్ టవర్లకు..

అమరావతి క్యాంటం వ్యాలీలో ట్విన్ ఆఫీస్ టవర్లు (టీ 1, టీ 2) షెల్, కోర్ నిర్మాణానికి రూ.1,208.41 కోట్లు మంజూరు చేశారు. డిజైన్, బిల్డ్ లప్సం(పర్సంటేజీ టెండర్) కాంట్రాక్టు విధానంలో టెండర్లు పిలవడానికి ఏజీఐసీఎల్‌కు అనుమతి ఇచ్చారు.

● శాసన సభ సివిల్ పనులకు..

అమరావతి నగరంలో శాసనసభ భవనానికి స్పైర్, పార్కింగ్ రింగ్, రూఫ్, పాలవాగుపై అప్రోచ్ బ్రిడ్జీల వంటి సివిల్ స్ట్రక్చర్ పనులకు రూ.798.00 కోట్ల మంజూరు చేశారు. డిజైన్, బిల్డ్ లప్సం(పర్సంటేజీ టెండర్) కాంట్రాక్టు విధానంలో టెండర్లు పిలవడానికి ఏజీఐసీఎల్ ఎండీకి అనుమతి ఇచ్చారు. దీంతోపాటు 2023లో జారీ చేసిన జీవో ఎంఎస్ నెం. 59 ద్వారా రెవెన్యూ శాఖకు ఇచ్చిన భూములను రద్దు చేస్తూ జీవో జారీ చేశారు. సీఆర్డీఏ ప్రాంతంలో వివిధ సంస్థల కు భూమి కేటాయింపు కొత్త ప్రతిపాదనలకు అనుగుణంగా సెబీ, స్వామి నారాయణన్ గురుకుల పాఠశాలకు, డీఏవీ పబ్లిక్ స్కూల్, అగ్నిమాపక శాఖకు భూమి కేటాయింపులు చేశారు.

● ఎల్‌పీఎస్ 2.0 రైతుల కౌలు రేట్లు మార్పు

రాజధాని అభివృద్ధి, విస్తరణ కోసం ప్రభుత్వం చేపట్టిన రెండో దశ భూసమీకరణలో భూములిచ్చిన రైతులకు చెల్లించే వార్షిక కౌలును సవరిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. మెట్ట భూములకు గతంలో ప్రకటించిన రూ. 30వేలకు బదు లు రూ. 40వేలు, జరీబు భూమికి ఎకరాకు రూ. 50వేలకు బదులు రూ. 60వేల కౌలు నిర్ణయించారు. అలాగే రైతులు కోరిన విధంగా ఒక్కో కుటుంబానికి ప్రస్తుతం ఉన్న పంట రుణాల్లో రూ. లక్షా 50వేలు మినహాయింపు ఇచ్చారు.

అన్నదాతకు యంత్ర సాయం!

(5వ పేజీ తరువాయి)

స్పష్టత వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత కేటాయింపులతో పోల్చుకుంటే అదనంగా మరో 40 శాతం పెరగవచ్చని.. మూడు జిల్లాల్లో కలిపి దాదాపు రూ.16 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో ఉండొచ్చనేది అంచనాగా ఉంది. గత ఆర్థిక సంవత్స రం, ప్రస్తుత నిధుల ఖర్చుకు కూడా సమాంతరంగా దరఖాస్తులను వ్యవసాయశాఖ ఆహ్వానించాల్సి ఉంటుంది. ఒకేసారి రెండు ఆర్థిక సంవత్సరాల కేటాయింపులు జరగ నుండడంతో అన్నదాతలకు పెద్ద ఎత్తున యంత్రాల రాయితీ ఫలాలు అందనున్నాయి.

మార్గదర్శకాలు ఇలా...

ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీ ఎస్ఎం ఏఎం పథకం ద్వారా అందేలా మార్గదర్శకాలు విడుదలయ్యాయి. రైతులకు అవసరమైన పరి కరాల కోసం ఆన్‌లైన్‌తో పాటు, ఆర్ఎస్‌కేలు, మీ సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తుకు ప్రభు త్వం వీలు కల్పించింది. పరికరాలతో పాటు ఇష్టమైన డీలర్ ఎంపికను కూడా రైతులకే వదిలేసింది. ట్రాక్టర్లు, ట్రాలీలు, రొటోవేటర్లు, విత్తనాలు చల్లే యంత్రాలు, తైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్లు వంటివి రాయితీపై అందించ నున్నారు. ట్రాక్టర్ అనుసంధాన పరికరాలను.. ట్రాక్టర్ ఉన్నవారికే అందిస్తున్నారు.

వేగిరనే ఉపయుక్తం

గతేడాది ఎడతెగని జాప్యం జరిగి.. సీజన్ అయిపోయాక యంత్రాలు అన్నదాతలకు అందాయి. దీంతో వాటి ప్రయోజనం తమకు అందలేదని రైతులు వాపోయారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియనే జూన్ మొదటి వారం కల్లా కొలిక్కి తేగలిగితేనే ఖరీఫ్ సీజన్‌కు వాటిని ఉపయోగించుకుంటామని రైతులు చెబుతున్నారు.

సమాజానికి దారి దీపాలు.. సాహిత్యోద్యమాలు

● అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ

గుంటూరు(తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): సాహిత్యోద్యమాలు సమాజానికి దారిదీపాల వంటివని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరు లోని బృందావన్ గార్డెన్స్ సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో శనివారం అరసం 90 ఏళ్ల ప్రస్థానం పేరిట మహాసభ నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత జరిగిన



చేతన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ సుశీలమ్మ తదితరులు

సభలో పెనుగొండ ప్రసంగించారు. అరసం ప్రాపంచిక దృక్పథంతో ఏర్పడిన సంస్థగా దేశవ్యాప్తంగా అనే క భాషల ప్రజల్లో వేళ్లూనుకుందని తెలిపారు. ప్రపంచ శాంతి, సామ్యవాద భావజాలంతో కూ డిన ఈ సంస్థ విముక్తి ఉద్యమాలకు ప్రేరణని చ్చిందన్నారు. అనంతరం కె.శరత్‌చంద్ర జ్యోతిశ్రీ రచించిన చేతన పుస్తకాన్ని ప్రొఫెసర్ సుశీలమ్మ ఆవిష్కరించి సమీక్షించారు. రచయిత శరత్‌చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ తను రాసిన రచనలు.. అరసం ఉద్యమం నేర్పిందేనని చెప్పా రు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాదు, ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కమిటీ ఎన్నిక..

ఈ సందర్భంగా అరసం గుంటూరు జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కారసాని గోపాలరెడ్డి, అధ్యక్షుడిగా చెరుకుమల్లి సింగారావు, ఉపాధ్యక్షులుగా గోలి సీతారామయ్య, గొట్టిముక్కల స్వర్ణలత, గంగోత్రి సాయి, ప్రధాన కార్యదర్శిగా కోసూరి రవికుమార్, సహాయక కార్యద ర్శులుగా కనపర్తి బెనహర్, బుల్లా రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా కె. శివరామి రెడ్డి, ప్రసాద్, డి. పీటర్, బొంతు భగత్‌సింగ్, షేక్ సుభాని, వినోద్‌లు ఎంపికయ్యారు.

స్వదేశీ దర్శన్ పనులు వేగవంతం కావాలి

● సూర్యలంకలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

బాపట్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరంలో స్వదేశీ దర్శన్ కింద చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం సాయంత్రం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. పర్యాటక కేంద్రంలో నిర్మిస్తున్న 42 షాపులు పూర్తయితే.. గతంలో తొలిగించిన 39 మందికి అవకాశం కల్పిస్తామన్నారు. షవర్ రూంల నిర్మాణ కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. సర్వే అధికారులతో మ్యాప్‌ల ద్వారా ప్రాజెక్ట్ వివరాలను పూర్తిగా సమీక్షించారు. పార్కింగ్ దూరంగా ఉందని, పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. హరిత హారం దగ్గరగా పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్‌కు 2.6 ఎకరాలు చాలదని 8 ఎకరాలు కావాల్సిందేనని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కలెక్టర్‌కు తెలిపారు. దుకాణాల కేటాయింపుతో.. తాత్కాలిక షెడ్లు తొలగిస్తే స్థలం వస్తుందని, పార్కిగ్ విషయాలు కూడా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే వాటర్ బైక్‌లను నడిపారు. స్విమ్మింగ్ పూల్, షవర్ రూంలు, ఫైవ్‌స్టార్ హోటళ్ళు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆర్డీవో పి.గ్లోరియా, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఇన్‌చార్జి జిల్లాపర్యాటకశాఖాధికారి సత్యానంద్‌పాల్, ఏపీ టీడీసీ మేనేజర్ సతీష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులు, నాయకులు

అరసం కథలు, కవితల పోటీల విజేతలు వీరే

గుంటూరు(తూర్పు), మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 23 నుంచి జరిగే అరసం రాష్ట్ర మహాసభల సందర్భంగా అరసం, మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్, పెదపరిమి ఆధ్వర్యంలో నిర్వహించిన కథలు, కవితల పోటీల ఫలితాలను అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాదు శనివారం విడుదల చేశారు. బహూశా వేణుగోపాల్ (జంగారెడ్డిగూడెం) కథానిక 'తెల్లపాము', పర్కపెల్లి యాదగిరి(సిద్ధిపేట) కథ 'బతుకు సాకు', ఒరుసు బ్రహ్మాంజలి (గుంటూరు) కథానిక పెళ్లి ఫొటోలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమ తులు గెలుచుకున్నాయని, వి. ఉషారాణి (తిరుపతి) నటి తానై...కు రచనకు ప్రత్యేక బహుమతి లభించిందన్నారు.

కవితల పోటీలో ఎం.డి.అబ్బుల్లా (విశాఖపట్నం) 'వాడు శాంతి వొడి చేరాడు', ఎల్.మల్లిపూడి రవిచంద్ర(అనం తపురం) 'గచ్చపొద', పొత్తూరి వికాస్ ఆదిత్యవర్మ (కాకినాడ) 'వేకువ పూల యుద్ధం'లకు బహుమతులు గెలుచుకు న్నాయని, సహాన సతీష్ (భూపాలపల్లి) 'ఇంకాగుర్రం'కు ప్రత్యేక బహుమతి దక్కిందన్నారు. విజేతలకు అరసం రాష్ట్ర మహాసభల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

క్యాన్సర్ రోగులకు ఆరోగ్య ప్రదాయిని

● 2028కి బసవతారకం ఆస్పత్రి తొలి దశ ● ఫేజ్-1, 2లో వెయ్యి పడకల ఏర్పాటు ● రూ. 750 కోట్లు ఖర్చు చేయనున్న ఫౌండేషన్

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటైన ఇండో అమెరికన్ బసవతారకం క్యాన్సర్ అస్పత్రిని.. ఏపీ నూతన రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు అడుగులు పడ్డాయి. బాలరిష్టాలన్నింటిని అధిగమించి ఎట్టకేలకు నిర్మాణం ప్రారంభమైంది. సువిశాలమైన ప్రదేశంలో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఈ క్యాన్సర్ ఆస్పత్రిని నందమూరి బసవతారక రామారావు మెమోరియల్ క్యాన్సర్ ఫౌండేషన్ నిర్మిస్తోంది. వచ్చే ఏడాది ఆఖరు, 2028 ప్రారంభంలోనే తొలి దశ ఆస్పత్రి నిర్మా ణాన్ని పూర్తి చేసి క్యాన్సర్ రోగులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఆస్పత్రి డిజైన్ పూర్తిస్థాయిలో సిద్ధం కావడంతో అందుకు అనుగుణంగా ట్రస్టు పనులను ప్రారంభిం చనుంది. ఈ ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా క్యాన్సర్ రోగులు చికిత్స కోసం అమరావతికి వస్తారు.

2018లోనే భూమి పూజ

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి 2018లోనే భూమి పూజ జరిగింది. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడం, అనుమతులన్నింటిని నిలిపేయడం, రాజధానిని మూడు ముక్కలాటగా మార్చడంతో ఆస్పత్రి నిర్మాణానికి ట్రస్టు వెనకడుగు వేసింది. 2024లో కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ భూమి పూజ చేశారు. అయితే ఎలక్ట్రికల్ లైన్స్ షిఫ్టింగ్ కారణంగా పనులను చేపట్టలేకపోయారు. గత వారంలో ఎలక్ట్రికల్ లైన్స్ షిఫ్టింగ్ పూర్తి కావడంతో మూడోసారి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అమరావతి రాజధానిలోని ఈ7, ఎన్ 15 రోడ్డు జంక్షన్ వద్ద ఈ క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోంది. ఏపీ సీఆర్‌డీఏ రెండు విడతల్లో 21 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ ఆస్పత్రి నిర్మాణం కోసం రూ.750 కోట్లను ట్రస్టు వెచ్చించబోతోంది. ఆస్పత్రి భవనం, సర్వీసెస్ బ్లాక్, ఎమినిటీస్ బ్లాక్‌గా నిర్మాణం చేయనున్నారు.

దగ్గరలో నాణ్యమైన వైద్యం..

గుంటూరు జీజీహెచ్‌లో నాట్‌కో, నగర శివారులోని మరొకటి మొత్తం రెండు ప్రైవేటు ఆస్పత్రుల్లో క్యాన్సర్ బాధితులకు చికిత్స అందిస్తున్నారు. చాలామంది హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికే చికిత్స కోసం వెళుతున్నారు. ఈ క్రమంలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చాల్సి వస్తోంది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న ఫౌండేషన్ రాజధానిలో సకల సదుపాయాలతో బసవతారకం క్యాన్సర్ అస్పత్రి ఏర్పాటుకు ముందుకొచ్చింది. నాణ్యమైన వైద్యాన్ని తక్కువ ధరకే అందించడం ఈ ఆస్పత్రి ప్రధాన లక్ష్యం.



ఇండో అమెరికన్ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి డిజైన్

ఎన్టీఆర్, కోడెల కాంస్య విగ్రహాల ఆవిష్కరణ



దొండపాడులో ఎన్టీఆర్ కోడెల విగ్రహాలావిష్కరణలో పాల్గొన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, చదలవాడ అరవిందబాబు, కోడెల శివరాం తదితరులు

నరసరావుపేట రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం దొండపాడు గ్రామంలో శనివారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు, నవ్యాంధ్ర ప్రదేశ్ తొలి శాసనసభాపతి, మాజీ మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు కాం స్య విగ్రహాలను ఘ నంగా ఆవిష్కరించారు. డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహంతో పాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించడం విశేషంగా నిలిచింది. ఈ సంద ర్భంగా పెద్దసంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చి నాయకులకు ఘన నివాళులు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని కోడెల శివప్రసాదరావు చేసిన సేవలను స్మరించుకున్నారు. పల్నాడు, నరసరావుపేట ప్రాంతాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, తెలంగాణ వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర గ్రంథా లయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ యువ నాయకుడు కోడెల శివరాం, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, మండల అధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

'గ్రోయర్'కు ఎండదెబ్బ

వందల్లో మృత్యువాత పడుతున్న కోడి పిల్లలు

తణుకు, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రోయర్ (కోడి పిల్లలు)కు ఎండదెబ్బ తగులుతోంది. పౌల్ట్రీలలో ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేసి, రైతులు కోడి పిల్లలను పెంచుతారు. ఆ పిల్లలు 17 నెలల తర్వాత గుడ్లు పెట్టేందుకు తయారవుతాయి. తర్వాత వాటిని పౌల్ట్రీ షెడ్లలోకి మారుస్తారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తణుకు, వేల్పూరు, కాల్దరి, వేలివెన్ను, తాడేపల్లిగూడెం, ఉండ్రాజవరం, నిడదవోలు, బాదంపూడి తదితర చోట్ల పౌల్ట్రీలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కోటి 30 లక్షల కోళ్లు ఉన్నాయి. 250 నుంచి 300 మంది వరకు రైతులు ఉన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండడం, నిర్వహణ లోపాల కారణంగా ప్రతిరోజూ వందల సంఖ్యలో కోడిపిల్లలు మృత్యువాత పడుతున్నాయి. రైతులకు భారీగా నష్టం వాటిల్లుతోంది. సాధారణంగా వేసవిలో పౌల్ట్రీ పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొంటుంది. గుడ్ల ఉత్పత్తి తగ్గడం, కోళ్లు మేత సరిగా తినకపోవడం, నీరు మాత్రమే తాగడం వంటి కారణాలు గుడ్ల ఉత్పత్తిపై ప్రభావం చూపుతాయి. వేసవిలో గుడ్లు పెట్టే కోళ్లు కూడా చనిపోతుంటాయి. దీన్ని తట్టుకోడానికి షెడ్లపై స్ప్రింకర్లు ఏర్పాటు చేసి, రెండు పూటలా నీరు స్ప్రే చేస్తూ.. ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటారు.



పౌల్ట్రీలో మృత్యువాత పడిన గ్రోయర్ కోడి పిల్లలు

పడిపోయిన కోడి పిల్లల బుకింగ్‌లు

సాధారణంగా ఉమ్మడి గోదావరి నెక్‌జోన్ పరిధిలో ఉన్న పౌల్ట్రీ పాపులేషన్ బట్టి గ్రోయర్ పిల్లల్ని రైతులు హేచరీల నుంచి బుక్ చేసుకుంటారు. సాధారణ రోజుల్లో నెలకు కనీసం ఎనిమిది లక్షల పిల్లలు బుక్ చేసుకునేవారు. ప్రస్తుత వేసవితో బుక్కింగ్‌లు ఐదారు లక్షలకు పడిపోయాయి.



శ్రీవారి ఆలయం ముందు భక్తుల రద్దీ

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

- తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, మే 2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడికావడంతో పాటు వారాంతం కావడంతో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, లడ్డూ కేంద్రం, అఖిలాండం, ప్రధాన కూడళ్లు, రిసెప్షన్ కౌంటర్లు, కల్యాణకట్టలు రద్దీగా కన్పిస్తున్నాయి. కాలి నడక మార్గాల్లో రద్దీ తగ్గలేదు. వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం మధ్య వరకు వ్యాపించింది. వీరికి దర్శనానికి దాదాపు 14 గంటల సమయం పడుతోంది.

అంగన్వాడీలకు వేసవి సెలవులు

- హెల్పర్‌కు 1 నుంచి 15 వరకు.. వర్కర్‌కు 16 నుంచి 30 వరకు
- యథావిధిగా పనిచేయనున్న కేంద్రాలు
- పోషకాహార పంపిణీకి అంతరాయం కలగకూడదనే..

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగ న్వాడీ సిబ్బందికి ప్రభుత్వం మే నెలలో విడతల వారీగా వేసవి సెలవులను మంజూరు చేసింది. అంగన్వాడీ హెల్పర్‌కు ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, వర్కర్‌కు 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. అయితే ఈ కాలంలో అంగ న్వాడీ కేంద్రాలు మాత్రం యథావిధిగా పనిచేయనున్నాయి. రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ కాలంలో పోషకాహార పథకానికి అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సురక్షిత తాగునీరు అందుబాటులో ఉండేలా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వారు రేషన్ డీలర్‌గా కొనసాగరాదు

ప్రజాప్రతినిధులు, లాభదాయక పదవుల్లో ఉన్నవారికి వర్తింపు

- ప్రజాప్రతినిధిగా ఎన్నికైతే ఏదో ఒక పదవికి రాజీనామా చేయాలి
- డీలర్‌గా ఉన్న ఓ సర్పంచ్ కేసులో స్పష్టం చేసిన హైకోర్టు



అమరావతి, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, లాభదాయక పదవుల్లో ఉన్నవారు సమాంతరంగా రేషన్ డీలర్‌గా కొనసాగలేరని హైకోర్టు తేల్చి చెప్పింది. పౌరసరఫరాల శాఖ 2018లో జారీ చేసిన జీవో 32 ప్రకారం ఒకే సమయంలో అటు రేషన్ డీలర్‌గా, ఇటు ప్రజాప్రతినిధిగా కొనసాగడానికి వీల్లేదని పేర్కొంది. ప్రస్తుత కేసులో పిటిషనర్ రేషన్ డీలర్‌గా ఉంటూ సర్పంచ్‌గా ఎన్నికయ్యారని గుర్తు చేసింది. ఒకసారి సర్పంచ్‌గా ఎన్నికైన తరువాత డీలర్ లేదా సర్పంచ్ పదవుల్లో ఏదో ఒకదానికి రాజీనామా చేయాలని స్పష్టం చేసింది. సర్పంచ్‌గా నామినేషన్ వేసేనాటికి రేషన్ డీలర్‌గా ఉన్నాననే విషయం అధికారులకు తెలుసన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది. రేషన్ డీలర్ షిప్‌ను రద్దు చేస్తూ అధికారులు తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు. కర్నూలు జిల్లా కల్లూరు మండలం కె.మార్కాపురం గ్రామానికి చెందిన ఆర్.జి.మద్దిలేటి రేషన్ డీలర్‌గా ఉంటూ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2024 నవంబరులో తహశీల్దార్ నిర్వహించిన తనిఖీల్లో రేషన్ దుకాణం స్టాక్‌లో భారీగా వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే సర్పంచ్ పదవిలో ఉంటూ రేషన్ డీలర్‌గా కొనసాగడం చట్టనిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ ఆర్‌డీవో డీలర్ షిప్‌ను రద్దు చేశారు. జాయింట్ కలెక్టర్ వద్ద అప్పీల్ వేయగా అక్కడా ఎలాంటి ఉపశమనం లభించలేదు. దీంతో ఆర్‌డీవో, జాయింట్ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మద్దిలేటి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో రేషన్ కార్డు హోల్డర్ ఇంప్లీడ్ అయ్యారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రేషన్ డీలర్ షిప్‌ను రద్దు చేస్తూ ఆర్‌డీవో ఇచ్చిన ఆదేశాలు, వాటిని సమర్థిస్తూ జాయింట్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. అధికారులు తన వివరణను పరిగణనలోకి తీసుకోలేదని, రాజకీయ దురుద్దేశంతో ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. రేషన్ కార్డు హోల్డర్ తరపు న్యాయవాది షాజిద్ కొల్లూరు వాదనలు వినిపిస్తూ.. సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి పిటిషనర్ నిత్యవసర సరుకులు సరిగ్గా సరఫరా చేయడం లేదన్నారు. రేషన్ డీలర్ షిప్‌ను రద్దు చేస్తూ అధికారులు సరైన నిర్ణయమే తీసుకున్నారన్నారు. పౌరసరఫరాల శాఖ తరపున ప్రభుత్వ సహాయ న్యాయవాది అప్పసాని వినీత్ వాదనలు వినిపిస్తూ.. రేషన్ డీలర్ షిప్ రద్దు చేసే విషయంలో అధికారులు చట్టనిబంధనలు పాటించారన్నారు. పిటిషనర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ తీసుకున్నారని తెలిపారు.

రామకృష్ణ తల్లి అంత్యక్రియలు పూర్తి

- ఫోన్‌లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పరామర్శ
- సంతాపం తెలిపిన డిప్యూటీ సీఎం పవన్
- గౌరమ్మ మృతిపై విచారం వ్యక్తం చేసిన జగన్



తల్లి గౌరమ్మ పాడె మోస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

అమరావతి, ఆలూరు, మే 2(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ తల్లి గౌరమ్మ అంత్యక్రియలు కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో శనివారం ముగిశాయి. కుటుంబ ఉన్నతికి తన తల్లి ఎంతగానో పాటుపడిందని, కష్టపడి ముందుకు నడిపించిందని, ఆమె స్ఫూర్తితో నాయకుడిగా ఎదిగానంటూ రామకృష్ణ భావోద్వేగానికి లోనయ్యారు. మాతృ వియోగంతో బాధపడుతున్న రామకృష్ణను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పరామర్శించారు. గౌరమ్మ మృతి పట్ల సంతాపం తెలిపిన సీఎం... రామకృష్ణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామకృష్ణ మాతృమూర్తి మరణంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కాగా, మాజీ సీఎం జగన్ ఓ ప్రకటనలో తన సంతాపాన్ని ప్రకటించారు.

అనంతలో బొలెరోను ఢీకొట్టిన బైకు

- పెట్రోల్ ట్యాంకు పేలి ఇద్దరు సజీవ దహనం



ఆకాశ్



అజిత్

కూడేరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కూడేరు మండలం అరవకూరు గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు సజీవ దహనమయ్యారు. చెరువుకట్ట సమీపంలో అనంతపురం-బళ్లారి రహదారిపై ఎదురుగా వస్తున్న బొలెరోను ఓ బైకు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైకు పెట్రోల్ ట్యాంకు పేలి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వజ్రకరూరు మండలం పందికుండ గ్రామానికి చెందిన అజిత్(18), ఆకాశ్(20) అనే యువకులు సజీవ దహనమయ్యారని కూడేరు సీఐ రాజు తెలిపారు. అనంతపురంలో జరిగే వివాహంలో పాల్గొనేందుకు వారిద్దరూ బైక్‌పై శనివారం రాత్రి బయల్దేరారు. అరవకూరు వద్ద ఉరవకొండ వైపు వెళుతున్న బొలెరోను ఢీకొట్టారు. వెంటనే మంటలు చెలరేగడంతో ఇద్దరూ చిక్కుకుపోగా వారిని కాపాడేందుకు అక్కడున్నవారికి సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న సీఐ రాజు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంలో యువకులు గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడం, సెల్‌ఫోన్ కూడా బొగ్గుగా మారిపోవడంతో బైక్ నంబరు ఆధారంగా మృతులను గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. కాగా.. బైకును ఢీకొట్టిన అనంతరం బొలెరో వాహనం నియంత్రణ కోల్పోయి ఓ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో కొందరు గాయపడ్డారు.

ఏపీ గ్రామీణ బ్యాంకు నికర లాభం రూ.1836 కోట్లు

- 1.30 కోట్ల కస్టమర్లు, 1359 శాఖలతో రెండో అతి పెద్ద బ్యాంకు
- త్వరలో అమరావతి నుంచి కార్యకలాపాలు: చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఏపీ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1836 కోట్ల నికరలాభంలో పయనిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఏపీ గ్రామీణ బ్యాంకుగా ఆవిర్భవించిన తర్వాత మొదటి వార్షికోత్సవం సందర్భంగా గుంటూరులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యాపార లావాదేవీలు, బ్యాంకు ప్రాధాన్యత అంశాలను వివరించారు. నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనం తర్వాత ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద బ్యాంకుగా అవతరించిందన్నారు. అటు కేంద్ర ప్రభుత్వ పరిధిలో చూసినా దేశవ్యాప్తంగా 28 రీజనల్ రూరల్ బ్యాంక్స్‌లో ఉత్తర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు తర్వాత ఏపీ గ్రామీణ బ్యాంకు రెండో అతి పెద్ద బ్యాంకుగా ఉందన్నారు. రాష్ట్రంలో 1359 శాఖలతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు.. బ్యాంక్ ఆఫ్ ఇండియా తర్వాత రెండో అతి పెద్ద నెట్‌వర్క్ సంస్థగా అవతరించిందన్నారు. బ్యాంకుకు దాదాపు 1.30 కోట్ల కస్టమర్లు ఉన్నారని, అంటే ప్రతి నలుగురు వ్యక్తుల్లో ఒకరికి బ్యాంకు ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి నెలలో, ప్రతి క్వార్టర్‌లో కూడా అభివృద్ధిని సాధిస్తూ మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.లక్షా 36 వేల కోట్ల వ్యాపారలావాదేవీలు జరిపినట్లు వెల్లడించారు. తద్వారా బ్యాంకు రూ.1836 కోట్ల నికర లాభం సాధించిందని వివరించారు. దేశవ్యాప్తంగా 28 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో అత్యధిక లాభం కలిగిన బ్యాంకుగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నిలిచిందని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో వివిధ వర్గాలకు సంబంధించి ప్రాధాన్య రంగాలకు 92 శాతం రుణాలను మంజూరు చేశామని చెప్పారు. రాజధాని అమరావతి నుంచి త్వరలోనే బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభిస్తామని, ఇప్పటికే కార్యాలయ నిర్మాణానికి అమరావతిలో భూమి కేటాయించారని ప్రమోద్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రెండు, మూడు నెలల్లో నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో విజిలెన్స్ ఇన్‌ఛార్జ్ బి.హరీశ్‌బేతా, జనరల్ మేనేజర్ ఎస్ఆర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

నేడు రామాలయానికి శంకుస్థాపన

- ఆకివీడులో భారీ బందోబస్తు.. సీసీ కెమెరాల ఏర్పాటు
- 'నేడు చలో ఆకివీడు'కు రెండు వర్గాల పిలుపుపై ఉత్కంఠ

ఆకివీడు, మే 2(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేట రామాలయ పునఃనిర్మాణానికి ఆదివారం ఉదయం 7.14 గంటలకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, రమాదేవి దంపతులు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఏలూరు రేంజ్ పరిధిలోని 600 పోలీసులతో ప్రధాన రహదారులపై గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానితులపై ఇప్పటికే నిఘా పెట్టారు. పెదపేట చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రఘురామకృష్ణరాజుకు మద్దతుగా ఆలయ నిర్మాణ శంకుస్థాపనకు తరలి రావాలని హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. మరోవైపు 'గొంతెనమ్మ గుడి పునఃనిర్మాణం.. ఆరు గంటల 30 నిమషాలకు.. చలో ఆకివీడు' అంటూ ఎంఆర్‌పీఎస్ నేతల పేరిట సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రామాలయ పునఃనిర్మాణాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కంటైనర్

- చెలరేగిన మంటల్లో డ్రైవర్ సజీవ దహనం



ప్రమాదంలో దగ్ధమైన కంటైనర్

హనుమాన్‌జంక్షన్ రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆగి ఉన్న టిప్పర్ లారీని వెనుక వస్తున్న కంటైనర్ ఢీ కొన్న ఘటనలో అగ్ని ప్రమాదం సంభవించి కంటైనర్ నడుపుతున్న డ్రైవర్ అగ్నికి ఆహుతైన ఘటన కృష్ణా జిల్లా వీరవల్లి బైపాస్ వద్ద శనివారం తెల్లవారుఝామున జరిగింది. వీరవల్లి పోలీసుల కథనం ప్రకారం.. దొనకొండ నుంచి కంకర లోడుతో ఏలూరు వైపు వస్తున్న టిప్పర్‌ను ఆదే రహదారిపై వస్తున్న ఖాళీ కంటైనర్ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో మంటలు వ్యాపించి టిప్పర్ వెనుక భాగంతో పాటు టైర్లు కాలిపోగా, కంటైనర్ ముందు భాగం కాలిపోయింది. కంటైనర్ ముందు భాగం నుజ్జవడంతో డ్రైవర్ టి.సురేంద్ర(23) కాళ్లు నలిగి బయటకు రాలేక అగ్నికి ఆహుతైపోయాడు. కంటైనర్‌లో ఉన్న మరో వ్యక్తికి ప్రమాదంలో చిన్నపాటి గాయాలయ్యాయని, క్షతగాత్రుణ్ణి ఆసుపత్రికి తరలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై సత్యం సురేష్ వివరించారు.

6 వరకూ చెదురుమదురుగా వర్షాలు

- కొనసాగుతున్న ఎండ తీవ్రత.. వడగాడ్పులు
- ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 45.4 డిగ్రీలు
- 239 మండలాల్లో 41 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు

అమరావతి, విశాఖపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్కడక్కడా శనివారం ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. దక్షిణ కోస్తాతో పాటు రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగింది. 17 జిల్లాల పరిధిలోని 239 మండలాల్లో 41 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మార్కాపురం జిల్లా బొట్లుగూడూరులో 45.1, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం ఎండ తీవ్రతతోపాటు గుంటూరు జిల్లాలో తీవ్ర వడగాడ్పులు, మరో 124 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ కోస్తాలో పలుచోట్ల వడగాడ్పులు వీస్తాయని, రాయలసీమ, ఉత్తర కోస్తాల్లో వేడి వాతావరణం కొనసాగుతుందని, అక్కడక్కడా వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తాలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్లు, రాయలసీమలో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తున్నందున ఆదివారం మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ నెల 6 వరకు అక్కడక్కడా గాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

'బండ' బాదుడు.. కేంద్రం అతి పెద్ద గిఫ్ట్: షర్మిల


అమరావతి, విశాఖపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): ఓట్ల కోసం వేషం కట్టడం... ఎన్నికలు ముగిశాక జనం నెత్తిన భారం మోపడం ప్రధాన నరేంద్ర మోదీకి వెన్నతో పెట్టిన విద్య అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత 'బండ బాదుడు' దేశ ప్రజలకు కేంద్రం ఇచ్చిన అది పెద్ద గిఫ్ట్ అని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'వాణిజ్య గ్యాస్ సిలెండర్ మీద ఒకేసారి రూ.993, ఐదు కిలోల మినీ సిలెండరుపై రూ.549 పెంచిన ఘనత మోదీకే దక్కింది. ఆరు నెలల్లో రూ.1513 పెంచడం దేశ చరిత్రలోనే ఇది ప్రథమం. ఈ ఏడాదిలోనే ధర 80% పెంచిన మోదీ ఘనతకు గుర్తుగా దేశంలోని ప్రతి మ్యూజియంలోనూ ప్రధాని పేరును సువర్ణాక్షరాలతో రాయాలి. బయట తినేవారి నెత్తిన గుదిబండ. విద్యార్థులు, కార్మికుల నడ్డి విరిచినట్లే. టీస్టాల్స్, మిని హోటళ్ల లాంటి చిన్న వ్యాపారుల జీవితాలు అగమ్యగోచరం. కేంద్రం తక్షణం స్పందించి పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని షర్మిల పేర్కొన్నారు.

ధర పెంపును ఉపసంహరించాలి: సీపీఐ

కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధర పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ ప్రభుత్వం వాణిజ్య గ్యాస్ సిలిండరు ధరను అమాంతంగా రూ.993 పెంచి జనంపై మోయలేని ఆర్థిక భారాన్ని మోపడం సరికాదని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కేసుల భారం తగ్గించేందుకే అదనపు కోర్టుల ఏర్పాటు

- జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు



నూతన కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ వై.లక్ష్మణరావు

మార్కాపురంటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): కేసుల భారం తగ్గించేందుకే రాష్ట్రవ్యాప్తంగా అదనపు కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్టు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తెలిపారు. మార్కాపురం కోర్టు భవనాల సముదాయంలో రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ వై.లక్ష్మణరావు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.సత్యానంద్, కలెక్టర్ ఎం.విజయ సునీతతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ కోర్టులు దోహదపడతాయన్నారు. కోర్టులను భారతదేశ నూతన దేవాలయాలుగా పేర్కొన్నారు.

నేటి మ్యాచ్‌లు

	వేదిక
సన్‌రైజర్స్ X కోల్‌కతా	మ.3.30 వేదిక: హైదరాబాద్
గుజరాత్ X పంజాబ్	రా.7.30 వేదిక : అహ్మదాబాద్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	8	6	1	1	13	1.043
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	9	6	3	0	12	0.832
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	9	5	4	0	10	-0.192
చెన్నై	9	4	5	0	8	0.005
ఢిల్లీ	9	4	5	0	8	-0.895
కోల్‌కతా	8	2	5	1	5	-0.751
ముంబై	9	2	7	0	4	-0.803
లఖ్‌నవూ	8	2	6	0	4	-1.106

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు

చెన్నై చమక్

రుతురాజ్, కార్తీక్ హాఫ్ సెంచరీలు

రాణించిన బౌలర్లు
ముంబైకి ఏడో ఓటమి


రుతురాజ్ (67 నాటౌట్)


కార్తీక్ (54 నాటౌట్)

2 సీఎస్‌కే తరఫున ఎక్కువ హాఫ్ సెంచరీ (24)లు చేసిన రెండో బ్యాటర్‌గా రుతురాజ్. రైనా (34) ముందున్నాడు.

చెన్నై: రుతురాజ్ గైక్వాడ్ (48 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 67 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగగా.. యువ బ్యాటర్ కార్తీక్ శర్మ (40 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 54 నాటౌట్) కెరీర్‌లో తొలి హాఫ్ సెంచరీతో మురిపించాడు. దీంతో సొంత వేదికపై ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ఈ సీజన్‌లో ముంబైపై సీఎస్‌కేకిది రెండో విజయం. అటు హార్దిక్ సేన ఆడిన తొమ్మిది మ్యాచుల్లో ఏడో ఓటమితో ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత క్లిష్టం చేసుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ముంబై 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు చేసింది. నమన్ ధిర్ (37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 57), రికెల్టన్ (24 బంతుల్లో 5 సిక్సర్లతో 37) రాణించారు. అన్షుల్‌కు 3, నూర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 18.1 ఓవర్లలో 2 వికెట్లకు 160 పరుగులు చేసి గెలిచింది. ఉర్విల్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 24) ఫర్వాలేదనిపించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రుతురాజ్ నిలిచాడు.

రుతురాజ్-కార్తీక్ సమన్వయం: స్వల్ప ఛేదనలో రుతురాజ్, యువ బ్యాటర్ కార్తీక్ శర్మ చక్కటి అర్ధసెంచరీలతో చెన్నైని గెలుపు దిశగా నడిపించారు. ఫామ్‌లో ఉన్న సంజూ శాంసన్ (11) రెండో ఓవర్‌లోనే బుమ్రాకు చిక్కాడు. అయితే బౌల్ట్ ఓవర్‌లో రుతురాజ్ 4,4,6తో 17 రన్స్ అందించాడు. అటు ఉర్విల్ ఉన్న కాసేపు బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఐదో ఓవర్‌లో 6,4,6తో 18 రన్స్ సమకూర్చాడు. కానీ ఆరో ఓవర్‌లో ఉర్విల్‌ను ఘజన్‌ఫర్ బౌల్డ్ చేయడంతో పవర్‌ప్లేలో చెన్నై 62/2తో నిలిచింది. ఈ దశలో రుతురాజ్‌కు జత కలిసిన కార్తీక్ సమన్వయంతో బ్యాటింగ్ సాగించాడు. స్ట్రయిక్‌ను రొటేట్ చేస్తూ కెప్టెన్‌కు అండగా నిలిచాడు. 34 బంతుల్లో రుతురాజ్ వరుసగా రెండో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. కార్తీక్ 17వ ఓవర్‌లో 4,6,4తో విజృంభించాడు. అదే ఊపులో కార్తీక్ తొలి ఫిఫ్టీ పూర్తి చేయడమే కాకుండా ఓ ఫోర్‌తో 11 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు. మూడో వికెట్‌కు ఈ జోడీ అజేయంగా 98 రన్స్ జోడించింది.

నత్తనడకగా..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్‌లో నమన్, ఓపెనర్ రికెల్టన్ మాత్రమే జోరు చూపారు. వీరి ధాటికి తొలి 10 ఓవర్లలో 90 పరుగులిచ్చిన చెన్నై బౌలర్లు ఆ తర్వాత ప్రత్యర్థిని మరో 69 రన్స్‌కే పరిమితం చేశారు. దీంతో ముంబై అతికష్టమ్మీద 150 రన్స్ దాటగలిగింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ విల్ జాక్స్ (1) రెండో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. ఈ స్థితిలో వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన నమన్‌తో కలిసి రికెల్టన్ బాధ్యత తీసుకున్నాడు. ముకేశ్ ఓవర్‌లో రెండు, ప్రశాంత్ ఓవర్‌లో మూడు సిక్సర్లతో రికెల్టన్ వేగం చూపాడు. అటు నమన్ సిక్సర్‌తో జట్టు పవర్‌ప్లేలో 57/1 రన్స్ సాధించింది. ఆ తర్వాత చెన్నై బౌలర్లు పట్టు సాధించారు. నూర్ ఓవర్‌లో నమన్ 11 పరుగుల వద్ద ఇచ్చిన సులువైన క్యాచ్‌ను దూబే వదిలేయగా.. అదే ఓవర్‌లో రికెల్టన్ అవుటయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం సూర్య(21) ఓ ఫోర్, సిక్స్‌తో టచ్‌లోకి వచ్చినట్టు కనిపించాడు. కానీ అతను స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. తిలక్ (5) విఫలం కాగా.. హార్దిక్ (18) షాట్లు ఆడలేకపోయాడు. మధ్య ఓవర్లలో సీఎస్‌కే బౌలర్లు పరుగులను నియంత్రించారు. 34 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాక నమన్‌ను ఒవర్టన్ అవుట్ చేశాడు. అయితే డెత్ ఓవర్లలోనూ హార్దిక్ హిట్టింగ్ చేయలేకపోయాడు. చివరి ఐదు ఓవర్లలో ముంబై చేసింది 39 పరుగులే కాగా.. మూడు వికెట్లు కూడా కోల్పోయింది.

స్కోరుబోర్డు

ముంబై: జాక్స్ (సి) ఘోష్ (బి) అన్షుల్ 1, రికెల్టన్ (సి) ఉర్విల్ (బి) నూర్ 37, నమన్ (సి/సబ్) సర్ఫరాజ్ (బి) ఒవర్టన్ 57, సూర్యకుమార్ (సి) బ్రెవిస్ (బి) ఘోష్ 21, తిలక్ (సి) రుతురాజ్ (బి) నూర్ 5, హార్దిక్ (సి) బ్రెవిస్ (బి) అన్షుల్ 18, రాబిన్ (బి) అన్షుల్ 5, క్రిష్ భగత్ (నాటౌట్) 3, బౌల్ట్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 159/7; వికెట్ల పతనం:** 1-1, 2-59, 3-99, 4-109, 5-134, 6-139, 7-151; **బౌలింగ్:** ముకేశ్ 3-0-25-0, అన్షుల్ 4-0-32-3, ప్రశాంత్ 2-0-25-0, నూర్ అహ్మద్ 4-0-26-2, రామకృష్ణ ఘోష్ 3-0-24-1, ఒవర్టన్ 4-0-23-1.

చెన్నై: శాంసన్ (సి) రికెల్టన్ (బి) బుమ్రా 11, రుతురాజ్ (నాటౌట్) 67, ఉర్విల్ (బి) ఘజన్‌ఫర్ 24, కార్తీక్ (నాటౌట్) 54, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 18.1 ఓవర్లలో 160/2; వికెట్ల పతనం:** 1-13, 2-62; **బౌలింగ్:** బౌల్ట్ 3.1-0-37-0, బుమ్రా 3-0-20-1, క్రిష్ భగత్ 2-0-22-0, ఘజన్‌ఫర్ 4-0-40-1, రఘు శర్మ 4-0-24-0, హార్దిక్ 2-0-17-0.

శ్రీచరణికి చోటు

- అరుంధతికి కూడా..
- భారతి, యాస్తిక, నందినికి చాన్స్
- టీ20 వరల్డ్ కప్‌నకు భారత జట్టు


శ్రీచరణి


అరుంధతి

ముంబై: నిరుటి వన్డే వరల్డ్ కప్‌లో అదరగొట్టిన తెలుగు స్పిన్నర్ శ్రీచరణికి తొలిసారి టీ20 ప్రపంచ కప్ జట్టులో చోటు లభించింది. అలాగే గత పొట్టి వరల్డ్ కప్‌లో సత్తా చాటిన మరో తెలుగు పేసర్ అరుంధతి రెడ్డి తన స్థానాన్ని నిలబెట్టుకుంది. వచ్చేనెల 12న ఇంగ్లండ్, వేల్స్ దేశాల్లో జరిగే మహిళల టీ20 ప్రపంచ కప్, అంతకంటే ముందు (ఈనెల 28 నుంచి) ఇంగ్లండ్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్, ఏకైక టెస్ట్ (జూలై 10 నుంచి)కు భారత జట్లను శనివారం ప్రకటించారు. వికెట్ కీపర్, బ్యాటర్ యాస్తికా భాటియా, పేసర్ భారతీ ఫుల్‌మాలీ, అన్‌క్యాప్డ్ నందినీ శర్మకు ప్రపంచ కప్ జట్టులో చోటు కల్పించారు. స్పెషలిస్ట్ బ్యాటర్ హర్లీన్ డియోల్‌పై వేటు వేశారు. ఆల్‌రౌండర్ అమన్‌జోత్ కౌర్, సీమర్ కష్వీ గౌతమ్ గాయాలతో జట్టుకు దూరమయ్యారు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతీ మంధాన ఆమెకు డిప్యూటీగా వ్యవహరించనుంది. సీనియర్ పేసర్ పూజా వస్త్రాకర్‌కు చోటు లభించలేదు. దాంతో రేణుకా సింగ్ ఫాస్ట్ బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించనుంది. ఆమెకు తోడుగా అరుంధతి, క్రాంతి గౌడ్‌ను ఎంపిక చేశారు. గత టీ20 ప్రపంచ కప్ (2024)లో అరుంధతి మొత్తంగా 6.50 ఎకానమీతో 7 వికెట్లు తీసింది. ఇక, నిరుటి వన్డే వరల్డ్ కప్‌లో స్పిన్నర్ శ్రీచరణి మొత్తం 14 వికెట్లు పడగొట్టి భారత జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించింది. దాంతో టీ20 వరల్డ్ కప్ జట్టులోనూ శ్రీచరణి స్థానం సంపాదించుకుంది. అలాగే ప్రపంచ కప్ తర్వాత ఇంగ్లండ్‌తో జరిగే ఏకైక టెస్ట్‌కు జట్టులో శ్రీచరణి చోటు దక్కించుకుంది. దరిమిలా 3 ఫార్మాట్లలో ఆడే చాన్సు ఆమెకు లభించింది. ప్రధాన జట్టంతా దాదాపు గత ఏడాది వన్డే వరల్డ్ కప్ గెలిచిన టీమే కావడం గమనార్హం. జూన్ 14న బర్మింగ్‌హామ్‌లో పాకిస్థాన్‌తో పోరు ద్వారా టీ20 ప్రపంచ కప్ సమరాన్ని టీమిండియా ఆరంభించనుంది. ఇక, గత మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాణించిన మీడియం పేసర్ నందినీ శర్మకు తొలిసారి జాతీయ జట్టు తరఫున ఆడేందుకు పిలుపు లభించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన ఆమె 10 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు సాధించింది. కాగా..ప్రతికను జూలై 10 నుంచి 13 వరకు ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో జరిగే ఏకైక టెస్ట్ జట్టుకు ఎంపిక చేశారు. హర్లీన్ డియోల్‌ను ఇంగ్లండ్‌లో తెల్లబంతుల టూర్‌కు భారత్ 'ఎ' జట్టుకు కెప్టెన్‌గా నియమించారు.

ఇంగ్లండ్‌తో టీ20లు, వరల్డ్ కప్ జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతీ మంధాన (వైస్-కెప్టెన్), రిచా ఘోష్ (కీపర్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతీ ఫుల్‌మాలీ, దీప్తీ శర్మ, అరుంధతి రెడ్డి, శ్రీచరణి, రేణుకా సింగ్, క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్, నందినీ శర్మ, రాధా యాదవ్.

ఇంగ్లండ్‌తో టెస్ట్‌కు: హర్మన్ (కెప్టెన్), మంధాన (వైస్-కెప్టెన్), షఫాలీ, జెమీమా, ప్రతిక రావల్, రిచా ఘోష్ (కీపర్), శ్రీచరణి, యాస్తికా భాటియా, నందినీ శర్మ, హర్లీన్ డియోల్, రేణుక సింగ్, క్రాంతి గౌడ్, సయాలీ సత్గరే, స్నేహ్ రాణా.


భారతి


యాస్తిక


నందిని

పాక్ జలసంధిని ఈదిన ఏడేళ్ల చిన్నారి

జార్ఖండ్ స్విమ్మర్ ఇషాంక్ అరుదైన ఘనత



న్యూఢిల్లీ: ఏడేళ్ల బాలుడు ఇషాంక్ సింగ్ పాక్ జలసంధిని ఈది సరికొత్త రికార్డు సృష్టించాడు. జార్ఖండ్ రాజధాని రాంచీకి చెందిన స్విమ్మర్ ఇషాంక్.. శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి తమిళనాడులోని ధనుష్కోడి వరకు ఉన్న 29 కిలో మీటర్ల పాక్ జలసంధిని కేవలం 9 గంటలా 50 నిమిషాల్లో ఈదాడు. దీంతో ఈ జలసంధిని వేగవంతంగా ఈదిన స్విమ్మర్‌గా ఇషాంక్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అంతే కాదు.. ఈ ఘనత సాధించిన పిన్న వయసు స్విమ్మర్‌గానూ అరుదైన ఘనత సాధించాడు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఉధృతమైన సముద్రపు అలల మధ్య ఇషాంక్ ఈ ఫీట్ నమోదు చేయడం విశేషం.

జేమిసన్ 'అతి'కి డీమెరిట్ పాయింట్

జైపూర్: ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ కైల్ జేమిసన్‌ను ఐపీఎల్ హెచ్చరించింది. శుక్రవారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని రెండో బంతికే బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత ఆగ్రహంతో ఊగిపోతూ చప్పట్లు చరుస్తూ వైభవ్‌కు సెండాఫ్ ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ప్రత్యర్థి బ్యాటర్‌ను అగౌరవపరిచే విధంగా ప్రవర్తించినందుకు మ్యాచ్ రెఫరీ.. జేమిసన్ ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్‌ను చేర్చాడు. మరోవైపు ఓ 15 ఏళ్ల కుర్రాడిని అవుట్ చేసి ఇంతలా సంబరాలు చేసుకున్నాడంటే వైభవ్ వారిని ఎంతలా భయపెట్టాడో అర్థమవుతుందని సోషల్ మీడియాలో కామెంట్స్ వినిపించాయి.

భారత్..కాంస్యంతో సరి

● థామస్ కప్ ఫైనల్స్



హర్సెన్స్ (డెన్మార్క్): ప్రతిష్ఠాత్మక థామస్ కప్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో భారత పురుషుల జట్టు స్వర్ణ పోరుకు చేరడంలో విఫలమైంది. 2022 చాంపియన్ భారత్ శనివారం జరిగిన సెమీఫైనల్లో ఫ్రాన్స్ చేతిలో పరాజయం పాలై కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. తొలి సింగిల్స్‌లో ఆయుష్ షెట్టి 11-21, 9-21తో వరల్డ్ నెం.4 క్రిస్టో పొపోవ్ చేతిలో ఓడాడు. రెండో సింగిల్స్‌లో శ్రీకాంత్ 16-21, 18-21తో లానియర్ చేతిలో, మూడో సింగిల్స్‌లో ప్రణయ్ 19-21, 16-21తో టోమా జూనియర్ పొపోవ్ చేతిలో ఓడారు. దీంతో ఫ్రాన్స్ 3-0తో భారత్‌పై స్పష్టమైన ఆధిక్యం సాధించింది. ఆ తర్వాతి రెండు డబుల్స్ మ్యాచ్‌లు నామమాత్రమే కావడంతో ఫ్రాన్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

మన రిలే జట్లు విఫలం

గాబోరోన్ (బోట్స్‌వానా): వరల్డ్ అథ్లెటిక్స్ రిలే టోర్నమెంట్‌లో భారత్‌కు చెందిన ఐదు జట్లు ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యాయి. పురుషుల 4x400 మీటర్ల రిలే హీట్స్‌లో ధర్మ్‌వీర్, రాజేశ్, విశాల్, మనులతో కూడిన బృందం నాలుగో స్థానంలో నిలవగా.. ఇక, మిక్స్‌డ్ 4x100 మీ. రిలే హీట్స్‌లో తెలుగమ్మాయి నిత్య గంధె, స్నేహ, తమిళరసు, అనిమేశ్‌లతో కూడిన జట్టు రేసు పూర్తి చేయలేకపోవడం గమనార్హం. మిక్స్‌డ్ 4x400 మీ. రిలే హీట్స్‌లో తీర్థేశ్, అన్సా బాబు, అమోజ్ జాకబ్, రష్దీప్ కౌర్ బృందం ఆరో స్థానంలో, మహిళల 4x100 మీ. రిలే హీట్స్‌లో నిత్య, తమన్నా, సుదేష్ణ, స్నేహ జట్టు ఐదోస్థానంలో, పురుషుల 4x100 మీ. రిలే హీట్స్‌లో హర్ష్, రగుల్, అనిమేశ్, గుర్విందర్ బృందం 8వ స్థానంలో నిలిచాయి. ప్రతి హీట్స్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లే ఫైనల్ చేరనున్న సంగతి తెలిసిందే.

ఇటీవలి కాలంలో గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించే వారు జీఎస్‌టీకి సంబంధించి ఆందోళన చెందటం చూస్తున్నాం. ముఖ్యంగా వెల్ఫేర్ అసోసియేషన్స్ తాము జీఎస్‌టీ చెల్లించాల్సి రావటం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అసలు వెల్ఫేర్ అసోసియేషన్ జీఎస్‌టీ కట్టాల్సిన అవసరం ఉందా? ఆ వివరాలు మీ కోసం..

అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాలు జీఎస్‌టీ చెల్లించాలా?

ఇదీ GST


రాంబాబు గొండాల

ఒకప్పుడు అపార్ట్‌మెంట్ అంటే నాలుగైదు అంతస్తులకు మాత్రమే పరిమితమై ఉండేవి. వీటిలో కనీస అవసరాలు మాత్రమే ఉండేవి. క్రమేపి ప్రజల జీవనశైలి మారటం, అభిరుచుల్లో మార్పులతో పాటుగా బ్యాంకింగ్ సేవలు అందరికి అందుబాటులోకి రావటంతో వివిధ సదుపాయాలతో ఉండే బహుళ అంతస్తులు ఉండే భవనాలు వెలుస్తున్నాయి. బిల్డర్ తాను అపార్ట్‌మెంట్ నిర్మించే సమయంలో అన్ని సౌకర్యాలు కల్పించినా ఆ తర్వాత వాటిని మెయింటెనెన్స్ చేయటం చాలా ఖర్చుతో కూడుకున్న పని. అందుకే అపార్ట్‌మెంట్‌లో నివసించే వారు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ లేదా సొసైటీ ఏర్పాటు చేసుకుంటారు. ఈ అసోసియేషన్ చేసే పని ఏమిటంటే అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని పనులు అంటే సెక్యూరిటీ, లిఫ్ట్, కామన్ ఏరియా, పార్కులు, ఆట స్థలాలు మొదలైన వాటిని చూసుకుంటుంది. దీనిలో అపార్ట్‌మెంట్‌లోని అందరు సభ్యులుగా వ్యవహరిస్తారు. నెలవారీ ఖర్చుల కోసం ప్రతి సభ్యుడి నుంచి కొంత మెయింటెనెన్స్ చార్జీల కింద వసూలు చేస్తారు. మరి ఇలా వసూలు చేసే చార్జీల మీద ఆయా సంక్షేమ సంఘాలు జీఎస్‌టీ చెల్లించాలా? చెల్లించాల్సి వస్తే దాని విధి విధానాలు ఏమిటి? ఇలాంటి సందేహాలు చాలా మందికి ఉన్నాయి.

మినహాయింపులున్నాయ్..: రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ జీఎస్‌టీ చెల్లించాలా అంటే.. కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే ఇది కొత్తగా విధించిన పన్ను కాదు.. జీఎస్‌టీ వచ్చినప్పటి నుంచి ఉంది. ఇంకా చెప్పాలంటే సర్వీస్ ట్యాక్స్ కాలం నుంచి ఉంది. మరి ఇది అందరూ చెల్లించాలా అంటే, దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి. తమ సభ్యుల ద్వారా వసూలు చేసే మొత్తం సంవత్సరానికి రూ.20 లక్షలు దాటనంత వరకు ఆయా సంక్షేమ సంఘాలకు జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఒకవేళ ఆ మొత్తం రూ.20 లక్షలు దాటితే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి.

ఇంకా సభ్యుడి నుంచి వసూలు చేసే నెలవారీ మెయింటెనెన్స్ నెలకు రూ.7,500 మించకపోతే ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు ఒక అపార్ట్‌మెంట్‌లో మూడు బెడ్‌రూమ్స్ ఫ్లాట్‌కు మెయింటెనెన్స్ చార్జీ నెలకు రూ.8,000, రెండు బెడ్‌రూమ్స్‌కు రూ.7,000 అనుకుందాం. అప్పుడు మూడు బెడ్‌రూమ్స్ ఫ్లాట్‌కు సంబంధించిన మెయింటెనెన్స్ చార్జీ మీద అంటే రూ.8,000 మీద మాత్రమే జీఎస్‌టీ కడితే సరిపోతుంది. అయితే ఇక్కడ ఒక సందేహం రావచ్చు. రూ.7,500 వరకు పన్ను మినహాయింపు ఉంది కాబట్టి అది పోనూ మిగతా మొత్తం మీద అంటే రూ.500 మీద జీఎస్‌టీ కడితే సరిపోతుందా అని. దీనికి సంబంధించి ప్రభుత్వం ఒక వివరణ ఇవ్వటం జరిగింది. దీని ప్రకారం ఒక నెల మెయింటెనెన్స్ చార్జీ రూ.7,500 దాటినట్లయితే, మొత్తం చార్జీ మీద జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుంది. అంటే ఇప్పుడు చెప్పుకున్న ఉదాహరణలో రూ.500 మీద కాకుండా మొత్తం రూ.8,000కు జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.

ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఫ్లాట్స్ ఉంటే..: అలాగే ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఫ్లాట్స్ ఉంటే జీఎస్‌టీ కోసం మెయింటెనెన్స్ చార్జీని మొత్తంగా కలిపి చూడాలా లేదా విడివిడిగా చూడాలా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. పైన చెప్పిన ఉదాహరణలో ఒకే వ్యక్తికి ఒక మూడు బెడ్‌రూమ్స్ ఫ్లాట్, ఇంకా రెండు బెడ్‌రూమ్స్ ఫ్లాట్ ఉన్నాయనుకుందాం. రెండింటి మీద కలిపి రూ.15,000 మెయింటెనెన్స్ కట్టాల్సి వస్తుంది. ఈ మొత్తం పన్ను మినహాయింపు పరిమితి రూ.7,500 మించి ఉంది కాబట్టి మొత్తం మీద జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుందా? దీనికి కూడా వివరణ ఇవ్వటం జరిగింది. ఒక వ్యక్తికి ఎన్ని ఫ్లాట్లు ఉన్నప్పటికీ ఏ ఫ్లాట్‌కు అయితే మెయింటెనెన్స్ రూ.7,500 దాటుతుందో దాని మీద మాత్రమే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని అపార్ట్‌మెంట్లలో తక్కువ ఫ్లాట్లు ఉన్నప్పుడు మెయింటెనెన్స్ రూ.7,500 దాటినప్పటికీ, వార్షిక టర్నోవర్ రూ.20 లక్షలు దాటకపోవచ్చు. అలాంటప్పుడు అసోసియేషన్స్‌కు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ అవసరం లేదు.

ఐటీసీ తీసుకోవచ్చా..: మరి ఈ వెల్ఫేర్ అసోసియేషన్ తాము పొందిన వస్తు సేవల మీద జీఎస్‌టీ నిబంధనల మేరకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకోవచ్చా అంటే, కచ్చితంగా తీసుకోవచ్చు (ఐటీసీ నిబంధనల మేరకు మాత్రమే). మరి ఎలాంటి ఖర్చుల మీద తీసుకోవచ్చంటే.. సెక్యూరిటీ, లిఫ్ట్, కామన్ ఏరియా, మెయింటెనెన్స్, స్టేషనరీ, పంపులు, పైపులు, ఇతరత్రా అసోసియేషన్‌కు సంబంధించిన ఖర్చులు. అయితే వర్క్స్ కాంట్రాక్ట్ సర్వీసులకు ఐటీసీ తీసుకోరాదు. ఇంకొక విషయం ఏమిటంటే అసోసియేషన్‌లో కొంతమంది రూ.7,500 పైన, మరికొందరు రూ.7,500 కంటే తక్కువ చెల్లిస్తున్నట్లయితే పన్ను చెల్లించే టర్నోవర్ ప్రకారం క్రెడిట్ తీసుకోవాలి. ఉదాహరణకు ఒక నెలలో రూ.7,500 కంటే ఎక్కువ చెల్లించే మొత్తం రూ.15 లక్షలు, రూ.7,500 కంటే తక్కువ చెల్లించిన మొత్తం రూ.10 లక్షలు అనుకుంటే.. మొత్తం టర్నోవర్ రూ.25 లక్షల్లో 60 శాతం పన్ను చెల్లించే కేటగిరీ కింద వస్తుంది కాబట్టి ఐటీసీ కూడా 60 శాతమే తీసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఆస్తులు కొంటున్నారా.. ఇవి చెక్ చేసుకోండి!



చేతిలో నాలుగు రాళ్లు ఉంటే ప్రతి ఒక్కరూ ముందుగా ఏదో ఆస్తి సమకూర్చుకోవాలని అనుకుంటారు. అది భూములు కావచ్చు లేదా ఇల్లు కావచ్చు. అయితే వీటిని కొనే ముందే ఆ ఆస్తికి సంబంధించిన యాజమాన్య హక్కులు, దాన్ని నిరూపించే డాక్యుమెంట్లను పూర్తిగా చెక్ చేసుకోవాలి. లేకపోతే కష్టార్జితమంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. మాయమాటలతో ఒకే ఆస్తిని ఇద్దరు, ముగ్గురికి అంటగడుతున్న ఈ రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండడం అవసరం. ఈ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఆస్తులు కొనేటప్పుడు ప్రతి ఒక్కరూ ఈ డాక్యుమెంట్లను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలి. అవేమిటంటే..

టైటిల్, యాజమాన్య పత్రాలు: ఈ పత్రాలు మీరు కొనబోయే ఆస్తి ఎవరి పేరు మీద ఉంది? చట్టబద్ధంగా దాని యజమాని ఎవరు? వివాదాలు లేకుండా ఆ ఆస్తిని ఇతరులకు బదిలీ చేయవచ్చా? అనే విషయాలు తెలుస్తాయి. ఆస్తి కొనుగోలుదారుడితో పాటు ఆ ఆస్తి కొనుగోలుకు రుణాలు ఇచ్చే బ్యాంకులు కూడా తప్పనిసరిగా ఈ డాక్యుమెంట్లను చెక్ చేసుకోవాలి. ఇందుకోసం ప్రాపర్టీ అంశాలపై గట్టి పట్టు ఉన్న లాయర్ సేవలు తీసుకుంటే మరింత మంచిది.

సేల్ డీడ్: ఈ డాక్యుమెంట్ ద్వారా మీరు కొనబోయే ఆస్తి.. ప్రస్తుత అమ్మకందారుడికి ఎలా వచ్చిందనే విషయం తెలుస్తుంది. ఇందులో ఈ ఆస్తి అమ్మకందారుడికి కొనుగోలు, గిఫ్ట్‌గా లేదా వారసత్వం ఈ మూడింటిలో ఎలా వచ్చిందనే విషయం స్పష్టంగా తెలుస్తుంది.

ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్: ఈ సర్టిఫికెట్ ద్వారా మీరు కొనబోయే ఆస్తిపై తీసుకున్న రుణాల చరిత్ర, తనఖా వివరాలు, న్యాయపరమైన వివాదాల చరిత్ర తెలుస్తుంది. కొనబోయే ఆస్తి ఉన్న ప్రాంత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి 13 నుంచి 30 సంవత్సరాల కాలానికి ఈ ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవడం మంచిది. దీనివల్ల మీరు కొనే ఆస్తి గతంలో ఎవరెవరి పేరు మీద ఉంది? ఎప్పుడెప్పుడు చేతులు మారింది? అనే విషయాలు తెలుస్తాయి.

మదర్ డీడ్ : దీని ద్వారా మీరు కొనబోయే ఆస్తి లేదా భూమి తొలి యజమాని ఎవరో తెలుసుకోవచ్చు.

మ్యుటేషన్/ల్యాండ్ రికార్డులు: ఈ రికార్డులు స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో లభిస్తాయి. వీటి ద్వారా మీరు కొనబోయే ఆస్తి తాజా యాజమాన్య వివరాలు తెలుసుకోవచ్చు.

ఖాతా/మునిసిపల్ రికార్డులు: స్థానిక తహసీల్దార్ లేదా మునిసిపల్ అధికారుల వద్ద ఈ రికార్డులు లభిస్తాయి. వీటి ద్వారా కూడా ఆస్తులు ఎవరి పేరు మీద ఉన్నాయో తెలుసుకోవచ్చు.

పవర్ ఆఫ్ అటార్నీ: పవర్ ఆఫ్ అటార్నీ (పీఓఏ) ద్వారా అమ్మకానికి పెడితే ఈ పత్రాన్ని మరింత జాగ్రత్తగా చెక్ చేసుకోవాలి. ఆస్తి యజమాని నిజంగానే ఆ వ్యక్తికి తన ఆస్తి అమ్మకం కోసం పీఓఏ ఇచ్చాడా? ఇస్తే దానిపై సంతకాలు అసలు యజమానివేనా? అని ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి. ఇక్కడ ఆస్తి యజమాని బతికి ఉంటే అతడు రాసిన ఆఖరి పీఓఏ మాత్రమే కోర్టుల్లో చెల్లుబాటవుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రిజిస్టర్డ్ పీఓఏ ఉంటే మరింత భద్రత ఉంటుంది.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ : ఇల్లు లేదా ఫ్లాట్ కొంటుంటే స్థానిక సంస్థల నుంచి దాని నిర్మాణం పూర్తయి, నివాసానికి అనుగుణంగా ఉన్నట్టు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తారు. బిల్డర్ లేదా ఆ ఇల్లు, ఫ్లాట్ అమ్మే యజమాని నుంచి ఈ సర్టిఫికెట్ కాపీ తీసుకుని తప్పనిసరిగా చెక్ చేసుకోవాలి.

ల్యాండ్ అండ్ ప్రాపర్టీ యూజ్ అప్రూవల్స్ : మీరు కొనే ఇల్లు లేదా ప్రాపర్టీ యాజమాన్య హక్కు పత్రం ఉన్నంత మాత్రాన సరిపోదు. వాటిని నిర్మించిన భూమి, ప్రాపర్టీకి అవసరమైన ల్యాండ్ యూజ్, కన్వర్షన్, లే అవుట్, బిల్డింగ్ ప్లాన్ అనుమతులు ఉన్నాయో లేవో కూడా చెక్ చేసుకోవాలి.

కన్‌స్ట్రక్షన్, పొసెషన్ సర్టిఫికెట్లు: ఈ సర్టిఫికెట్ల ద్వారా మీరు కొనే ఇల్లు లేదా ఫ్లాట్ అనుమతులకు లోబడే నిర్మించారా? డీవియేషన్లు ఏమైనా ఉన్నాయా? ఆ ఇల్లు లేదా ఫ్లాట్ నివాస యోగ్యమేనా అనే విషయాలు తెలుస్తాయి.

రెగ్యులేటరీ, ప్రాజెక్టు స్థాయి అనుమతులు: మీరు కొనే ఇల్లు లేదా ఫ్లాట్ ఉన్న వెంచర్ రెరా రిజిస్ట్రేషన్, స్థానిక సంస్థల అనుమతులు, అగ్నిమాపక, నీటి సరఫరా వంటి శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) వివరాలు కూడా చెక్ చేసుకోవాలి.

ఆర్థిక, బకాయిల పత్రాలు: ఇప్పటికే వేరొకరి యాజమాన్యంలో ఉన్న ఇల్లు లేదా ఫ్లాట్ కొంటుంటే చెల్లించిన ప్రాపర్టీ ట్యాక్స్ రసీదులు, విద్యుత్, వాటర్ బిల్లులు చెక్ చేసుకోవాలి. అలాగే హోమ్ లోన్‌లో ఉన్న ఇల్లయితే ఆ రుణం పూర్తిగా చెల్లించినట్టు రుణం ఇచ్చిన బ్యాంకు జారీ చేసిన ఎన్ఓసీ చెక్ చేసుకోవాలి. హౌసింగ్ సొసైటీ నుంచి కూడా నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకోవాలి.

ఎప్పుడెప్పుడు ఏయే డాక్యుమెంట్ చెక్ చేయాలి?

- బయానా ఇచ్చే ముందు ఓనర్‌షిప్ డాక్యుమెంట్, ఎన్‌కంబరెన్స్ డాక్యుమెంట్ చెక్ చేసుకోవాలి.
- గృహ రుణానికి దరఖాస్తు చేసే ముందు ల్యాండ్ యూజ్, బిల్డింగ్ అప్రూవల్స్, రెగ్యులేటరీ అనుమతులు చెక్ చేసుకోవాలి.
- రిజిస్ట్రేషన్, తుది చెల్లింపులకు ముందు ఆర్థిక బకాయిలు, లోన్ క్లోజర్, పొసెషన్‌కు సంబంధించిన సర్టిఫికెట్లు, తుది ఒప్పందం షరతులు ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలి.


బిజినెస్ ప్లస్

కోటక్ బ్యాంక్ లాభం రూ.5,423 కోట్లు

ముంబై: మార్చితో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి (క్యూ4) కోటక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం రూ.5,423 కోట్లకు పెరిగింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి గడించిన రూ.4,933 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం వృద్ధి కనబరిచింది. స్టాండలోన్ లాభం మాత్రం వార్షిక ప్రాతిపదికన 13 శాతం వృద్ధితో రూ.4,027 కోట్లుగా నమోదైంది. ఈ జనవరి-మార్చి కాలానికి బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 8 శాతం పెరిగి రూ.7,876 కోట్లకు చేరగా.. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 4.54 శాతానికి తగ్గింది. అలాగే, బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 1.20 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.25 శాతానికి తగ్గాయి.

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా రోహిత్ జైన్

న్యూఢిల్లీ: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా రోహిత్ జైన్ నియమితులయ్యారు. ప్రస్తుతం డిప్యూటీ గవర్నర్‌గా ఉన్న టీ రబీ శంకర్ పదవీకాలం ముగియటంతో ఆయన స్థానంలో జైన్ ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. మూడేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఆర్‌బీఐలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జైన్‌కు.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సిస్టమ్స్, మానిటరీ కార్యకలాపాల్లో అపార అనుభవం ఉంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,50,930 ▼	1,38,350 ▼	2,70,000 ▲
విజయవాడ	1,54,000 ▼	1,42,000 ▼	2,53,000 ▲
విశాఖపట్నం	1,50,930 ▼	1,38,350 ▼	2,70,000 ▲
రాజమండ్రి	1,50,000 ▼	1,38,000 ▼	2,70,000 ▲
ప్రొద్దుటూరు	1,52,100 ▲	1,39,930 ▲	2,49,000 ▲
ముంబై	1,50,263 ▲	1,37,641 ▲	2,40,331 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ



హైదరాబాద్	525	విజయవాడ	530
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		దజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	123
వరంగల్	130	గుంటూరు	123
కరీంనగర్	130	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	112
కర్నూలు	130	నెల్లూరు	117
విశాఖపట్నం	124	అనంతపురం	117
గోదావరి	123		

మహానాడు వేదికపై 2, 3 రోజుల్లో తుది నిర్ణయం

- నెల్లూరు చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తాం: మంత్రి నారాయణ
- రెండవ రోజూ కొనసాగిన స్థల పరిశీలన

నెల్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మహానాడును నెల్లూరులో ఎక్కడ నిర్వహించాలన్న విషయాన్ని రెండు, మూడు రోజుల్లో ఖరారు చేయనున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సీఎం కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణ రాజు, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులతో కలసి మంత్రి నారాయణ 2వ రోజు శనివారం స్థల పరిశీలనలో పాల్గొన్నారు. కొడవలూరు మండలం చెన్నై-విజయవాడ జాతీయ రహదారికి సమీపంలోని ఇఫ్కో కిసాన్ సెజ్, రేగడచెలిక ప్రాంతాలను పరిశీలించారు. నెల్లూరు నగరాన్ని ఆనుకొని ఉన్న చింతారెడ్డిపాళెం, బలిజపాళెం, వీపీఆర్ విల్లాస్ ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. 'మూడు రోజుల పసుపు పండుగను (ఈ నెల 27, 28, 29) చరిత్ర గుర్తించుకునే స్థాయిలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. మహానాడు నిర్వహణపై నారాయణ ఆసుపత్రి ప్రాంగణంలో మంత్రులు ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు సమావేశమయ్యారు.

విద్యుత్తు అంతరాయాలు ఉండొద్దు: గొట్టిపాటి

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్తు అంతరాయాలు ఉండటానికి వీల్లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు స్పష్టం చేశారు. అకాల వర్షాలు, అధిక వేడి వల్ల తాత్కాలిక విద్యుత్తు సమస్యలు తలెత్తినా వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. శనివారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో విద్యుత్తు సంస్థల సీఎండీలతో మంత్రి టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. విద్యుత్తు సరఫరా పరిస్థితిని సమీక్షించారు. అధికారికంగా లేదా అనధికారికంగా రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్తు అంతరాయాలు ఉండటానికి వీల్లేదని మంత్రి ఆదేశించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా సమస్యల పరిష్కారానికి సిబ్బంది అందుబాటులో ఉంటూ, అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.

కాలువల్లో పూడికతీత పనులకు రూ.397 కోట్లు

- తక్షణమే తూడు, గుర్రపుడెక్క తొలగించండి: నిమ్మల

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.397 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో తక్షణమే తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. నెలాఖరులోగా పనులన్నీ పూర్తిచేసి, ఖరీఫ్‌లో కాలువల ద్వారా నీటి ప్రవాహానికి ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. శనివారం వియజవాడలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ పనులు వెంటనే మొదలు పెట్టేలా అధికారులంతా కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. పది లక్షల రూపాయలలోపు పనులను నామినేషన్ విధానంపై సాగు నీటి సంఘాల ద్వారా చేపట్టాలన్నారు.

పీఆర్సీ ఫిట్‌మెంట్‌పై జూన్ నాటికి నిర్ణయం

- ఉద్యోగ సంఘాల నేతలతో భేటీలో టీ-సీఎం రేవంత్

హైదరాబాద్, మే 2 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఫిట్‌మెంట్‌పై జూన్ నాటికి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తక్షణమే పీఆర్సీ నివేదిక అందించాలని అధికారుల కమిటీని ఆదేశించారు. శనివారం తన నివాసంలో ఉద్యోగ సంఘాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉందని అన్నారు. పీఆర్సీ సహా నాలుగు అంశాలపై స్పష్టత ఇచ్చిన సీఎం.. ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కార్డులను జూన్ 1లోగా అందజేస్తామన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ప్రయోజనాలకు సంబంధించి రూ.6 వేల కోట్లను వంద రోజుల్లో చెల్లిస్తామన్నారు.



ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎన్ నాయుడుకు నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీఎం చంద్రబాబు

జీఎన్ నాయుడికి సీఎం నివాళి

రీజెన్సీ అధినేత కుటుంబానికి రాధాకృష్ణ పరామర్శ

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త, రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడుకి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాయుడు నివాసానికి శనివారం ఉదయం వెళ్లిన సీఎం చంద్రబాబు.. ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తెలుగు ప్రజలు మంచి పారిశ్రామికవేత్తను కోల్పోయారని, రీజెన్సీ స్థాపనతో యువతకు ఉపాధి కల్పనలో నాయుడు కృషి ఎనలేనిదని సీఎం అన్నారు. సమాజ సేవకు నాయుడు తన వంతు కృషి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా జీఎన్ నాయుడుతో తనకున్న పరిచయాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. మంత్రి లోకేశ్, 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ... జీఎన్ నాయుడికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.



జీఎన్ నాయుడు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న 'ఆంధ్రజ్యోతి' సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ

కైలాసగిరిపై 65 అడుగుల త్రిశూలం!

- దానికి 18 అడుగుల వెడల్పైన ఢమరుకం
- 2.5 కోట్ల వ్యయంతో వీఎంఆర్‌డీఏ నిర్మాణం
- రాత్రిళ్లు కనిపించేలా ఎల్ఈడీ లైట్ల అమరిక

విశాఖపట్నం, మే 2(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి కైలాసగిరి' ప్రత్యేక పర్యాటక ఆకర్షణ. ఆ పరమశివుడి ఆయుధమైన త్రిశూలాన్ని ఢమరుకంతో సహా ఏర్పాటుచేసి దానికి మరింత ఆధ్యాత్మికత జోడించింది విశాఖ మహా నగర పాలక సంస్థ. కైలాసగిరిపై పర్యాటకులకు మరిన్ని వింతలు, విశేషాలు, ఆకర్షణలు కల్పించాలని సీఎం చంద్రబాబు చేసిన సూచన మేరకు 'త్రిశూలం' ప్రాజెక్టుకు వీఎంఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. హనుమంతవాక వైపు స్పష్టంగా కనిపించేలా, తెలుగు మ్యూజియానికి దగ్గరగా భారీ త్రిశూలాన్ని ఏర్పాటు చేసింది. దీనివల్ల ఆ మ్యూజియానికి కూడా సందర్శకులు పెరుగుతారని అధికారుల ఆలోచన. ఈ ప్రాజెక్టుకు రూ.2.5 కోట్లు వ్యయం చేశారు. పగలే కాకుండా రాత్రిపూట కూడా త్రిశూలం ఆరు నుంచి ఏడు కిలోమీటర్ల దూరం వరకు కనిపించేలా అందులో ఎల్ఈడీ లైట్లు అమర్చారు. దాదాపు 65 అడుగుల ఎత్తున త్రిశూలం, దానికి 18 అడుగుల వెడల్పున ఢమరుకాన్ని నిర్మించారు. 300 కి.మీ. వేగంతో గాలులు వీచినా ఈ రెండూ చెక్కు చెదరకుండా ఉండేందుకు కింద రూ.1.75 కోట్లతో గట్టి పునాదులు వేసి, పర్యాటకులు కూర్చొనేందుకు వీలుగా వేదిక నిర్మించారు. ఇది సముద్ర మట్టానికి 365 అడుగుల ఎత్తులో ఉంది. గతేడాది ఆగస్టు 18న పనులు ప్రారంభించి ఏప్రిల్ నెలాఖరుకు పూర్తిచేశారు. పర్యాటకుల కోసం సెల్ఫీ పాయింట్లు కూడా పెట్టారు. దీనిని త్వరలోనే ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తెలిపారు.



సమూల ప్రక్షాళన!

టీటీడీ పాలనను పునర్వ్యవస్థీకరించాలి.. బోర్డుల లాభాపేక్షతోనే సర్వభ్రష్టత్వం

ప్రక్షాళన-1: పెద్దలతోనే ప్రారంభించాలి

వ్యవస్థల ప్రక్షాళనను టీటీడీ నుంచే ప్రారంభిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంతకుముందే ప్రకటించారు. ఇప్పుడు ఆయన మాటను ఆచరణలో పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో సేవాభావం ఉన్నవారు, దేవుడంటే అమితమైన భక్తి విశ్వాసాలుండి డబ్బుపై ఆశలేనివారిని బోర్డు సభ్యులుగా నియమించేవారు. అలాంటి వారిలో కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, భానుమతి వంటి వారు అప్పట్లో బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. వారు దేవుడి సేవ తప్ప సొంత లాభం చూసుకోలేదు. కానీ ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దేవుడి సేవకన్నా సొంత పార్టీ మనుషులు, వ్యాపార భాగస్వాములు, బంధువులు, కాంట్రాక్టర్లు, పూర్తికాలం రాజకీయాల్లో ఉన్న నేతలను బోర్డు చైర్మన్‌గా, సభ్యులుగా నియమిస్తూ వస్తున్నారు. దీని వల్ల భూమిపై ఉన్న సకల రాజకీయాలు, స్వార్థం, దురాశ, బంధుప్రీతి వంటివి ఏడుకొండలదాకా చేరిపోయాయి. ఇది రానురాను మరీ ఎక్కువైంది. జగన్ ప్రభుత్వంలో పరాకాష్ఠకు చేరింది. జగన్ ఏకంగా తన బాబాయి వైవీ సుబ్బారెడ్డిని బోర్డు చైర్మన్‌గా నియమించారు. ఆయన తన నమ్మిన బంటు అప్పన్నను వెంట పెట్టుకున్నారు. ఇక ఆ తర్వాత టీటీడీలో ఏం జరిగిందో, అప్పన్న ఏమేం పనులు చేశారో, కల్తీనెయ్యి సరఫరాలో ఎలాంటి వ్యవహారాలు సాగించారో సీబీఐ సిట్ స్పష్టంగా చెప్పింది. ఈ నేపథ్యంలో ధర్మకర్తగా వ్యవహరించే పాలకమండలి చైర్మన్, సభ్యులు ఎవరు ఉండాలి? ఎవరు ఉండకూడదో మరోసారి సర్కారు పునర్‌నిర్వచించాల్సిన అవసరం ఉంది. అంటే, చట్టంలోనే స్పష్టమైన సవరణలు తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. పూర్తికాలం రాజకీయ నాయకులు, తీవ్రమైన అవినీతి ఆరోపణలున్నవారు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, నాస్తికులు, ఏమాత్రం భక్తిభావం, సేవాభావం లేని వ్యక్తులను కీలకమైన బోర్డు చైర్మన్, సభ్యులుగా నియమించకుండా చట్టంలో మార్పులు తీసుకురావాలని ఆగమశాస్త్ర పండితులు, నిపుణులు కోరుతున్నారు. టీటీడీ ప్రక్షాళన అనేది పాలకమండలి నియామకంలో తీసుకొచ్చే సమూల మార్పులతోనే ఆరంభం కావాలని ఆ వర్గాలు సూచిస్తున్నాయి.

ప్రక్షాళన-2: ఈవో పదవికి పూర్వవైభవం

టీటీడీ పాలనలో పాలకమండలి తర్వాత అత్యంత కీలకమైనది కార్యనిర్వాహక వ్యవస్థ. అంటే, ఈవో. ఈ పోస్టులో ఎవరుండాలి, ఆ తర్వాత పోస్టు అయిన జేఈవోగా ఎవరుండాలి, ఆడిటింగ్, కొనుగోలు, నాణ్యత ప్రమాణాల తనిఖీ, విజిలెన్స్, రక్షణ, భక్తుల సేవలు వంటి విభాగాన్నీ అంతిమంగా ఈవో నియంత్రణలోనే ఉంటాయి. 25 ఏళ్ల క్రితం వరకు టీటీడీ ఈవో అంటే గొప్ప పేరు ఉండేది. ఈవోగా పనిచేసిన అధికారికి ఎనలేని గౌరవం, మర్యాదలు ఉండేవి. కానీ, గత కొన్నేళ్లుగా టీటీడీలో ఈఓగా పనిచేసిన అధికారులు విమర్శలపాలవుతున్నారు. నేతల కొమ్ము కాస్తున్నారన్న అప్రతిష్ఠను మూటగట్టుకుంటున్నారు. ఈ విమర్శలు ఎక్కువయిన తర్వాత ప్రభుత్వాధినేతలు కూడా ముసుగు తొలగించి సొంత మనుషులనే తీసుకొచ్చి ఈవోలుగా నియమించుకున్నారు. వీరిలో ఒకరు నాటి ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డి. ఎక్కడో కేంద్ర సర్వీసులో ఉన్న ఆయనను జగన్ సర్కారు ఏరికోరి తీసుకొచ్చి తొలుత ఈవోగా నియమించాలని చూసింది. అది సాధ్యం కాకపోవడంతో తొలుత జేఈవో, ఆ తర్వాత ఆయనకు పదోన్నతులు ఇచ్చి ఈవోగా నియమించింది. ఆయన హయాంలో టీటీడీ ఎంతలా విమర్శలు, ఆరోపణల పాలయిందనేది జగద్విదితమే. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈవోగా పనిచేసిన ఐఏఎస్ అధికారి సింఘాల్‌పై ఒక్క చెడు రిమార్క్ కూడా రాలేదు. పైగా, టీటీడీని బలోపేతం చేసే చర్యలెన్నో తీసుకున్నారు. 2019లో నెయ్యి సరఫరా నిబంధనలను కఠినతరం చేశారు. ప్రభుత్వం మారింది. జగన్ బాబాయి వైవీ సుబ్బారెడ్డి చైర్మన్ అయ్యారు. వారి చర్యలను ఈవోగా ఆయన అడ్డుకోలేకపోయారు. తన చేతులతో కఠినతనం చేసిన నిబంధనలను తిరిగి వైవీ హయాంలో సులభతరం చేశారు. కల్తీనెయ్యి దర్జాగా టీటీడీకి చేరింది. ఒక ప్రభుత్వంలో ఒక్క రిమార్క్‌లేకుండా పనిచేసిన అధికారి, మరో ప్రభుత్వంలో ఇలా విమర్శల పాలెందుకయ్యారు? అక్కడ పనిచేసే అవకాశం వచ్చిన అధికారి రాజకీయ ఒత్తిళ్లు, ఇతర అంశాలకు తావివ్వకూడదు. దేవుడి సేవ దృష్టిలోనే ప్రతీ నిర్ణయం ఉండేలా పనితీరు ఉండాలి. అలాంటి అధికారులను ఏరికోరి ఈవోలుగా నియమించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రక్షాళన-3: బదిలీలు.. నిపుణుల భర్తీ

ప్రభుత్వంతో పోలిస్తే తిరుమల తిరుపతి దేవస్థానం పాలనా వ్యవస్థ చాలా చిన్నది. టీటీడీలో ఉద్యోగం పొందిన వారు అక్కడే పనిచేస్తారు. విభాగాలు మారుతాయి తప్ప ఇతర ప్రాంతాలకు బదిలీలు ఉండవు. కాబట్టి వారి పరిధి కూడా చిన్నదే. కాబట్టి అనేక విభాగాల్లో పనిచేస్తున్నవారు అక్కడే పుట్టి పెరిగినవారున్నారు. సర్వీసులో కొన్ని రకాల అబ్లిగేషన్‌లు వస్తుంటాయి. దాని వల్ల తప్పును తప్పుగా చెప్పలేని పరిస్థితులు వస్తున్నాయి. దీంతో అనేక అనర్థాలు జరిగిపోతున్నాయని సీబీఐ సిట్ అభిప్రాయపడింది. కాబట్టి, ప్రభుత్వ ఉద్యోగులను 15 శాతం మేర బదిలీ రూపంలో టీటీడీలో పని చేయించాలని, టీటీడీలో పనిచేస్తున్న 15 శాతం మంది ఉద్యోగులను ప్రభుత్వ శాఖల్లో పని చేయించేలా కొత్త విధానం తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్ర సచివాలయంలో పనిచేసే వారిలో 12 శాతం మందిని హెచ్‌వోడీల కార్యాలయాల్లో పనిచేయించే నిబంధన ఉంది. అలాగే, హెచ్‌వోడీల్లో పనిచేస్తున్న సిబ్బందికి బదిలీ ద్వారా సచివాలయంలో పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది. ఇదే విధానం టీటీడీలో తీసుకొస్తే ఉద్యోగుల్లో జవాబుదారీ కూడా వస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. కీలకమైన ప్రొక్యూర్‌మెంట్, మార్కెటింగ్, ఆడిటరింగ్, నాణ్యతా ప్రమాణాల తనిఖీ వంటి విభాగాలకు బయటినుంచి నిపుణులను తీసుకొచ్చి నియమించాలని సీబీఐ సిట్, దినేశ్‌కుమార్ సర్కారుకు సిఫారసు చేశారు. భక్తులు ఇచ్చే ప్రతీ రూపాయి జాగ్రత్తగా వాడాలి. దీనికోసం టీటీడీలో కొనుగోళ్లు, ఆడిటింగ్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలి. ఇందుకు టీటీడీలోని వారు మాత్రమే సరిపోరని, బయటి నుంచి నిపుణులను పంపించాలని సీబీఐ సిట్ సిఫారసు చేసింది. టీటీడీ అకౌంట్స్, ఆడిటింగ్‌కు ఇప్పుడు నిపుణుల అవసరం ఉన్నదని దినేశ్‌కుమార్ కూడా స్పష్టం చేశారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, లేదా కేంద్రప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసిన ఆర్థిక నిపుణులను అక్కడ అధికారిగా నియమించాలని సిఫారసు చేశారు.

ప్రక్షాళన-4: పాలనలో సమూల మార్పులు

తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన వ్యవహారాల్లో సమూల మార్పులు తీసుకురావాలని సిట్ సర్కారుకు సిఫారసు చేసింది. టీటీడీలో ఈ-నోట్ ప్రతిపాదనల అంశంపై సీరియస్‌గా దృష్టిపెట్టాలి. కీలకమైన అంశాల్లో జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లతోనే ఈ -నోట్ ప్రతిపాదనలు పెట్టిస్తున్నారు. అవి వివిధ స్థాయుల్లో పరిశీలనకు వెళ్తున్నాయి. వాటికి స్వతంత్ర పరిశీలన, హేతుబద్ధమైన కారణాలేవీ ఉండటం లేదు. సులువుగా ఎవరిస్థాయిలో వాళ్లు ఫైల్స్ ఫార్వార్డ్ చేస్తున్నారు. కనీసం బుర్రపెట్టి ఆలోచించే పరిస్థితి ఉండటం లేదు. జవాబుదారీ తక్కువగా ఉంటోంది. కాబట్టి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి. ప్రతీస్థాయిలో అధికారి విధులు, పాత్ర, జవాబుదారీ ఏమిటో స్పష్టంగా నిర్దేశించాలి. ఈ వ్యవహారంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకు రావాల్సిఉంది. కొనుగోలు విభాగం చాలా బలహీనంగా ఉంది. సిబ్బంది తక్కువగా ఉన్నారు. ఈ విభాగాన్ని వెంటనే బలోపేతంచేయాలి. సిబ్బందిని పెంచాలని సిట్ సూచించింది.

ప్రక్షాళన-5: టెండర్ నిబంధనలు మార్చాలి

ఇప్పుడున్న కొనుగోలు నిబంధనలు కల్తీకి, నాణ్యత లేని సరుకుల సరఫరాకు ఆస్కారం కల్పించేలా ఉన్నాయని సిట్ తేల్చింది. కాబట్టి, తక్కువ ధరకు వచ్చే ప్రతీ సరుకును కొనాలన్న నిబంధనలను మార్చాలని సిఫారసు చేసింది. దినేశ్‌కుమార్ కమిటీ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ అతి తక్కువ ధర కోట్‌చేసిన బిడ్డర్‌నే ఎంపిక చేయాలన్న అంశం నెయ్యి, ఇతర నిత్యావసరాల కొనుగోళ్లకు వర్తించకూడదని, దాని వల్ల కల్తీ సరుకుల సరఫరాకు అవకాశం లభిస్తోందని ఆ కమిటీ స్పష్టం చేసింది. కొనుగోలు టెండర్‌ల నిబంధనలు కఠినతరంచేయాలని, స్పష్టం చేసింది. కల్తీనెయ్యి సరఫరాచేసిన కంపెనీలు టెండర్ల సమయంలో సమర్పించిన పత్రాలు, వాటి అర్హతను నిర్దేశించే డాక్యుమెంట్లను సరిగ్గా పరిశీలించలేదు. అందుకే అవి స్వేచ్ఛగా తప్పుడు పత్రాలు సమర్పించినా వాటిని నిర్ధారించుకోకుండా అధికారులు ఆమోదించారు. కంపెనీలు ఇచ్చిన డాక్యుమెంట్లు సరైనవా? తప్పుడు పత్రాలా అని నిర్ధారించే వ్యవస్థ టీటీడీలో ఉండాలి. సాంకేతిక కమిటీలో ఉన్న సభ్యులే, ప్లాంట్‌ల తనిఖీ కమిటీలో ఉంటున్నారు. ఇది సరైనది కాదు. తాము ఎలాంటి నెయ్యిసరఫరా చేసినా వాటి నాణ్యతను కనిపెట్టే ల్యాబ్ టీటీడీలో లేదన్న ధీమాతోనే అక్రమార్కులు కల్తీనెయ్యిని సరఫరాచేశారని దినేశ్‌కుమార్ తన నివేదికలో పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో టీటీడీ లాబొరేటరీని బలోపేతం చేయాలని సిఫారసు చేశారు. నాణ్యత బాగోలేదని తిరస్కరించిన ట్యాంకర్లపై నియంత్రణకు టీటీడీలో ఎలాంటి ప్రత్యేక వ్యవస్థ లేదు. కాబట్టి, ఇకపై అలాంటి నియంత్రణ ఏర్పాటు చేయాలి. ఒక్కసారి కల్తీజరిగిందని నిర్ధారణ అయితే, సంబంధిత కంపెనీల ట్యాంకర్లను సీజ్‌చేయడంతోపాటు సరఫరాదారుపై చర్యలు తీసుకోవాలని సిట్ సిఫారసు చేసింది. ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వ్యవస్థ బలంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సిట్‌తోపాటు దినేశ్‌కుమార్ కూడా సిఫారసు చేశారు. టీటీడీలో ప్రత్యేకమైన ఆహార భద్రతను పరీక్షించే అధికారి లేరు. ఇదో కొరత. కాబట్టి ఆహారభద్రతా అధికారిని డిప్యూటేషన్‌పై టీటీడీలో నియమించాలి.

- అమరావతి,ఆంధ్రజ్యోతి

డిప్యూటీ సీఎం నివాసానికి సీఎం

- శస్త్ర చికిత్స అనంతరం పవన్‌కు బాబు పరామర్శ

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): శస్త్ర చికిత్స చేయించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. ఇటీవల డిప్యూటీ సీఎం హైదరాబాద్‌లో అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయించుకున్నారు. వైద్యుల సూచన మేరకు ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పూర్తి విశ్రాంతిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్ వెళ్లిన సీఎం చంద్రబాబు, పవన్ నివాసానికి వెళ్లారు. చంద్రబాబుకు, పవన్, ఆయన సతీమణి అనా సాదరంగా స్వాగతం పలికారు. పవన్ ఆరోగ్య పరిస్థితి గురించి ముఖ్యమంత్రి వాకబు చేశారు. ఈ సందర్భంగా పవన్ తనకు జరిగిన శస్త్రచికిత్స వివరాలను బాబుకు వివరించారు. 'సైనస్‌ను అశ్రద్ధ చేయడంతో తీవ్ర సమస్యగా పరిణమించి కంటిపై ప్రభావం చూపింది. వైద్యులు తక్షణ చికిత్స అవసరమంటూ ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ(ఫేస్) చేశారు. సర్జరీ తరువాత ఇప్పటికీ ముక్కు వెంబడి కొద్దిపాటి రక్తస్రావం ఉంది. మరో వారం రోజుల్లో సర్దుకుంటుందని వైద్యులు తెలిపారు. సినిమాల్లో యాక్షన్ సన్నివేశాల్లో తగిలిన గాయాలను అప్పుడు పట్టించుకోలేదు. అవి ఇప్పుడు బాధిస్తున్నాయి' అని పవన్ వివరించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వైద్యులు... 'పవన్ కల్యాణ్‌కు భుజం దగ్గర మజిల్‌కు ఐదేళ్ల క్రితమే గాయం అయింది. రోటేటర్ కఫ్ ఇంజురీ ఉంది. అప్పుడు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఇబ్బంది తలెత్తింది. దీనికి శస్త్ర చికిత్స అవసరం' అని తెలిపారు. సీఎం చంద్రబాబు స్పందిస్తూ... 'ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. వైద్యుల సూచనలు పాటించడం తప్పనిసరి. శస్త్రచికిత్స అనంతరం శాఖాపరమైన రివ్యూలు, ఫైల్స్ పరిశీలనకు కొంత సమయాన్ని నిర్దేశించుకొని ఆ సమయంలోనే చేయండి' అని సూచించారు. తగిన విశ్రాంతి తీసుకొని, పవన్ పూర్తి స్వస్థత పొందాలని చంద్రబాబు ఆకాంక్షించారు.



తమ నివాసానికి వచ్చిన సీఎంకు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం పవన్ దంపతులు

నాదెండ్ల భాస్కరరావుకు ప్రముఖుల నివాళి

- హైదరాబాద్‌లో నిర్వహించిన దశదిన కర్మకు పలువురి హాజరు
- నాదెండ్ల మనోహర్‌కు ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ పరామర్శ

హైదరాబాద్ సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): వయోభారంతో ఇటీవల మరణించిన మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావుకు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. భాస్కరరావు దశదినకర్మ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,తోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. నాదెండ్ల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. భాస్కరరావు కుమారుడు, మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయన కుటుంబసభ్యులను ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ పరామర్శించారు. అలాగే మంత్రులు పయ్యావుల కేశవ్, అనిత, కొల్లు రవీంద్ర, సత్యకుమార్‌యాదవ్, టీజీ భరత్, డోలబాల వీరాంజనేయస్వామి, ఎంపీలు పుట్టా మహేష్, కేశినేని శివనాథ్, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నాదెండ్లకు నివాళులర్పించారు.



నాదెండ్ల మనోహర్‌ను పరామర్శిస్తున్న ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ




పచ్చని చెట్టు తోడుంటే..!

ఎండలు మండిపోతున్నాయి. ఉదయం వచ్చీ రావడంతోనే.. సూరీడు సుర్రుమంటున్నాడు. ఇక మధ్యాహ్నం అయితే చెప్పనక్కర్లేదు. కాస్త నీడ కోసం జనం అల్లాడిపోతున్నారు. ఎక్కడ కాస్త నీడ కనిపిస్తే.. అక్కడికి చేరుకుంటున్నారు. ఇక మూగ జీవాలు అయితే నీడ కోసం పరుగులు తీస్తున్నాయి. కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయిన విజయవాడ పరిసరాల్లో కనుచూపు మేరలో ఒక్క చెట్టయినా కనిపించదు. అలాంటిది శనివారం ముస్తాబాద రోడ్డులో కనిపించిన ఓ భారీ వృక్షం దగ్గరికి మూగ జీవాలన్నీ పరుగులు తీసి సేదదీరాయి.



కనకదుర్గ ఫ్లైవోవర్ ఖాళీ!

శనివారం ఎండ మంటలు రేపింది. వేడి వాతావరణంతో జనం బయటకు రావడానికే భయపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే విజయవాడలోని కనకదుర్గ ఫ్లైవోవర్ ఇలా నిర్మానుష్యంగా కనిపించింది.


దుండగుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

జీఎస్టీ అధికారులమంటూ వచ్చి దోచేశారు

- బంగారం షాపు దోపిడీ కేసులో ఐదుగురి అరెస్టు
- రెండు పిస్టళ్లు, నాలుగు కార్లు, రూ.49 లక్షల సొత్తు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, మే 2(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ అధికారులమంటూ వచ్చి బంగారం షాపులో దోపిడీకి పాల్పడిన కేసును శ్రీకాకుళం జిల్లా పోలీసులు ఛేదించారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు పిస్టళ్లు, నాలుగు కార్లు, 12 మొబైల్ ఫోన్లు, రూ.49 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం మీడియా సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. కాశీబుగ్గలోని నిత్యానందనగర్‌లో ఉన్న శ్రీవెంకటేశ్వర జ్యూయలరీ షాపులోకి ఏప్రిల్ 7న మధ్యాహ్నం 12 గంటల సమయంలో జీఎస్టీ అధికారులమంటూ ఏడుగురు వ్యక్తులు ప్రవేశించారు. వీరంతా నెంబర్ ప్లేట్లు లేని మూడు బైక్‌లపై వచ్చారు. షాపులో యజమాని కిల్లంశెట్టి రామకృష్ణారావు ఒక్కరే ఉండటంతో ఆయనను చుట్టుముట్టి చేతులకు బేడీలు వేశారు. పిస్టల్‌తో బెదిరించి షాపులో ఉన్న 800 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకుపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అంతర్రాష్ట్ర ముఠా పనిగా భావించి, ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. నాలుగు బృందాలుగా రంగంలోకి దిగారు. సీసీ టీవీ ఫుటేజీల్లో లభ్యమైన బైక్‌ల ఫొటోల ఆధారంగా ఫైనాన్స్ సంస్థల నుంచి వివరాలు సేకరించారు. పాత నేరస్థుల పనేనని నిర్ధారణకు వచ్చారు. గాలించి, మాటువేసి ఒడిశా సరిహద్దులోని లొట్టూరు వద్ద ఒడిశాకు చెందిన రామచంద్రసాహు అలియాస్ బాబు, కునా బరిక్, బనోజ్ బిహారి పట్నాయక్, తపన్ మహారాణా, కాశీబుగ్గకు చెందిన పొట్నూరు తిరుమల పాత్రో అలియాస్ హరిలను అరెస్టు చేశారు. ఈ ముఠాలో ఇంకా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉంది. పట్టుబడిన వారి నుంచి 243 గ్రాముల బంగారంతోపాటు రెండు పిస్టల్స్, రూ.3,41,000 నగదు, దోపిడీ చేసిన సొత్తుతో కొనుగోలు చేసిన రెండు కార్లు, నేరం చేయడానికి ముందుగా కొనుగోలు చేసిన రెండు కార్లు, 12 మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన సొత్తు విలువ రూ.49 లక్షలుగా పేర్కొన్నారు. ఈ ముఠాపై ఒడిశాలో 32 కేసులు ఉన్నట్టు ఎస్పీ తెలిపారు.


అనంతబాబు ప్రత్యేక సదుపాయాలు కోరింది నిజమే

- రాజమండ్రి జైలు అధికారుల వివరణ

కాకినాడ, మే 2(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ హత్య కేసులో సాక్షులను బెదిరించి రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తనకు జైల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరిన మాట వాస్తవమేనని జైలు అధికారులు అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన 'నేను ఎమ్మెల్సీని.. తెలుసా' కథనంపై జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ స్పందించి ఓ ప్రకటన విడుదల చేశారు. తాను ఎమ్మెల్సీ కావడంతో ప్రత్యేక సదుపాయాలు కావాలని అనంతబాబు కోరారని అందులో పేర్కొన్నారు. సెంట్రల్ జైలు నిబంధనలు, నియమావళి, న్యాయస్థానం నుంచి వచ్చే ఆదేశాలు అనుసరించి తాము చర్యలు తీసుకుంటామని అనంతబాబుకు స్పష్టం చేసినట్లు తెలిపారు. అయితే ప్రత్యేక సదుపాయాల విషయంలో అనంతబాబు జైలు అధికారులతో వాగ్వాదానికి దిగే పరిస్థితులు లేవని వివరణ ఇచ్చారు. 2022లో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో అనంతబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడు.. జైలులో పనిచేసిన సిబ్బందిలో కొందరు ఇప్పుడు ఉన్నారన్నారు. సూపరింటెండెంట్ కార్యాలయం ఈ లేఖను మంగళగిరిలోని రాష్ట్ర జైళ్ల శాఖ అధిపతి, కోస్తాంధ్ర జైళ్ల శాఖ ఉపశాఖాధికారికి కూడా పంపించింది.

పోలీసింగ్ మూడో నేత్రంగా ఆర్టీజీఎస్!

- అదృశ్య కేసుల్లో ఫొటోల ఆధారంగా గుర్తింపు
- నేరాలను పసిగడుతున్న సీసీ కెమెరాలు
- పోలీసుల పనిని సులభతరం చేస్తున్న సేవలు



అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించడంలో.. నేరాలను అదుపు చేయడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే, తాజాగా నేరస్తులను గుర్తించడంలో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్‌టీజీఎస్) ప్రధాన భూమిక పోషిస్తోందని అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పోలీసింగ్‌కు మూడో నేత్రంగా పనిచేస్తున్నాయని ఆర్టీజీఎస్ అధికారులు పేర్కొన్నారు. నేరాలను పసిగడుతూ.. నేరస్తులను గుర్తించేందుకు 360 డిగ్రీలతో పనిచేసే సీసీ కెమెరా వ్యవస్థ ఉపయోగపడుతోందని తెలిపారు. దీనికి కొన్ని ఉదాహరణలను పేర్కొన్నారు. కర్నూలు జిల్లా నందవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 22న 17 సంవత్సరాల బాలిక అదృశ్యమైందని పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక ఆచూకీ కోసం పోలీసులు ఆర్టీజీఎస్ సహకారం తీసుకున్నారు. ఆమె ఫోటోను ఆర్టీజీఎస్ సీసీ టీవీ 360 అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసి టైమ్ సెన్సిటివ్ అప్రోచ్ ద్వారా డిజిటల్‌గా గాలింపు చేపట్టారు. అదృశ్యమైన బాలిక విజయవాడకు వచ్చి నగరంలోని ఒక ప్రధాన కూడలిలో తచ్చాడుతున్నట్లు ఆర్టీజీఎస్ రియల్ టైమ్ అలర్ట్ గుర్తించింది. ఈ సమాచారంతో విజయవాడ పోలీసులు బాలికను గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

నంద్యాలలో అదృశ్యమైన బాలిక ఒంగోలులో

నంద్యాల జిల్లా గడివేముల పోలీసు స్టేషన్ పరిధిలో గత నెల 25న 16 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె వెళ్లిన వాహనం నంబరు ఆధారంగా ఆచూకీ కనిపెట్టడానికి పోలీసులు ఆర్టీజీఎస్ సహకారం కోరారు. ఆ బాలిక ఫొటో.. ఆమె వెళ్లిన వాహనం నంబరును ఆర్టీజీఎస్ 360 అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేశారు. ఆమె ఏప్రిల్ 29న ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఓ ప్రధాన కూడలిలో ఉన్నట్లు సీసీ టీవీ ద్వారా గుర్తించారు.

యువతి ఆచూకీ చిటికెలో

చిత్తూరు జిల్లా రొంపిచర్లలో గత నెల 24న 22 ఏళ్ల యువతి అదృశ్యమైనట్టు అక్కడి పోలీసులకు యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఈ ఘటనకు పాల్పడి ఉంటాడని ఆరోపించారు. దీంతో ఈ కేసును ఛేదించేందుకు పోలీసు ఆర్టీజీఎస్‌ని ఆశ్రయించారు. ఈ యువకుడి వాహనం నెంబరు, యువతి ఫొటోలను ఆర్టీజీఎస్ సీసీ కెమెరా 360 అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసి పర్సన్ ఆఫ్ ఇంట్రస్ట్(పీవోఐ), ఆటోమెటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా గాలించారు. వారు వెళ్లిన వాహనం గత నెల 28వ తేదీ దాకా తిరుపతిలోని పలు ప్రాంతాల్లో తిరిగినట్లుగా ఆర్టీజీఎస్ అధికారులు గుర్తించారు. యువతీ యువకుడు చిత్తూరు వెళ్తున్నారని గుర్తించి ఆ సమాచారం పోలీసులకు అందించారు. యువతిని చిత్తూరు పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

అహ్మద్‌బాబును తొలగించాలి

- మరో సీనియర్ ఐఏఎస్‌ను సీసీఎస్టీగా నియమించాలి
- 'మాకొద్దు ఈ బాబు' అంటూ నాలుగో రోజూ వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల నిరసన
- ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరిక

అమరావతి/విజయవాడ, మే 2 (ఆంధ్రజ్యోతి): అహంకారపూరితంగా వ్యవహరిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర ప్రధాన కమిషనర్ అహ్మద్‌బాబును తొలగించి మరో సీనియర్ ఐఏఎస్ అధికారిని సీసీఎస్టీగా నియమించాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. 'అయ్యా బాబు గారు.. మాకొద్దు ఈ బాబు' అంటూ అహ్మద్‌బాబుకు వ్యతిరేకంగా నాలుగో రోజు శనివారం నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాల్లో నాలుగో తరగతి ఉద్యోగులు నిరసన కొనసాగించారు. ఇంత జరుగుతున్నా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, సంబంధిత శాఖ మంత్రి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు విమర్శించారు. తమ శాఖకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకోవాలని కోరారు. హైకోర్టు విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటి నుంచి అహ్మద్‌బాబు చేపట్టిన ప్రతీకార చర్యలన్నింటినీ రద్దు చేయాలని, ఆయనపై తక్షణమే విచారణకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాణిజ్య పన్నుల శాఖలో గత కొంత కాలంగా జరుగుతున్న అవినీతి వ్యవహారాలను ఆధారాలతో సహా విచారణాధికారి ముందు ఉంచడానికి తమ సంఘం సిద్ధంగా ఉందని తెలిపారు. అహ్మద్‌బాబు చేపడుతున్న అక్రమ బదిలీలు, క్రమశిక్షణ చర్యల పేరుతో విధిస్తున్న శిక్షలు, పెడుతున్న తప్పుడు కేసులు... ఇవేవీ న్యాయ సమీక్షకు నిలవవని స్పష్టం చేశారు. కలిసి వచ్చే అన్ని ఉద్యోగ సంఘాల సహకారంతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ సంఘాల మద్దతు కూడగట్టుకుని ఉద్యమ కార్యాచరణను రూపొందించుకునేందుకు ఈ నెల 5, 6 తేదీల్లో సంఘ రాష్ట్ర కార్యవర్గ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఏపీసీటీవోఎస్‌ఈఏ చైర్మన్ బాపట్ల గోపాలకృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.శ్రీనివాసరావు, జి.ఎం.రమేశ్ కుమార్ తెలిపారు.

అహ్మద్‌బాబుపై విమర్శలు బాధాకరం: నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్

వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ అహ్మద్‌బాబుపై అనవసరపు విమర్శలు చేయటం విచారకరమని, వీటిని తమ సంఘం ఖండిస్తోందని వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్ పేర్కొంది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్‌రావు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు పారదర్శకంగా జరిగాయని, ఈ విషయంలో అహ్మద్‌బాబు సహకరించారని, ఉద్యోగుల్లో మనోధైర్యం నింపారని తెలిపారు. దీనివల్ల కొందరి వ్యక్తిగత ప్రయోజనాలకు అడ్డుకట్ట పడిందన్నారు. చీఫ్ కమిషనర్‌పై విమర్శలు చేయటం విచారకరమన్నారు. అహ్మద్‌బాబు మార్గదర్శకత్వంలో ఏప్రిల్‌లో ఆదాయం పెరిగిందన్నారు.

అస్తవ్యస్తంగా పొగాకు కొనుగోళ్లు

- గిట్టుబాటు ధర రాక.. నష్టపోతున్నరైతులు

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లు అస్తవ్యస్తంగా మారాయి. వేలం కేంద్రాలకు రైతులు తీసుకెళ్లిన పొగాకును కొన్ని కంపెనీలు కొనుగోలు చేయకపోగా, గతంలో మాదిరిగా గిట్టుబాటు ధర ఇవ్వట్లేదు. ఉత్పత్తి పెరుగుదల, సిగరెట్ ఉత్పత్తులపై జీఎస్టీ పెంపు, యుద్ధ ప్రభావంతో మార్కెట్ ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. కొన్ని వేలం కేంద్రాల్లో రోజు విడిచి రోజే విక్రయాలు జరుగుతున్నా.. రైతులు తీసుకెళ్లిన బేళ్లను పొగాకు బోర్డుకు పరిమితంగానే అనుమతిస్తున్నారు. కొన్ని కంపెనీలు తక్కువ ధరకు అడుగుతున్నాయి. గతేడాది కిలో పొగాకు రూ.280తో ప్రారంభమై, 3 నెలల్లో రూ.450కి చేరింది. ఈ ఏడాది రూ.260తో ప్రారంభమైనా.. ప్రస్తుతం సగటు ధర రూ.240 మాత్రమే పలుకుతోంది. గిట్టుబాటు కాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో చాలావరకు బేళ్లను కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టుకుంటున్నారు. గత మూడేళ్లు ధరలు ఆశాజనకంగా ఉండటంతో సంప్రదాయంగా వర్జీనియా పొగాకు పండించే రైతులు ఉత్పత్తిని పెంచుతున్నారు. 2024-25లో నల్ల బర్లీ పొగాకు పండించిన రైతులు ధర రాక, కొనుగోళ్లు లేక ఇబ్బందిపడినందున 2025లో ఆ రకం పొగాకును ప్రభుత్వం నిషేధించింది. అయితే వర్జీనియా పొగాకుకు ధర రాక రైతులు నష్టపోతున్నారు. ఇటీవల కొండపి, టంగుటూరు వేలం కేంద్రాలను సందర్శించిన రైతు సంఘాలు నాయకులు.. కిలో పొగాకు రూ.300పైన ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చంపేస్తానంటూ ముందే తమీమ్ వార్నింగ్

- ఆ హెచ్చరికను సీరియస్‌గా తీసుకోని రిపోర్టర్ జగన్
- హత్యకు ముందు రోజు వీధుల్లో రెక్కీ

చిత్తూరు, మే 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వి.కోట ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్‌రెడ్డి హత్య కేసులో రోజురోజుకు ఒక్కో విషయం వెలుగులోకి వస్తోంది. హత్య ఘటనకు 4 రోజుల ముందు పని మీద చిత్తూరు జిల్లా కోర్టుకు వెళ్లిన జగన్‌ను హంతకుడు తమీమ్, అతడి బావమరిది సుభాన్ కలిశారు. సుమారు 20 నిమిషాలు ముగ్గురే మాట్లాడుకున్నారు. ఆ సమయంలో 'నిన్ను చంపేస్తాను జగన్' అని తమీమ్ వార్నింగ్ ఇవ్వగా.. 'ఇప్పటికైనా ఇల్లీగల్ పనులు, సెటిల్‌మెంట్లు మానేసి మనిషిగా బతుకు. నీలాంటి వారిని చాలా మందిని చూశా' అని జగన్ సమాధానమిచ్చాడు. ఈ విషయాన్ని తన జర్నలిస్టు మిత్రుడు మణితో జగన్ పంచుకున్నారు. ఆ వార్నింగ్‌ను సీరియస్‌గా తీసుకుని పోలీసులకు చెప్పి ఉంటే హత్య జరిగేది కాదేమోనని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతనెల 28న కత్తితో నరికి చంపడానికి ముందు రోజు జగన్ వాకింగ్ చేసే ప్రాంతాల్లో తమీమ్ రెక్కీ చేశాడు. ఏ వీధిలో, ఏ సమయంలో చంపాలనేది అప్పుడే ప్లాన్ చేశాడు. నరికిన తర్వాత జగన్ రక్తాన్ని చేతిలోకి తీసుకుని మసీదు గోడకు పూశాడు. హత్య జరిగిన ప్రాంతానికి సమీపంలోనే ఉన్న జగన్ మిత్రుడు ఆరీఫ్ ఇంటిలో నుంచి తన భార్యతో కలిసి కేకలు వేస్తున్నా తమీమ్ ఖాతరు చేయలేదు. అయితే తమీమ్ మీద 2014 నుంచే ఎర్రచందనం కేసులున్నాయి. అప్పటి నుంచే బెంగళూరుకు చెందిన రౌడీషీటర్లతో పరిచయాలున్నాయి. బెంగళూరులోని కెంగేరి ప్రాంతంలో ఓ రౌడీషీటర్‌ను గురువుగా భావించేవాడు. పది రోజుల ముందు వి.కోటకు వచ్చి ఓ వైసీపీ నాయకుడిని కలిసి రూ.లక్ష అప్పు అడిగాడని సమాచారం. కాగా, జగన్ కుటుంబ సభ్యులను శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించి.. భరోసానిచ్చారు. జగన్ భార్య కు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఇద్దరు పిల్లల ఉన్నత చదువులకు ఫీజులు, సీఎంఆర్‌ఎఫ్‌తో పాటు కలెక్టర్ ఖాతా నుంచి నిధులు, నిందితుల మీద పీడీ యాక్ట్ నమోదు వంటి హామీలను కలెక్టర్ ఇచ్చారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం జగన్ కుటుంబాన్ని కలిసి ధైర్యం చెప్పారు.

కుటుంబ సర్వేలో పక్కా సమాచారం సేకరించాలి

- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ మిశ్రా సూచన

విజయనగరం మే 2(ఆంధ్రజ్యోతి): ఏకీకృత కుటుంబ సర్వే(యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) సమగ్రంగా నిర్వహించి కచ్చితమైన సమాచారం సేకరించాలని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సూచించారు. ఈ సర్వే సమాచారం.. వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ల అమలుకు ఎంతో కీలకమన్నారు. ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్ విజయనగరం జిల్లాలో పర్యటించింది. కలెక్టరు రామసుందర్ రెడ్డితో కలిసి పంచాయతీ అధికారులతో మిశ్రా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఏకీకృత కుటుంబ సర్వే సమగ్రంగా నిర్వహించి, కచ్చితమైన సమాచారం సేకరించాలని సూచించారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

విడుదలకు సిద్ధం




నవీన్ చంద్ర, వరలక్ష్మి శరత్‌కుమార్ జంటగా సంజీవ్ మేగోటి తెరకెక్కించిన తాజా చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిల్మ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించిన ఈ చిత్రం ఈనెల 22న విడుదలవుతోంది. 'వరలక్ష్మీ శరత్‌కుమార్, నవీన్ చంద్ర క్రేజీ కాంబినేషన్ అందరినీ ఆకట్టుకుంటుంది. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే కాన్సెప్ట్ ఆధారంగా తెరకెక్కించాం. ఈ సినిమా కథ, పాత్రల నిర్మాణం ప్రత్యేకంగా ఉంటూ ప్రతి ఒక్కరినీ కచ్చితంగా అలరిస్తుందన్న నమ్మకం' ఉంది అని చిత్ర దర్శకుడు సంజీవ్ గోటేటి అన్నారు.

ట్రెక్కింగ్ ట్రైనింగ్‌లో మహేశ్



మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఈ సినిమా కోసం తన ఆహార్యాన్ని పూర్తిగా మార్చుకోవడంతో పాటూ శారీరకంగా కఠోర శిక్షణ తీసుకున్నారు మహేశ్. ఇటీవలే ఆయన జర్మనీ వెళ్లారు. అందరూ అది ఆయన పర్సనల్ టూర్ అని భావించారు. అయితే అది ఈ చిత్రం ట్రైనింగ్‌లోనే భాగమని సోషల్ మీడియాలో మహేశ్ పంచుకున్న ఫొటోలను బట్టి అర్థమైంది. ప్రస్తుతం ఆయన జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్‌లో ఫిట్‌నెస్ కోచ్ డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠిన శిక్షణ తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆయనతో కలసి దిగిన ఫొటోలను మహేశ్ షేర్ చేశారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ 'వారణాసి' కోసం సన్నద్ధమవుతున్నట్లు ఈ ఫొటోలకు క్యాప్షన్ పెట్టారు. దాదాపు రూ.1300 కోట్ల భారీ బడ్జెట్‌తో దుర్గా ఆర్ట్స్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



తమిళ నిర్మాతల నిర్ణయం... ఆగిన షూటింగులు



తమిళ చిత్ర నిర్మాతల సంఘం శనివారం ఒక్క రోజు సినిమా షూటింగులను నిలిపివేసింది. ఈ కారణంగా సూర్య, విశాల్, శింబు, విజయ్ సేతుపతి నటిస్తున్న సినిమాల చిత్రీకరణ నిలిచిపోయింది. నిర్మాతల లాభనష్టాల్లో హీరోలు పాలుపంచుకోవాలని, ఇకపై మధ్య, పెద్ద చిత్రాలను రెవెన్యూ షేరింగ్ విధానంలోనే నిర్మించాలంటూ ఇటీవల నిర్మాతల సంఘం తీర్మానించింది. ఈ విషయాల గురించి చిత్రపరిశ్రమలోని ప్రతి ఒక్కరికీ తెలియజెప్పేలా, అవగాహన కల్పించడం కోసం ఒక రోజు సమ్మెకు నిర్మాతల సంఘం పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా అనేక సినిమాల షూటింగులు స్తంభించిపోయాయి. ఈ విషయంపై నిర్మాతల మండలి అధ్యక్షుడు జీకే తమిళ్ కుమరన్, సంఘం నిర్వాహకులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. 'గత నెల 26వ తేదీన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో చేసిన తీర్మానం మేరకు ఒక రోజు సమ్మె చేయడం జరిగింది. భవిష్యత్‌లో నిర్మించే చిత్రాల నిర్మాణంలో నిర్మాతలు నష్టపోకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేందుకు వీలుగా రెవెన్యూ షేరింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్మాతలందరూ కోరుతున్నారు. ఈ సమ్మెకు పూర్తి మద్దతు ఇచ్చిన ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి సహా అన్ని సినీ నిర్మాణ కార్మికుల సంఘాలకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

ఇది మనందరి కథ



సుభాశ్ చంద్ర

"గోదారి గట్టుపైన' సినిమా మనందరి కథ. మన ఇళ్లలో రోజూ జరిగే కథ. ఇందులోని భావోద్వేగాలకు అందరూ కనెక్ట్ అవుతారు' అని చెప్పారు సుభాశ్ చంద్ర. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ జంటగా ఆయన తెరకెక్కించిన చిత్రమిది. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. జగపతి బాబు కీలక పాత్రలో నటించారు. సినిమా ఈనెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుభాశ్ చంద్ర మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'నేను బీటెక్ చదువుతున్నప్పటి నుంచే షార్ట్ ఫిల్మ్స్ చేయడం ప్రారంభించాను. దాదాపు 80 షార్ట్ ఫిల్మ్స్ తీసిన తర్వాత చెన్నైలో ఎల్‌వీ ప్రసాద్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్సు చేశాను. ఈ సినిమాలో సుమంత్ గారిది గోదారి అబ్బాయి పాత్ర. గోదారి యాసను పర్ఫెక్ట్‌గా పలికారు. అందుకోసం ఆయన శిక్షణ కూడా తీసుకున్నారు. ఈ కథ మన జీవితాల్లో చూసిందే. ప్రతి ఇంట్లో తండ్రి - కూతురు ఉంటారు. వారి మధ్య ప్రేమ ఉంటుంది. అలాగే ఇద్దరు ప్రేమికుల మధ్య ప్రేమ కూడా ఉంటుంది. కథలో జగపతిబాబు గారి పాత్ర చాలా కీలకమైంది. ప్రతి తండ్రికీ తన కూతురిని తనకంటే ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తికే ఇచ్చి పెళ్లి చేయాలనుంటుంది. ఇది ఆ తండ్రి ప్రేమలో ఉన్న నిజం. అలాగే అబ్బాయి ప్రేమలోనూ నిజం ఉంటుంది. అలాంటి అంశాన్ని ఇందులో బలంగా చెప్పాలని ప్రయత్నించాం' అని ఆయన చెప్పారు.

'పెద్ది' విడుదలకు ఆటంకాలు ఉండకపోవచ్చు

నిర్మాత చెర్రీ



సింగిల్ థియేటర్లలో పర్సంటేజీ విధానం అమలుపై ఈనెల 8న ఛాంబర్ నిర్వహించబోయే కీలక సమావేశంలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని అనుకుంటున్నా. కాబట్టి 'జెట్లీ'కి ఎదురైన ఆటంకాలు 'పెద్ది'కి ఉండకపోవచ్చు' అని నిర్మాత చెర్రీ అన్నారు. సత్య కథానాయకుడిగా రితేష్ రానా తెరకెక్కించిన 'జెట్లీ' చిత్రాన్ని శుక్రవారం కొన్ని మల్టీప్లెక్స్‌లలో ప్రదర్శించలేదు. దీనిపై మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. సింగిల్ స్ర్కీన్లలో సమస్య ఉంటే అక్కడే తేల్చుకోవాలి కానీ, మల్టీప్లెక్స్‌ల వరకూ తీసుకురావడమేంటని ప్రశ్నించింది. అయితే హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 'జెట్లీ' సినిమా సక్సెస్ మీట్‌లో మీడియా ఈ సమస్యను నిర్మాత చెర్రీ దృష్టికి తీసుకొచ్చింది. 'తదుపరి మీ నుంచి 'పెద్ది' విడుదల కానుంది. అప్పటిలోగా ఈ సమస్య పరిష్కారమవుతుందా అన్న ప్రశ్నకు చెర్రీ స్పందిస్తూ... 'ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య కొన్ని భేదాభిప్రాయాలు ఉన్నమాట నిజమే. ఇది అందరికీ తెలిసిన విషయమే. సింగిల్ స్ర్కీన్స్‌లలో కూడా పర్సంటేజ్ పద్ధతిని అమలు చేయాలని, లేదంటే మాకు వర్కవుట్ కాదని కొన్ని థియేటర్ల యాజమాన్యాలు చెప్పాయి. అలా చేస్తే తమకు ఇబ్బందని నిర్మాతలు అంటున్నారు. దీని పరిష్కారానికి ఒక మీటింగ్ నిర్వహించాలని ఛాంబర్ అనుకున్నది. కానీ అది కార్యరూపం దాల్చలేదు. తిరిగి ఈనెల 8న కీలక సమావేశం నిర్వహించబోతున్నారు. అందులో పరిష్కారం లభిస్తుందని అనుకుంటున్నా. మే 1 నుంచి పర్సంటేజీ విధానంలో అయితేనే థియటర్లను ఇస్తామని ఎగ్జిబిటర్లు అన్నారు. దీనిపై ఏప్రిల్ 30 అర్ధరాత్రి వరకూ చర్చలు జరిగాయి. కానీ సఫలం కాలేదు. మే 1న సెలవు కాబట్టి 'జెట్లీ' సినిమాకు మినహాయింపు ఇచ్చి ఉంటే బాగుండేది. మళ్లీ చర్చలు కొనసాగించాం. ఈరోజు నుంచి థియేటర్లు ఇచ్చేందుకు ఎగ్జిబిటర్లు అంగీకరించారు' అని అన్నారు.

ఆకట్టుకునేలా 'సతీ లీలావతి'



లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'సతీ లీలావతి'. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్ఎంఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహించారు. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవీ పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మించారు. సినిమా ఈనెల 8న విడుదలవుతోంది. మెగాపవర్ స్టార్ రామ్‌చరణ్ శనివారం ఈ చిత్రం ట్రైలర్‌ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన రిలీజ్ ఈవెంట్‌లో 'లావణ్య త్రిపాఠి' మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం మేము పడ్డ కష్టం, మా ప్రేమ అంతా తెరపై చూస్తారు. 'సతీ లీలావతి' అద్భుతంగా వచ్చింది. చిత్రీకరణ సమయంలో నేను ప్రెగ్నెంట్ అని తెలిశాక చిత్రబృందం మొత్తం నాకు సపోర్ట్ చేసింది. ట్రైలర్‌ను రిలీజ్ చేసిన మా బావ గారు రామ్‌చరణ్‌కి కృతజ్ఞతలు' అని అన్నారు. తాతినేని సత్య మాట్లాడుతూ 'ఇది చాలా మంచి సినిమా అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని చెప్పారు. 'మా ట్రైలర్‌ను లాంచ్ చేసిన రామ్‌చరణ్ గారికి కృతజ్ఞతలు. మా సినిమా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని నాగ మోహన్ పేర్కొన్నారు.



NPCI
भारतीय राष्ट्रीय भुगतान निगम
NATIONAL PAYMENTS CORPORATION OF INDIA
ALWAYS FORWARD
BHIM
BHARAT INTERFACE FOR MONEY
భారత్ యొక్క సొంత పేమెంట్స్ యాప్
BHIM appతో చేయండి పే.
ఇది మాహి వే.
Payment Successful
₹20
SCAN & PAY
పొందండి ₹20 క్యాష్‌బ్యాక్,
₹20 లేదా అంతకంటే ఎక్కువ మొదటి పేమెంట్‌పై.
*కొత్త యూజర్‌కు మాత్రమే వర్తిస్తుంది. నియమ నిబంధనలు వర్తిస్తాయి.
Download Now


బెంగాల్‌లోని ఫాల్తాలో ఎన్నిక రద్దు

కోల్‌కతా, మే 2: పశ్చిమబెంగాల్‌లోని ఫాల్తా నియోజకవర్గంలో ఏప్రిల్ 29న జరిగిన ఎన్నికల్లో ప్రజాస్వామిక ప్రక్రియను పక్కదోవ పట్టించారనే ఆరోపణలు రావడంతో ఈసీ ఎన్నికను రద్దు చేసింది. ఈ నెల 21న ఫాల్తాలోని మొత్తం 285 పోలింగ్‌బూత్‌లలో తాజాగా మళ్లీ పోలింగ్ నిర్వహించాలని ఆదేశించింది. ఓటర్లను బెదిరించడం, ఈవీఎంలో బీజేపీ గుర్తు కనపడకుండా స్టికర్ వేయడం, అనధికార వ్యక్తులు పోలింగ్ బూత్‌లలోకి వచ్చారనే ఆరోపణలు వచ్చాయి. శనివారం ఫాల్తా నియోజకవర్గంలో ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి ఇటీవలి ఎన్నిక సందర్భంగా టీఎంసీ వర్గాలు తమను బెదిరించాయని, స్వేచ్ఛగా ఓటు వేయనీయలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. మే 4న మొత్తం 293 నియోజకవర్గాల ఫలితాలు ప్రకటిస్తారు. ఫాల్తా ఫలితాన్ని మే 24న ప్రకటిస్తారు. మరోవైపు శనివారం 2 నియోజకవర్గాల్లోని కొన్ని పోలింగ్ బూత్‌లలో రీ పోలింగ్ జరిగింది. మాగ్రాహత్ పశ్చిమ్‌లోని 11, డైమండ్ హార్బర్‌లోని 4బూత్‌లలో రీ పోలింగ్ జరిగింది. 87 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు.

ఓట్ల లెక్కింపులో కేంద్ర సిబ్బంది నియామకంపై మమతకు సుప్రీంకోర్టులో చుక్కెదురు..!

న్యూఢిల్లీ, మే 2: పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలకు రెండు రోజుల ముందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీకి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. బెంగాల్‌లో ఓట్ల లెక్కింపునకు కేంద్ర ప్రభుత్వ సిబ్బందిని మోహరించడాన్ని సవాల్ చేస్తూ టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పీఎస్ నరసింహాన్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం తోసిపుచ్చింది. ఈనెల 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మిశ్రమ వినియోగానికి వీలు కల్పిస్తూ ఏప్రిల్ 13న భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) జారీ చేసిన సర్క్యులర్ ఏ మాత్రం చట్ట విరుద్ధం కాదని పేర్కొంది. ఆయా రెండు వర్గాల నుంచి లెక్కింపు సిబ్బందిని నియమించుకునే విచక్షణాధికారం ఈసీఐకి ఉందని స్పష్టం చేసింది. కౌంటింగ్ కేంద్రాల్లో సూపర్‌వైజర్లుగా రాష్ట్ర ఉద్యోగులను విస్మరించి, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల ఉద్యోగులను నియమించడం ద్వారా ఈసీఐ ఉద్దేశపూర్వకంగా కేంద్రంలోని అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ టీఎంసీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కేంద్రంలోని పార్టీకి విధేయులుగా ఉంటారన్న టీఎంసీ వాదన వట్టి అపోహేనని కోర్టు పేర్కొంది. ఏదేమైనా వారు ప్రభుత్వ ఉద్యోగులని.. ఎన్నికల సమయంలో ఈసీఐ నియంత్రణలోనే పనిచేస్తారని స్పష్టం చేసింది.

ప్రసార భారతి చైర్మన్‌గా రచయిత ప్రసూన్ జోషి



న్యూఢిల్లీ, మే 2: ప్రభుత్వ ప్రసార సంస్థ 'ప్రసార భారతి' చైర్మన్‌గా ప్రముఖ సినీ గీత రచయిత, ప్రసిద్ధ కమ్యూనికేషన్స్ నిపుణుడు ప్రసూన్ జోషి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సాహిత్యం, ప్రకటనలు, సినిమాతో పాటు ప్రజా సంబంధాల రంగాల్లో విశేష అనుభవం ఉన్న ప్రసూన్ జోషిని ఈ పదవికి ఎంపిక చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తన భావగర్భితమైన రచనలతో, సామాజిక స్పృహ కలిగిన కథనాలతో భారతీయ మీడియా రంగంలో ఆయన ఒక ప్రత్యేక ముద్ర వేశారు. జోషి నియామకంపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందిస్తూ.. "ప్రసూన్ జోషి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అరుదైన సృజనాత్మక శక్తి. ఆయన మాటల్లో దేశ మట్టి వాసన కనిపిస్తుంది. ఆయన నాయకత్వంలో ప్రసార భారతి సరికొత్త ఉత్సాహంతో, ఆధునిక దృక్పథంతో ముందుకు సాగుతుందని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు.

ఇద్దరు పిల్లల్ని చంపి అర్చకుడి ఆత్మహత్య

- మేనల్లుడితో భార్య వివాహేతర సంబంధమే కారణం

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): తన మేనల్లుడితో భార్య వెళ్లిపోవడాన్ని జీర్ణించుకోలేక ఓ వ్యక్తి తన ఇద్దరు బిడ్డలను చంపి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాదకర సంఘటన తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా ఆల్కెరె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో శివణ్ణ(40) అర్చకుడిగా సేవలు అందిస్తున్నారు. సొంత అక్క మరణించగా ఆమె కుమారుడు హేమంత్‌ను ఇంటికి తీసుకువచ్చి కన్నబిడ్డలాగా పెంచుకున్నారు. శివణ్ణకు భార్య కావ్య, పిల్లలు జీవన్(10), ప్రాణేశ్(5) ఉన్నారు. కావ్యతో హేమంత్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిశాక అతన్ని శివణ్ణ ఇంటి నుంచి పంపేశారు. వారం క్రితం హేమంత్‌తో కలిసి కావ్య పరారయ్యారు. మరుసటి రోజు తిరిగి వచ్చి, పోలీస్ స్టేషన్‌లో క్షమాపణలు చెప్పారు. ఇకపై భర్తతోనే ఉంటానని చెప్పి ఇంటికి వెళ్లారు. ఆ మరుసటి రోజే రూ.లక్షల విలువైన బంగారం ఆభరణాలు, నగదు తీసుకుని మరోసారి పారిపోయారు. మానసిక వేదనతో శివణ్ణ పిల్లలిద్దరినీ గొంతు నులిమి చంపి, ఉరి వేసుకున్నారు.

శ్రీవారి భక్తులతో జగన్ చానల్ 'రోత' రాజకీయం

- టీటీడీ ఏర్పాట్లు బాలేవని చెప్పించేందుకు పాట్లు
- వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లోకేశ్
- అసత్య ప్రచారాలు నమ్మొద్దని టీటీడీ ఖండన

తిరుపతి/తిరుమల, మే 2 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చేపట్టిన ఏర్పాట్లపై భక్తుల్లో అసంతృప్తి ఉన్నట్టుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించి జగన్ సొంత రోత మీడియా చానల్ భంగపడింది. వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుమల క్యూలైన్‌లోకి చేరే భక్తులకు నిరంతరం అన్నపానీయాలు అందజేయడంతో పాటు వీలైనంత త్వరగా దర్శనం చేయించేలా టీటీడీ క్యూలైన్లను సమర్థంగా నిర్వహిస్తోంది. అయితే టీటీడీ ఏర్పాట్లు సక్రమంగా లేవని చెప్పించేందుకు జగన్ చానల్ కెమెరామన్ చేసిన ప్రయత్నాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రింగురోడ్డులోని సర్వదర్శన క్యూలైన్‌లో ఉన్న ఓ భక్తుడిని శుక్రవారం కెమెరామన్ మాట్లాడించారు. 'ఎన్ని గంటలకు వచ్చారు? ఇంకా ఎంత టైం పడుతుందంటున్నారు? ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?' అని ప్రశ్నించగా.. భక్తుడు 'అంతా బాగుంది' అంటూ బదులిచ్చి వెళ్లిపోయారు. ఆ వీడియోను మంత్రి లోకేశ్ తన ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్టు చేశారు. 'అంతా బాగుందని చెప్తున్న భక్తులతో ఏర్పాట్లు బాగా లేవు.. ఇబ్బంది పడుతున్నాం.. అని చెప్పించడానికి ప్రయత్నించి భంగపడుతున్న సాక్షి చానల్' అనే శీర్షిక పెట్టారు. 'కలియుగ దైవంతో పెట్టుకోవద్దు జగన్మోహన్ రెడ్డి గారూ' అంటూ వీడియో కింద రాశారు. కదులుతున్న క్యూలైన్‌లోని భక్తులను రెచ్చగొట్టి దర్శనం ఆలస్యమవుతోందని చెప్పించడం, రాజకీయ ప్రయోజనాల కోసం బైట్లు తీసుకుని ప్రచారం చేయడాన్ని ఆక్షేపిస్తున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో పేర్కొంది. 'వేసవి సెలవులకు తోడు వారాంతం కూడా రావడంతో భక్తులు అధిక సంఖ్యలో తిరుమలకు వచ్చారు. అన్ని సౌకర్యాలు కల్పించడం కోసం టీటీడీ యంత్రాంగం, శ్రీవారి సేవకులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. అసత్య కథనాల కోసం ప్రయత్నించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది' అని పేర్కొంది.

మళ్లీ యుద్ధంవైపు అడుగులు?

అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత.. పిచ్చివాళ్ల వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్న ట్రంప్

- సముద్రపు దొంగల్లా ఇరాన్ నౌకలను స్వాధీనం చేసుకుంటున్నామని వ్యాఖ్య



ట్రంప్ నోరును హోర్ముజ్‌తో మూసి కుట్టేసినట్లు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్

వాషింగ్టన్/టెహ్రాన్/దుబాయ్, మే 2: పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగనున్నాయా? ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలన్నీ ఆ దిశగా సాగుతున్నట్టుగానే కనిపిస్తున్నాయి. యుద్ధం మళ్లీ మొదలయ్యేందుకు అవకాశం ఉందని, అందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని ఐఆర్‌జీసీ పేర్కొనడం.. ఇరాన్ పంపిన శాంతి ప్రతిపాదనలు తనకు నచ్చలేదని, ఒప్పందం కుదిరే అవకాశం కనిపించడం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడం.. పైగా పిచ్చివాళ్ల వద్ద అణ్వస్త్రాలు ఉండొద్దనే వ్యాఖ్యలు.. పశ్చిమాసియాకు పెద్ద మొత్తంలో ఆయుధాల తరలింపు.. యుద్ధం మళ్లీ మొదలవుతుందంటూ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ ప్రకటనలు వంటివన్నీ యుద్ధం వైపు సంకేతాలేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం మళ్లీ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని ఇరాన్ మిలిటరీ ప్రధాన కార్యాలయం డిప్యూటీ చీఫ్ మొహమ్మద్ జఫార్ అసదీ ప్రకటించారు. శాంతి చర్చల కోసం ఇరాన్ చేసిన ప్రతిపాదనలను ట్రంప్ తిరస్కరించిన అనంతరం ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. "దౌత్యపరమైన పరిష్కారంపై వారికి చిత్తశుద్ధి లేదు. మా సైన్యాలు యుద్ధానికి సన్నద్ధంగా ఉన్నాయి. అమెరికన్లు ఏదైనా మూర్ఖపు చర్యకు పాల్పడితే దీటుగా బదులిస్తాం" అని జఫార్ అసదీ పేర్కొన్నారు.

ఇప్పుడు యుద్ధం ముగిస్తే.. మళ్లీ సమస్య

చర్చల కోసం ఇరాన్ పంపిన ప్రతిపాదనలు తనకే మాత్రం నచ్చలేదని ట్రంప్ అంతకుముందు పేర్కొన్నారు. తాను అంగీకరించే అవకాశమే లేని అంశాలను వారు ప్రతిపాదించారని చెప్పారు. పిచ్చివాళ్ల వద్ద అణ్వాయుధాలు ఉండకూడదని, అందుకే ఇరాన్‌పై దాడులు చేశామని పేర్కొన్నారు.. తమ లక్ష్యాలు పూర్తికాకుండా యుద్ధం ముగిసిపోకూడదని, ఇప్పుడు గందరగోళంలో ముగిస్తే మరో మూడేళ్ల తర్వాత మళ్లీ ఇలాంటి సమస్యే తలెత్తుతుందని పేర్కొన్నారు. యుద్ధం మొదలుపెట్టిన 60 రోజుల్లోగా అధ్యక్షుడు చట్టసభ కాంగ్రెస్ ఆమోదం పొందాలన్న చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని విమర్శించారు. కాల్పుల విరమణ కొనసాగుతున్న నేపథ్యంలో యుద్ధం నిలిచిపోయినట్టేనని వ్యాఖ్యానించారు. హోర్ముజ్ దిగ్బంధంలో అమెరికా నావికాదళం సముద్రపు దొంగల్లా వ్యవహరిస్తోందని ట్రంప్ అన్నారు. "మేం నౌకలపై దిగుతున్నాం. నౌకను, అందులోని సరుకులను, చమురును స్వాధీనం చేసుకుంటున్నాం. ఇది చాలా లాభదాయకంగా ఉంది. మేం సముద్రపు దొంగల తరహాలో వ్యవహరిస్తున్నాం. కానీ మేం ఆటలు ఆడటం లేదు" అన్నారు. ఇక తాము అనుకుంటే వెంటనే క్యూబాను స్వాధీనం చేసుకోగలమని ట్రంప్ పేర్కొన్నారు. క్యూబాపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇరాన్‌కు ఫీజు కడితే ఆంక్షలు తప్పవు

ఇరాన్‌కు టోల్ ఫీజులు, ఇతర చార్జీలు కట్టి హోర్ముజ్ జలసంధి దాటే నౌకలు, సంబంధిత సంస్థలపై ఆంక్షలు విధిస్తామని అమెరికా తాజాగా హెచ్చరించింది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ వేసిన బాంబుల్లో కొన్ని పేలకుండా ఉండిపోయాయి. అలాంటి వాటిని ఐఆర్‌జీసీ బలగాలు గుర్తించి, నిర్వీర్యం చేస్తూ వస్తున్నాయి. ఝూంజాన్ ప్రావిన్స్‌లో భారీ బాంబును నిర్వీర్యం చేస్తుండగా పేలిపోయి.. 14 మంది ఐఆర్‌జీసీ సైనికులు మృతిచెందారు.

స్పిరిట్ ఎయిర్‌లైన్స్ మూత

చమురు ధరల పెరుగుదల ప్రభావం విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. విమాన ఇంధనం ధరలు 80శాతానికిపైగా పెరిగిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా పలు విమానయాన సంస్థలు లాభదాయకం కాని సర్వీసులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. తాజాగా అమెరికాలోని చౌక విమానయాన సంస్థ 'స్పిరిట్ ఎయిర్‌లైన్స్' సంస్థ పూర్తిగా తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.

ఎయిరిండియా అంతర్జాతీయ సర్వీసుల కుదింపు

పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావంతో పెరుగుతున్న చమురు ధరలకు తోడు గగనతల మూసివేతల ప్రభావంతో ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. జూలై వరకూ తన అంతర్జాతీయ విమాన సర్వీసుల షెడ్యూల్‌ను కుదించనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్ని మార్గాలకు విమానాలు నడపడం ఆర్థికంగా లాభదాయకం కాదని ఆ సంస్థ భావిస్తోంది. యుద్ధం కారణంగా విధించిన గగనతల ఆంక్షలతో ఎయిరిండియా పలు అంతర్జాతీయ సర్వీసుల మార్గాలను మార్చాల్సి వచ్చింది. దీంతో అప్పటి వరకూ నేరుగా సాగిన ప్రయాణాలకు అదనపు దూరంతో పాటు ఇంధన వినియోగం పెరిగాయి. మరోవైపు జెట్ ఇంధనం ధరలు విపరీతంగా పెరగడంతో నిర్వహణ ఖర్చులూ భారంగా మారాయి.

పశ్చిమాసియా మిత్రులకు అమెరికా ఆయుధాలు

- 81వేల కోట్ల విలువైన విక్రయాలకు సిద్ధం
- దీని కోసం కాంగ్రెస్ రివ్యూ కూడా బైపాస్
- ఇరాన్‌పై యుద్ధం ముగిసిందని చట్ట సభ్యులకు తెలిపిన ట్రంప్

న్యూఢిల్లీ, మే 2: పశ్చిమాసియాలోని తన మిత్రదేశాలకు అమెరికా భారీగా ఆయుధాలు విక్రయించడానికి రంగం సిద్ధం చేసింది. ఇజ్రాయెల్, కువైట్, ఖతార్, యూఏఈలకు 8.6 బిలియన్ డాలర్ల(సుమారు రూ.81వేల కోట్లు) విలువైన ఆయుధాల విక్రయాలకు ఆమోదం తెలుపుతున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ చెప్పింది. ఈ ఆయుధాల విక్రయ ప్రతిపాదన కోసం అమెరికా ప్రభుత్వం కాంగ్రెస్ సమీక్షను కూడా బైపాస్ చేసింది. ఇదిలా ఉండగా, 1973లో ఆమోదించిన యుద్ధ అధికారాల తీర్మానం ప్రకారం అమెరికా అధ్యక్షుడు యుద్ధ విషయాన్ని కాంగ్రెస్‌కు తెలిపిన తర్వాత ఆ యుద్ధాన్ని కొనసాగించడానికి కాంగ్రెస్ అంగీకారం తెలిపితే తప్ప 60 రోజుల్లోపు దానిని ముగించాల్సి ఉంటుంది.ఈ నిబంధన ప్రకారం కాంగ్రెస్ అనుమతి లేకుండానే ఇరాన్‌పై అధ్యక్షుడు ట్రంప్ సైనికచర్య మొదలు పెట్టారు. దీనికి కాంగ్రెస్ అనుమతి తీసుకోవాల్సిన గడువు సమీపిస్తోంది.ఈ నేపథ్యంలో ఇరాన్‌పైయుద్ధం 'ముగిసింది' అని చట్ట సభ్యులకు ట్రంప్ చెప్పారు. ఏప్రిల్ 7 తర్వాత ఇరు దేశాల మధ్య కాల్పులు జరగలేదని, ఇరు దేశాల మధ్య ఫిబ్రవరి 28న మొదలైన ఘర్షణలు ముగిశాయి అని చట్ట సభ్యులకు రాసిన లేఖలో ట్రంప్ పేర్కొన్నారు.

అమెరికా దిగ్బంధనంతో ఇరాన్‌కు 40వేల కోట్ల నష్టం

న్యూఢిల్లీ, మే 2: తమ దేశ ఓడరేవులను అమెరికా దిగ్బంధించిన కారణంగా ఆయిల్ ఆదాయంలో ఇరాన్ భారీ నష్టాన్ని చవిచూసింది. 4.8 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 40 వేల కోట్లు) నష్టం వచ్చినట్లు పెంటగాన్ అంచనా వేసిందని యాక్సియాస్ నివేదిక పేర్కొంది. దిగ్బంధనం అమలు సందర్భంగా రెండు ట్యాంకర్లను అమెరికా నేవీ స్వాధీనం చేసుకుంది. 53 మిలియన్ బ్యారెళ్లతో నిండి ఉన్న సుమారు 31 చమురు ట్యాంకర్లు ప్రస్తుతం గల్ఫ్‌లో చిక్కుకుపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. యూఎస్ నేవీ అడ్డుగా ఉండటంతో చైనాకు ఆయిల్ సరఫరా చేయడానికి ఖరీదైన, సుదూరమైన మార్గాలను కొన్ని నౌకలు ఎంచుకున్నట్లు వారు చెప్పారు. కాగా, శాశ్వత ఒప్పందం కోసం ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు తాత్కాలిక కాల్పుల విరమణ సమయంలో ఆ దేశ ఓడ రేవులపై అమెరికా దిగ్బంధనాన్ని విధించిన విషయం తెలిసిందే.

సోషియాలజీలో 'మోదీతత్వం'

- గుజరాత్‌లోని ఓ వర్సిటీలో పాఠం

వడోదరా, మే 2: గుజరాత్‌లోని ఓ యూనివర్సిటీ ప్రధాని మోదీపై సామాజిక శాస్త్ర విద్యార్థులకు ఒక పాఠం రూపొందించింది. ఆర్‌ఎస్‌ఎస్ చరిత్రనూ తన విద్యార్థులను బోధించాలని నిర్ణయించింది. 'దేశభక్తిలోని సామాజికత' అనే శీర్షికన కొత్తగా ఈ పాఠాలను వడోదరాలోని మహారాజా సాయాజీరావు విశ్వవిద్యాలయం అందించనుంది. రెండేళ్ల మాస్టర్స్ సోషియాలజీ ప్రోగ్రామ్‌లో వీటిని భాగం చేసి బోధించనున్నారు. మోదీపై పెట్టిన పాఠానికి 'మోదీ తత్వం' అని పేరుపెట్టారు. అలాగే, ఛత్రపతి శివాజీ, సాయాజీ గైక్వాడ్-3 కృషి, రచనలను కూడా విద్యార్థులకు పరిచయం చేయనున్నారు. దీనిపై ఆ వర్సిటీ సోషియాలజీ విభాగం అధిపతి వీరేంద్ర సింగ్ స్పందిస్తూ.. "ఇది మన ఇష్టాయిష్టాలకు సంబంధించిన అంశం కాదు. రాజకీయాలు, నాయకత్వాన్ని గురించిన ప్రస్తావన వచ్చినప్పుడు మోదీపై చర్చ తప్పనిసరి. ఆయన ఈ క్షేత్రంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న నేత. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త మాక్స్ వెబర్ తెలిపిన ప్రజాకర్షక నాయకత్వ లక్షణాలను మనం మహాత్మాగాంధీ, మార్టిన్ లూథర్ కింగ్‌లో చూశాం. అలాంటి నాయకుడే మోదీ. శాస్త్రీయమైన అంశంగా దీనిని పరిగణించి పరిశోధనలు జరపాల్సి ఉంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక నేత ఇంత సుదీర్ఘకాలం పదవిలో కొనసాగడం విశేషమని తెలిపారు.

ఆహారంపై యుద్ధ కోరలు

హోర్ముజ్ దిగ్బంధనంతో ఎరువుల కొరత.. తగ్గుతున్న పంట దిగుబడులు

- యారా ఇంటర్నేషనల్ సీఈవో స్వీన్ తోర్ ఆందోళన



లండన్, మే 2: హోర్ముజ్ దిగ్బంధనం కారణంగా భారీగా తగ్గిన ముడిచమురు లభ్యత అంతర్జాతీయ ఆహార భద్రతకు పెనుముప్పుగా పరిణమించింది. ఎరువుల తయారీకి తగినంత ముడిచమురు దొరక్కపోవడంతో.. ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా కుదిపేస్తోంది. ఫిబ్రవరి నెల చివర్లో ఈ యుద్ధం మొదలుకాగా.. అప్పటికి అంతర్జాతీయ విపణిలో దాదాపు 450 డాలర్లున్న టన్ను యూరియా ధర మూడువారాల్లోనే 700 డాలర్ల మార్కును దాటేసింది. ఎరువుల ధరలు భారీగా పెరిగిపోవడం, అదే సమయంలో పంటల మద్దతు ధరలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో రైతులకు ఎరువులను కొనే శక్తి నాలుగేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిందని ప్రపంచబ్యాంకు తన తాజా నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. ఎరువులు, వాటి తయారీకి అవసరమైన ముడిపదార్థాల సరఫరాకు ఆటంకం కలగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా వారానికి 1000కోట్ల భోజనాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని.. దీని ప్రభావం పేద దేశాలపై అత్యంత తీవ్రంగా ఉంటుందని ప్రపంచంలోనే అతిపెద్ద ఎరువుల తయారీ సంస్థల్లో ఒకటైన యారా ఇంటర్నేషనల్ సీఈవో స్వీన్ తోర్ హోల్‌సెథెర్ హెచ్చరించినట్టు బీబీసీ వార్తా సంస్థ ఒక కథనంలో పేర్కొంది. "యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 5 లక్షల టన్నుల నైట్రోజన్ ఎరువుల ఉత్పత్తి నిలిచిపోయింది. దీనివల్ల వారానికి 1000 కోట్ల భోజనాలు ఉత్పత్తి కాకుండా పోతాయి (ఆ 5 టన్నుల నత్రజని ఎరువులు అందుబాటులో ఉంటే వాటివల్ల పండే పంట 1000 కోట్ల భోజనాలకు సరిపోతుంది). నైట్రోజన్ ఎరువులు వాడకపోతే కొన్ని పంటల దిగుబడి 50 శాతం దాకా తగ్గిపోతుంది." అని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. పంట దిగుబడులు తగ్గిపోతున్న నేపథ్యంలో.. ఆహారం కోసం దేశాల మధ్య 'బిడ్డింగ్ వార్' జరిగే ప్రమాదం కూడా ఉందని స్వీన్ తోర్ ఆందోళన వ్యక్తం చేశారు. 'బిడ్డింగ్ వార్' అంటే.. ఆహార లభ్యత తగ్గిపోవడంతో దానికి డిమాండ్ పెరిగిపోతుంది. మార్కెట్లో తక్కువగా ఉన్న ఆహారం కోసం దేశాలన్నీ పోటీపడతాయి. ఈ పోటీలో.. అమెరికా వంటి సంపన్న దేశాలు ఎక్కువ డబ్బు వెచ్చించి తమ ప్రజలకు కావాల్సిన ఆహారాన్ని కొనేసుకుంటాయి. ఆయా దేశాలతో తులతూగలేని పేద దేశాల ప్రజలు ఆకలికి మలమల మాడిపోతారు.

మూడింట ఒకవంతు..

ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా యూరియా, పొటాష్, అమ్మోనియా, ఫాస్పేట్ల వంటి ఎరువుల్లో మూడింట ఒకవంతు సాధారణంగా హోర్ముజ్ జలసంధి గుండానే రవాణా అవుతాయి. ప్రపంచం మొత్తానికీ ఎగుమతి అయ్యే యూరియాలో సుమారు 45% నుంచి 50% వాటా కేవలం గల్ఫ్ దేశాలదే. ఇక, ఫాస్ఫేట్ ఎరువుల తయారీకి అత్యంత కీలకమైన సల్ఫర్ ఎగుమతుల్లో కూడా 50% వాటా గల్ఫ్ దేశాలదే. నత్రజని ఎరువుల తయారీకి కీలకమైన అమ్మోనియా వాణిజ్యంలో 20 నుంచి 25 శాతం గల్ఫ్ ప్రాంతం నుంచే జరుగుతుంది. హోర్ముజ్ మూసివేతతో ఈ ఎరువుల ముడిసరుకుల రవాణా ఆగిపోయింది. ఈ ప్రభావం భారత్‌పైనా తీవ్రంగా పడుతోంది.

పబ్లిక్ స్థలాల్లో నమాజ్ హక్కేమీ కాదు

- ప్రజా భద్రత దృష్ట్యా నియంత్రించవచ్చు
- అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్, మే 2: బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిర్వహణపై అలహాబాద్ హైకోర్టు కీలక నిర్ణయాన్ని వెలువరించింది. పబ్లిక్ స్థలాల్లో సామూహిక నమాజ్ చేయడం సంపూర్ణ హక్కేమీ కాదని, ప్రజాభద్రత దృష్ట్యా ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చని తెలిపింది. పబ్లిక్ స్థలాన్ని ఏ ఒక్క వ్యక్తిగానీ, గ్రూపుగానీ కేవలం నమాజ్ సహా, మత కార్యకలాపాలకు వినియోగించలేదని పేర్కొంది. అది శాంతిభద్రతలు, ఇతరుల హక్కులకు లోబడి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సరళ్ శ్రీవాత్సవ, జస్టిస్ గరిమా ప్రసాద్‌ల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ స్థలంలో నమాజ్ చేసేందుకు అనుమతించాలని కోరుతూ సంభల్ జిల్లా గున్నౌర్ తాలూకా, ఇకౌనాకు చెందిన ఆసిన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఈ నిర్ణయాన్ని వెలువరించింది. పబ్లిక్ స్థలంపై అందరికీ సమాన హక్కులు ఉంటాయని, కేవలం ఏ ఒక్కరో దాన్ని ఉపయోగించుకుంటామంటే అందుకు చట్టపరంగా అనుమతి ఉండదని స్పష్టం చేసింది. ప్రైవేటు స్థలాల్లో మతపరమైన కార్యక్రమాలకు సంబంధించి కూడా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎవరికైనా ప్రజా భద్రతకు లోబడే మతాన్ని ఆచరించే హక్కు ఉంటుందని, ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా ఆ హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందని ఇది ప్రయివేటు స్థలాలకూ వర్తిస్తుందని తెలిపింది. ప్రయివేటు కార్యక్రమాలైనప్పటికీ సాధారణ ప్రజానీకంపై అవి ప్రభావం చూపినప్పుడు వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

బలవంతపు మతమార్పిడి కేసులో నిదా ఖాన్‌కు ముందస్తు బెయిల్ నిరాకరణ



నాసిక్, మే 2: టీసీఎస్‌లో ఉద్యోగులను లైంగికంగా వేధించి, బలవంతపు మతమార్పిడిలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ కంపెనీ ఉద్యోగిని నిదా ఖాన్‌కు శనివారం స్థానిక కోర్టు ముందస్తు బెయిల్‌ను నిరాకరించింది. ఆరోపణలు తీవ్రమైనవి కావడంతో ఆమెను కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం ఉందన్న ప్రాసిక్యూషన్ వాదనతో ఏకీభవించింది. తాను గర్భవతిని కావడంతో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఆమె చేసిన వినతిని తిరస్కరించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.